# శ్రీసత్యసాయి పద్యసుధ

అడవిలోననున్న ఆకాశమున నున్న
పట్టణమున నున్న పల్లెనున్న
గుట్టమీద నున్న నట్టేటనున్నను
మదిని సాయి నిన్ను మరువడెపుడు.

అంకె తరువాత సున్నలకబ్బు విలువ
అటుల ఒకటౌ దేవుని కనిన పిదప
నీవు లెక్కగొను మనేక జీవగతుల
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు.

అంతరాత్మ కన్న అధ్యాపకుడు లేదు
అరయ కాలమె మీకు పరమ గురుడు
గ్రంథరాజంబేది? ప్రత్యక్ష లోకమే
ఎవడు స్నేహితుండు? ఈశ్వరుడె!

అక్కరకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున తా
నెక్కిన బారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ!

అక్టోబరు సోమవారం 20వ తేది
హంపినుండి వచ్చి స్కూలుకరగుచు బాబా
కాలరుపిన్నొకటి జారి కనబడలేదు
మార్పు కలిగెను నాడు
ప్రాపంచక సంబంధము పిన్నై తొలగెన్
క్షేత్రదర్శనము కూడ చెల్లెను హంపిన్
మాయ తొలగెనని గృహము వీడెను.

అడిగెదనని కడువడి జను
అడిగిన దను మగుడ నుడుగడని నడయుడుగున్
వెడవెడ సిడిముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమనడుగిడునెడలన్.

అతిగ భాషచేయ మతి హాని గూర్చును
మితగ భాషచేయ మతికి హాయి
మితహితంబు రెండు మతికిచ్చు శాంతిని
మితగ భాష సల్ప హితము గూర్చు.
అతిగ భాషించు శూరత్వమధికమయ్యె
కార్య శూరత శూన్యమై కరగిపోయె
బ్రతుకులాడంబరాలతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకులీపాటివాయె.

అదియు పూర్ణము ఇదియు పూర్ణము
పూర్ణమున ఉదయించు పూర్ణము
పూర్ణమున పూర్ణము తీసిన
పూర్ణమే శేషించి యుండు.

అద్దమందున ప్రతిబింబమంటనటుల
తామరాకులు నీటిచే తడవనటుల
పాపమంటదు మానవ భక్తి వలన
సత్యమునుజూపు మాట ఈ సాయి మాట.

అన్ని తెలియు వారు అవనియందున లేరు
ఏమి తెలియకుండ ఎవ్వడుండు?
కొంచెమెరుగు వాడు కించిజ్ఞుడగునయా
ఉన్న మాట తెలుపుచున్న మాట.

అమిత వాంఛల తోడనే అలమటించు
వారు విద్యార్థులగుదుర వాస్తవముగ
విద్యనర్థించు వారికే వినయమబ్బు
వినయమబ్బిన వాడె పో విజ్ఞుడగును.

అరయ చేతియందు అణుబాంబు ఉంచుక
అరచుచుంద్రు శాంతి శాంతి యనుచు
చంద్రు చేరగలిగి శాంతి చెందరు కదా
ఉన్న మాట తెలుపుచున్న మాట.

అరువది నాలుగు విద్యలు
అరుదారగ నేర్చినట్టి యా నారదుడే
నిరవధిక శాంతి కనుగొని
పరమానందము నాడు పొందడు గాదె.

అర్థ అధికార బలములు అరయనెల్ల
భక్తిముక్తుల సాధింప పనికి రావు
అటులె విద్యాధనముకూడ ఎట్టిదైన
దైవబలమొక్కటె నరుని దరిని జేర్చు.

అల్పజీవికి మంచి సంకల్పమున్న
గొప్ప గౌరవాదరము గైకొన గలండు
ఉడుతబుడుత రాముని ప్రేమనొందలేదె
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు.

అల్పబుద్ధినెంత అభిమాన పరచిన
కడకు కీడు చేయు ఘనునినైన
విషపు ఫణినిదెచ్చి విపరీతముగబెంచ
కాటువేయజూడు కనదు మేలు.

అవతరించుట యనుటలో అర్థమేమి?
నరులపై ప్రీతి వాత్సల్యపరత తోడ
వారి స్థాయికి దైవంబు వచ్చు భువికి
జీవ ప్రజ్ఞతొబాటుగ దైవ ప్రజ్ఞ.

అవని జల్లినదేదియో అదియె పండు
కారణంబును లేకేల కలుగు భక్తి
చెడ్డకును చెడ్డ మంచికి చెల్లు మంచి
దాని తప్పింప నెవ్వరి తరము కాదు.

అవని మ్యాపుజూచి అన్ని దేశములంత
తెలిసిపోయెనంచు దేలిపోకు
ఒక్క దేశమైన ఒనరంగ వెదకుచు
చూచి తిరిగినపుడె సుఖముగల్గు.

అహము కలిగిన దేవుడు కానరాడు
అహము చచ్చిన పరమాత్మనందవచ్చు
అహము ఆత్మతో కూడిన అదియె ముక్తి
సత్యమును తెల్పుమాట సాయిమాట.

అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న
నోరెత్తరు, కోపగించరు, ఎటకేగరు, భీతిలబోరు గోపికల్
పొత్తములందు చిత్తరువురీతిగనుండెను కృష్ణుడు వారిలో!

అమ్మా! మన్నుదినంగ నే శిశువునో యాకొంటినో వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరి మాటలు మదిన్ నన్నీవుగొట్టంగ వీ
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్యగం
ధమ్మాఘ్రాణము చేసి నా వచనముల్ తప్పైన దండింపవే.

అల్లాయంచు మహమ్మదీయులు జహోవాయంచు సత్రైస్తవుల్
ఫుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వనెల్లరకు నాయుర్భోగభాగ్యాది సం
పల్లాభంబులొసంగి బ్రోచు నొకడే భవ్యుండు భావింపుడీ!

అంధకారంబెల్ల హతమారునేచూడ
వసుధలో దీపంపు వార్త వలన
ఆకొన్న వారికి ఆకలి తీరునే
పంచభక్ష్యపు పేర్లు పరగ విన్న
నిరుపేదవాని పేదరికంబు పోవునే
విత్త ప్రభావంబు విన్నయంత
రోగపీడితుని బల్ రోగాలు పోవునా
ఔషధ మహిమము అంతవిన్న
శాస్త్రజాలంబునంతయు చదివినంత
దట్టమైనట్టి అజ్ఞాన తమము తెగున
ఆచరణలేని విద్యలు అవనియందు
దండి నేర్చిన ఫలమేమి? గుండుసున్న.

అఖిల మానవులకునానంద మొనగూర్చి
రక్షించుచుండుటే దీక్ష నాకు
సన్మార్గమును వీడి చరియించు వారల
పట్టి కాపాడుటే వ్రతము నాకు
బీదసాదలకైన పెనుబాధ తొలగించి
లేమిని బాపుటే ప్రేమ నాకు
మంచిచెడ్డలు కూడ మనసులో సమముగా
భావించుచుండుటే భక్తి నాకు

అనగబేరొంది నాయండ నలరువారి
నెన్నడును మరువనివాడనన్న మాట
ఎట్టి కుత్సితము మదికి నేర్పకుందు
అట్టి నాపేరు చెడుట ఎట్లగును భువిని!

అడవి పక్షులకెవ్వడాహారమిచ్చెను
మృగజాతి కెవ్వడు మేతబెట్టె
వనచరాదులకు భోజనమెవ్వడిప్పించె
చెట్లకెవ్వడు నీళ్ళు చేది పోసె
స్త్రీల గర్భంబున శిశువునెవ్వడు పెంచె
ఫణులకెవ్వడు పోసె పరగపాలు
మధుపాళికెవ్వడు మకరందమొనగూర్చె
బసులకెవ్వడొసగె బచ్చిపూరి
జీవకోట్లను పోషించ నీవెగాని
వేరు దాత లేదు కదయ్య వెదకి చూడ!

అనిశంబు అత్యంత అనురాగ భోగాను
రక్తులై సుజ్ఞాన సక్తులగుచు
స్వపర భేదము లేక సర్వ జీవుల యందు
సమభావమునుజూపు సరసులగుచు
కష్టజీవులయందు కరుణను చూపించి
తగిన సాయముజేయు దాతలగుచు
దాంపత్య ధర్మంబు ధరణిని వెలయంగ
పరులకు నాదర్శ సరణి యగుచు
జగతి సత్కీర్తిగాంచి శ్రీసాయి కృపను
సాటి మానవులందెప్డు మేటియగుచు
నిత్యమును ధర్మజిజ్ఞాస నిరతులగుచు
ఉత్తమోత్తమ వ్యక్తులైయుంద్రుగాక!

అన్న దానము కన్ననధిక దానంబేది?
తల్లిదండ్రుల కన్న దైవమేది?
జపతపంబుల కన్న సత్యశీలంబేది?
దయ కంటెనెక్కువ ధర్మమేది?
సుజన సంగతి కన్న చూడలాభంబేది?
క్రోధంబు కన్న శత్రుత్వమేది?
ఋణము కంటెను నరునకు రోగమేది?
ధరణినపకీర్తి కంటెను మరణమేది?
సరిగ సత్కీర్తి కంటెను సంపదేది?
స్మరణమునకు మించునాభరణమేది?

అహంకార పడకు నరుడా!
వెనుక ముందు తిరిగి చూడు
మమకారము వలదు నీకు
బ్రతికినవాడెవడు లేడు
ఇది నాదని పలుకుదువా
వెంటనెవరుగొనిపోరు
పాపపుణ్యములతో కూడి
మరణింతువు ఓ కిలాడి!

అడుగకువె ఓ మనసా
అడుగు కొలది అది అడుగున పడునని ॥అడు॥
అడుగని శబరిని ఆదరించదే
అడుగక తనకై మడియు జటాయువు
కడకునేగి సద్గతి కల్గించదే ॥అడు॥

అత్తవారింటికేగుమో కొత్త పెండ్లి
కొడుక! అందు నీకెక్కువ సుఖముగల్గు
ముద్దు మరదలు నీతోడ ముచ్చటాడు
వదిన మాటికి నీతోడ వరుసలాడు
ఊరివారంత మన్ననలతిగ సల్ప
మామ కూడ నీకు అడుగుల మడుగులొత్తు
పోయి రావయ్య అత్తవారింటికి నీవు.

అహరవ తవ ఆహ్వాన ప్రచారిత సునితవ ఉదారవాణి
హిందుబౌద్ధశిఖ్జైన పారశిక ముసల్మాన్ క్రిస్తానీ
పూరబ్ పశ్చిమ ఆశే తవ సింహాసన పాసే
ప్రేమహార్ హొయగాథా జనగణ ఐక్యవిధాయక
జయహే భారత భాగ్యవిధాతా!....

ఆటలపాటల బాల్యంబాయెను
ప్రాయములో ప్రేమాయణమాయెను
ముదిమిని చింతలు ముదిరేపోయెను
పరబ్రహ్మకాబట్టక పోయెను.

ఆత్మతత్వమెరుగ ఆనందమబ్బును
తత్త్వమెరుగకున్న తాపమబ్బు
బ్రహ్మమెరిగినంత బ్రహ్మమే అగునయా
సత్యమైన బాట సాయి మాట.

ఆత్మ నిత్యము దానిని అణచ లేరు
చావులేదాత్మనెవ్వరు చంపలేరు
జీర్ణ వస్త్రము మరలించుదానివోలె
దేహమును వీడి తరువాత దేహమౌను.

ఆత్మశుద్ధి లేని అవని చదువులందు
క్రోధమత్సరములు కూడియుండు
చీకటింటిలోన చేరును గబ్బిలం
బున్నమాట తెలుపుచున్న మాట.

ఆధునిక విద్య పెరిగెను అవధి లేక
ఆత్మ తేజము క్షీణించి తరిగిపోయె
బ్రతుకు ఆడంబరాలతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకు యీపాటిదాయె.

ఆస్తిక బుద్ధి పోయె మరియాదల ధర్మము రూపుమాసె బల్
నాస్తిక బుద్ధి హెచ్చె గురువన్నను శ్రద్ధయు పోయె భక్తికిన్
స్వస్తి సనాతనంబయిన విద్యల వీడెడి కాలమయ్యెడిన్
నిస్తులగౌరవాదరణ నేలకుగోలకు వచ్చె విద్యలో!

ఆంగ్ల భాషా మోహమావరించిన నాడె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లిన నాడె
సంస్కార భావంబు సమసిపోయె
సంస్కార భావంబు సమసిపోయన నాడె
ధర్మంబు క్షీణించె ధరణియందు
ధర్మము క్షీణమై ధరణి తొలగిన నాడె
భారతీయోన్నతి భగ్నమయ్యె
కాన యిపుడైన మీరలు కన్నుదెరచి
తెలివితోగాంచుడో భారతీయులార
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ఆకారమే లేని ఆ నిరాకారున
కెట్టి రూపము దిద్దనెవరి తరము!
కరచరణంబులే కలుగని వానికి
ఎట్టి సొంపులు మదినెంచగలరు!
ఇట్టిది అట్టిది ఈ రూపు ఆ రూపు
అని పల్కెడి పల్కు హాస్యదంబు
కోటి సూర్యుల దీప్తి మేటిగల్గినదంచు
పల్కెడి పల్కులు పావనములె!
రూపమేలేని శక్తికి రూపుదెల్ప
నెవరి సాధ్యము ఎవరైన ఎరుగగలరె
శక్తిరూప రహితయై అనాదినుండి
దిగ్దిగంతములందున దీప్తినొందె.

ఆ నంద బాలుడే ఆనంద బాలుడై
    తనవారి గుర్తింప తరలి వచ్చె
ఆ రామచంద్రుడే ఆరామ చంద్రుడై
    తన బంటులను కనుగొనగ వచ్చె
ఆ మహావిష్ణువే ఈ మహీవిష్ణువై
    తన ఆయుధము చేకొనగ వచ్చె
ఆ ఈశుడే బాలసాయీశుడై నేడు
    తన గుంపుతోనాడుకొనగ వచ్చె
అట్టి పరమాత్మయను బొమ్మలాటగాడు
తాను జీవుల రంగస్థలాన నిలచి
ఆడు ఆనాటి ఈనాటియాటలరసి
సుంత వర్ణించి సంతసము కొంతగనుడు.

ఆనాడె వేణువునై పుట్టియున్నచో
        నీ మోవి మధువుల గ్రోలకున్నె
ఆనాడె తోమాలనై యెదనున్నచో
        నీ స్పర్శ నన్నోచినేలకున్నె
ఆనాడె గోపినై యలరుచునున్నచో
        నీ రూపు నా లోన నిండకున్నె
ఆనాడె గోపార్భకుండనై యున్నచో
        నీ మైత్రి భాగ్యంబునొందకున్నె
నాడు కాజాలదింక ఈనాడు స్వామి
నీవు నాడును నేడును నీవె కావ
నాటి ప్రాప్తినియొసగి నన్నేలుకొమ్ము
బాలగోపాల వేణుగోపాలబాల
నన్ను కావుము దేవ శ్రీసాయిదేవ.

ఆకుపచ్చ పక్షులన్ని చిలుకల వలె పలుకునా?
పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?
పులిచర్మముగప్పినట్టి గాడిద తా పులియగునా?
ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?

ఆశలనే లతలున్నవి..అల్లుకొనును..పెంచరాదు
కోరికలనే తరువున్నది..పెరుగు..నీరు పోయరాదు
క్రోధమనే పామున్నది..కాటుకు గురికారాదు.

ఇంటిలోని జ్యోతి యెంతయో వెల్గగా
పరుల యింటికగ్గికరుగనేల?
తాను దైవమయ్యు దైవంబు మరచుట
తనను తానె మరచినట్లు కాదె!

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందేగలడు దానవాగ్రణి వింటే.

ఇంద్రియములార చేయుడీ ఈశ పూజ
మనస చేయవే మదనారి మంత్ర జపము
జ్ఞాన భిక్షనొసగెడి ప్రజ్ఞానియతడె
లెమ్ము తెలుసుకో నీలోని ఆత్మశుద్ధి.

ఇచ్చినట్టి పనిని మెచ్చినటుల చేయ
సార్థకంబులగును సమితులన్ని
అటుల చేయకున్న ఆత్మద్రోహమె కదా
మరువబోకుడిట్టి మంచి మాట.

ఇది నాదు మాతృదేశము
ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం
చెదగొట్టి నుడువనేరక
బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!

ఇనుప పాత్రయైన హేమపాత్రంబైన
నీటితోటి గుణము వాసికెక్కు
మనసు మంచిదైన తానెటులున్ననేమి?
ఉన్నమాట తెలుపుచున్న మాట.

ఇనుము విరిగినంత ఇరుమారు ముమ్మారు
కాల్చియతకగలడు కమ్మరీడు
మనసు విరిగినంత మరి చేర్చగలరయా
ఉన్నమాట తెలుపుచున్న మాట.

ఇసుకలో వర్షజలధారలింకిపోవు
మధురమై నిల్చు రేగడి మసకనేల
చిప్పలోబడి ముత్యమై చెన్నుమీరు
అటులె ప్రాప్తానుసారమైయలరు విద్య.

ఇక్షురసము కన్న ద్రాక్షరసము కన్న
పువ్వు కన్న పాప నవ్వు కన్న
మధురమోహనములు మాసాయి పలుకులు
శాంతి ప్రేమదాయి శ్రీసత్యసాయి

ఇప్పుడో ఇంకనో ఈవొత్తువంచును
ఎప్పటికప్పుడె ఎదురుచూచి
ఈ పొద్దు రేపైన ఏలుదువంచును
ఏ పొద్దు ఆశతో ఎదురుచూచి
ఈనాడొ మరునాడొ ఈవె చూచెదవంచు
ఏనాటికానాడె ఎదురు చూచి
ఇత్తువో దర్శనం వత్తువో నేడంచు
ఏ గంటకాగంట ఎదురు చూచి

వేచియుంటిని నీకునేవేళ మనసు
పుట్టునో నాడె నాకది పుణ్యదినము
అట్టి దినమునకై కాచెద ఆత్మరూప
ఎట్టులైనను నా వాంఛ తీర్పవప్ప.

ఇది ఘటంబిది పటంబిది గృహమ్మిది కుడ్య
మిది అరణ్యము శైలమిదియటంచు
ఇది భూమి యిది జలంబితడు వైశ్వానరుం
డిది గాలి ఆకసంబిదియటంచు
ఇతడు దివాకరుండితడు నిశాకరుం
డివి తారలు గ్రహంబులివియటంచు
ఇవి అచేతనములౌ ఇవి చేతనములంచు
అతడీతడితడాతడేయటంచు
అరయ నాకంటె భిన్నంబులై జడంబు
లైన బాహ్యపదార్థ సహితములెల్ల
సాధనలు లేక ఎఱిగెడి సాక్షివగుచు
నేను చిద్రూపుడటచునునెరుగరయ్య!

ఇది చేతునది చేతునింకెన్నియో చేతు
ననుచునూహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి ఇచ్చటనుంటివో
ఆ ఫలములే నీకు అందుచుండు
విత్తనంబొకటైన వేరైన ఫలములు
సమకూరుటది ఎట్లు సాధ్యమగును?

ఈ చెరలో నుండి వెళ్ళేనా
ఇక రాముల కన్నులు చూచేనా
ఆ శ్రీరాముల కన్నులు చూసేనా
నాడు పెండ్లాడిన రాముడు
ఇడ నా జాడలో రాకయున్నాడు
ఎన్నడు తన కౌగిలి ఎడబాయకుంటినె
పన్నుగ పది నెలలాయెనె
ఈ చెర నుండి వెళ్ళేనా
ఇక రాముల కన్నులు చూచేనా
ఓ ముద్దు మరది లక్ష్మణా
నిను దోషములాడితి సద్గుణా
నోటి మాటలు ఎంతో
నాకె వచ్చినవి ఏమని దూరితినో
విడిచిపోతివ తండ్రీ!

ఉత్తమ పురుషుల కోసము చేసిన
చిత్తము నిలుచును నిజమండి
మత్తుడై మరి మోహము చెందిన
మొత్తును యముడిట నిజమండీ.

ఉపకారికినుపకారము
విపరీతముగాదు చేయ వివరింపంగా
అపకారికినుపకారము
నెపమెన్నక చేయువాడె నేర్పరి సుమతీ!

ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిం లేరు కిం
చిద్ద్రోహంబును నీకు చేయరు బలోత్సేకంబుతో చీకటిన్
భద్రాకారుల పిన్న పాపల రణప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింపనకటా నీ చేతులెట్లాడెనో!

ఉద్యోగములు చేయనువిదిలందరు పోవ
గృహ కృత్యములుదీర్చు గృహిణులెవరు?
ఆలుమగలిరువురు ఆఫీసులకుబోవ
ఇంటి పనులుజేయు ఇంతులెవరు?
పర బాలురకు నేర్ప పాఠశాలలకేగ
తమ బాలురకు నేర్పు తల్లులెవరు?
పుస్తకాల్ చేబట్టి పురుషుల వలెబోవ
వంటయింటిని దిద్దు వనితలెవరు?
డబ్బు వలన కలుగు యిబ్బంది తీరిన
ఇంటిలోని కొరతలెంతయుండు
సుఖము చూడబోవ సున్నయేయుద్యోగ
పదవియందునున్న పడతికెపుడు.

ఉన్నాడయా దేవుడున్నాడయా కన్నులకు కనిపించకున్నాడయా ॥ఉ॥
లోకాల చీకట్లు పోకార్ప రవిచంద్ర దీపాలు గగనాన తిప్పుచున్నాడయా ॥ఉ॥
లక్షలాదిగనున్న నక్షత్రములనెల్ల నేల రాల్పక మింట నిల్పుచున్నాడయా ॥ఉ॥
ఈ ధారుణీ చక్రమిరుసు లేకుండగా ఎల్లవేళల తిప్పుచున్నాడయా ॥ఉ॥
జీతభత్యము లేక ప్రీతితో మనకొరకు గాలిలో సురిటీలు విసరేడయా ॥ఉ॥
ఆధారమే లేక అలరారుచున్నట్టి ఆకాశమును ఆపుచున్నాడయా ॥ఉ॥
పొంగి పొరలుచు వచ్చి పృధ్విపై పడకుండ కడలిరాజు కాళ్ళు ముడిచాడయా॥ఉ॥
కనిపించకేమి చేస్తున్నాడయా?
తెరచాటు తానుండి తెరముందు ప్రజనుంచి తైతక్కలాడించుచున్నాడయా ॥ఉ॥

ఊరక సజ్జనుండొదిగి యుండిననైన దురాత్మకుండు ని
ష్కారణ మోర్వలేక అపకారము చేయుట వాని విద్యగా
చీరలు నూరు టంకములు చేసెడివైనను పెట్టెనుండగా
చేరి చినింగిపోగొరుకు చిమ్మటకేమి ఫలంబు భాస్కరా.

ఎందు మట్టితోడ కుండలు కుమ్మరి
చేయలేడు నీరు చేర్చకుండ
సృష్టి హేతువగును శివశక్తులిరువురు
వినుము భారతీయ వీరసుతుడ!

ఎట్టి కర్మను తనయందు పెట్టుకొనక
దైవమందున నిలిపి తా ధర్మపథము
తప్పకుండగజేసిన నెప్పుడైన
ప్రాణికంటదు సుఖదుఃఖ ఫలమదేది.

ఎట్టి విద్యలు జగతిని ఎరుగనట్టి
పక్షిజాతులు పశువులు పరమమైన
నీమమునుబూని జీవింప నేర్చియుండ
తెలివి కలిగిన మనుజుడే తెలివిదప్పి
బ్రతుకుచున్నాడు మనుజుకీ తెలివి లేదె
ఉన్నమాట తెసుపుచున్నమాట.

ఎడమచేతి కడాన రెండుతుంటల విల్లు
తోలు పట్టెడగట్టి యాడాలగడతారు
ఏటి వేషాలప్ప యివి
ఇవి కంటితో చూచేటి కాని అవతారాలు.

ఎద్ది లేదనుచుంటిమో అద్ది కలదు
ఎద్ది కలదనుచుంటిమో అద్ది లేదు
ఉన్నదాతడే దైవంబు ఎన్నటికిని
లేనిదయ్యను విశ్వంబు కానరయ్య.

ఎదుటనున్న స్వామినెరుగంగ లేకను
దేవుడెక్కడనుచు తిరుగుచుంద్రు
వెన్న విడిచి నేయి వెతుకులాడినయట్లు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి అన్యుల మనముల్
నొప్పించక తా నొవ్వక
తప్పించుక తిరుగు వాడు ధన్యుడు సుమతీ!

ఎన్ని విద్యలైన ఏపారి చదివిన
పొట్టకూటికైన గిట్టబోవు
మట్టిబొమ్మలోని మర్మంబు తెలుపని
చదువులెల్ల పరము చేర్చగలవ.

ఎన్ని నిద్యలు నేర్చిన ఏమి ఫలము
నొసటి వ్రాతను తప్పింపనెవరి తరము
చెడ్డ బుద్ధులు తన తల చేరెనేని
ఎండబారును బుద్ధులు బండబారు.

ఎల్ల భూతములందు తానేకమగుచు
భిన్న దేహములందున భిన్నమగుచు
అవ్యయంబై వెల్గొందుచు ఆత్మత్తత్వ
మరయ జ్ఞానంబె సార్థకంబగును పార్థ!

ఎవతె భార్య యింకెవరో బిడ్డడు
ఎంత చిత్రమో ఈ సంసారము
ఎవరివాడవెవ్వడెటు వచ్చితివి
తత్వమొక్కటె తెలియర తమ్ముడ.

ఎట్టి మంటయో అట్టి పొగ
ఎట్టి పొగయో అట్టి మేఘం
ఎట్టి మేఘమో అట్టి వర్షం
ఎట్టి వర్షమో అట్టి పంట
ఎట్టి పంటయో అట్టి వంట
ఎట్టి వంటయో అట్టి భావం.

ఎంత మంచి తీపు మీరంతా సేవింపుడీ
రాతిని బలు ప్రీతిని ధర నాతిగ జేసిన
సీతాధినాధుడైన శ్రీరామచంద్రనామ ॥ఎంత॥
పోవును దుర్భావము రాబోవు సద్భావముల్
ద్రావంగ ద్రావగన్ పాపమెల్ల బాపగన్
చక్కెరకో నిక్కము బల్ మెక్కెద మదమెక్కగన్
గ్రుక్కంగ గ్రుక్కగన్ కోదండ రామనామ ॥ఎంత॥
దక్షిణ పరీక్షణ ఉపేక్ష చేయజాల నా
పక్షీంద్ర వాహుడైన పట్టాభిరామనామ.. ॥ఎంత॥

ఎద్దునెక్కినా గ్రద్దనెక్కినా ఇద్దరు ఒకటే ఓ నరుడా
లింగ లింగ శివలింగ లింగయని రంగని తిట్టకు ఓ మనసా!
ధనధాన్యములు ఎన్ని ఉన్ననూ కడకు రావురా ఓ నరుడా!
పరమ పావన పరమ శివుని శరణు కోరుము ఓ నరుడా!
అప్పు చేసుకొని యాత్రలు చేయుట తప్పుతప్పురా ఓ నరుడా!
ఆడంబరములు ఆవలనెట్టి ఆత్మ దర్శనము చేయుమురా!
జాగుచేయక జీవితమంతయు వేగుచుక్కవలె గడుపుమురా!
చదువుసంధ్యలు ఎన్నినేర్చినా స్వామి సేవతో చాలవురా!
మధురమైన ఆ నామము తలచిన మార్గము నీకే చూపునురా!
చెప్పే మాటలు పెడచెవి పెట్టి తప్పులు చేయకు ఓ నరుడా!
అగ్నివంటి ఆ సత్యము కనుగొని గొప్ప మార్గమున నడువుమురా!

ఎవరు చేసిన కర్మ వారనుభవించక ఏరికైనను తప్పదన్నా!
ఏనాడు ఏతీరు ఎవరు చెప్పాగలరు
అనుభవించుట సిద్ధమన్నా!
రాముడంతటివాడు రమణి సీతను బాసి
పామరుని వలె ఏడ్చెనన్నా!
అలనాటి పాండవులు ఆకులలములు మేసి
అడవిపాలై పోయిరన్నా!

ఏది ఎరిగిన సర్వంబు ఎరుక పడునొ
ఏది తెలియక సర్వంబు ఎరుక పడదొ
అట్టి పరవిద్య నేర్పెడునతడె గురువు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

ఏది ఎరిగిన సర్వంబు ఎరుక పడునొ
ఏది తెలియక సర్వంబు తెలియబడదొ
అదియె పరవిద్యయనబడు నట్టిదాని
తెలిపి బోధించు సద్గురున్ తెలియనగును.

ఏను దైవంబు తద్భిన్నమేమి కాదు
ఆ అఖండ పరబ్రహ్మమౌదు నేను
వ్యధయు క్లేశముల్ నన్ను స్పృశింపబోవు
సచ్చిదానందమేను తద్భిన్నమేమి కాదు
నిత్య తృప్తుడ భీతినన్ చేరబోదు
ఉల్లమా! పల్కుమోంత్సత్తంచునెపుడు.

ఏమి తా కొని వచ్చె ఏమి తా గొనిపోవు
పుట్టినప్పుడు మరి గిట్టునపుడు
ధనమెక్కడేగు తానేగు నెచటికి
చెప్పరయ్య మనస్సు ఒప్పునటుల.

ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్చవచ్చు
ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలుకాదు
కలి బోధలు నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగున
తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతంబు నింపనగునా!

ఏ హృదయంబునొసగితివొ ఈశ నాకు
మగిడి దానినే యర్పింతు మహితమూర్తి
పరగ వేరేమిదెత్తు నీ అర్చనకును
అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు.

ఏ దేశమేగినా నీ నామమే సుమీ
సత్యసాయీయంచు నిత్య పఠన
ఏ యూర చూచినా నీ నామమే సుమీ
సత్యసాయీయంచు నిత్య జపము
ఏ నోట విన్నను నీ నామమే సుమీ
సాయిరామాయంచు నిత్య జపము
ఎచ్చోట చూచినా నీ నామమే సుమీ
సత్యసాయీయంచు నిత్య భజన
విశ్వమెల్లడ వ్యాప్తియై వెలయునట్టి
భక్త జనులకు ప్రాపుడై బరగునట్టి
భక్తినొసగి రక్షించెడు శక్తి మయుడు
పర్తివాసుడు మిమ్మేల హత్తుకొనడు!

ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
ప్రహ్లాదు పాలింప పరమపురుషు
ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
కరినిగాచెడి తరి కమలనయను
ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
ధ్రువకుమారుని సాక రూఢిమీర
ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
పేదకుచేల్రోవ వేదచరితు
డాగుణంబె గణించి యాయమరవంద్యు
డార్తజనులను పాలించునట్టివాడు
శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు
వెల్గె పర్తీశుడై నేడు ఫృద్వియందు.

ఏ ప్రేమ శక్తిచే నీ ధారుణీ చక్ర
మిరుసు లేకుండగా తిరుగుచుండు
ఏ ప్రేమ శక్తిచే నెల్ల నక్షత్రాలు
నేల రాలక మింట నిలచియుండు
ఏ ప్రేమ శక్తిచే నీ పుడమి బడక
కడలిరాయడు కాళ్ళు ముడుచుకొనియె
ఏ ప్రేమ శక్తిచే ఏడేడు లోకాలు
గాలి దేవుడు సురిటీలు విసరె
ఆ మహా ప్రేమ శక్తియే ఆత్మ శక్తి
అద్భుతమనంతమద్వితీయమగు శక్తి
నిండియున్నది బ్రంహ్మాండ భాండమెల్ల
ఈ మహా సృష్టియంతయు ప్రేమమయమే.

ఏలా నిరాశ పర్తీశుండుండా ఏలా నిరాశ
సాయీశుండుండ ॥ఏలా॥
పాలించు స్వామి నీ ప్రక్కన నిలబడి
ఆలకించుచూ నీకు దాపుగనుండగ ॥ఏలా॥
తల్లి బిడ్డలు కూడి వేళవేళలయందు
సాయినాధుని పూజ సలుపుచునుండగ ॥ఏలా॥
దీవించు దేవుడు నీ దిక్కైయుండగ
దీన చింతలేలా దిగులొందకె మనసా ॥ఏలా॥
పారమార్థికములలో పడరాని బాధలలో
పడుచున్న భక్తులకు పట్టుకొమ్మెయుండ ॥ఏలా॥
ప్రేమించు సాయి నీ ప్రాపైయుండగ
పశ్చాత్తాపములలో పడబోకు ఓ మనసా ॥ఏలా॥

ఐకమత్యంబు జ్ఞానంబునందజేసి
జ్ఞాన జ్యోతిని వెలిగించు దేశమిదియె
ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార.

ఐకమత్యమె సుఖమందరి క్షేమంబు
ఎంత కార్యమైన నెగ్గవచ్చు
చిన్న చీమలన్ని సర్పంబునున్‌బట్టి
చంపుచుండలేదె జగతియందు.

ఒకటి మంచియనుచు ఒకటి చెడ్డయటంచు
సృష్టియందు నిర్ణయింపనగునె
ఇదియునదియు ఒక్క ఆశ్వరుండె చేసె
ఉన్నమాట తెలుపుచున్న మాట.

ఒక్క పొద్దు మాట కుక్కయేమెరుగును?
అటుకుల రుచి ఎద్దుకెటుల తెలియు?
ఖరముకేమి తెలియు గంధంబు వాసన?
సత్యనిత్యంబు జ్ఞానంబనంతమైన
ఆత్మతత్త్వమెరుంగుడో ఆర్యులార!

ఒకరి మేలునుజూచి ఓర్వలేకున్నారు
ఈ అసూయ బుద్ధి నీకేలనయ్యా?
ఒకరి పదవిజూసి ఓర్వలేకున్నారు
ఈ ఈర్ష్యబుద్ధి నీకేలనయ్యా?
ఒకరి సంపదజూచి ఓర్వలేకున్నావు
ఈ నీచ బుద్ధి నీకేలనయ్యా?
ఒకరి శక్తిజూచి ఓర్వలేకున్నావు
ఈ హీన బుద్ధి నీకేలనయ్యా?

ఒక్క గూటి పిట్టలం
ఒక్క తీగ పువ్వులం
ఒక్క తల్లి పిల్లలం
ఒక్క జాతి బిడ్డలం
మనలో మనకు కలతలెందుకు.

ఓంకారమనియేటి ఒక తొట్టిలోను
తత్త్వమసియనియేటి పరుపు తా పరచి
ఎరుకనే బాలుని ఏమరక ఉంచి
ఏడు జగముల వారు ఏకమై ఊప జోజో..
ఓంకార రూపుడు ఉపదేశకాయుడు
నవనీత చోరుడు నరసఖుండు
మోహనరూపుడు ముక్తి ప్రదాయుడు
భక్తార్తి శమనుండు భవహరుండు
గర్వాపహారుడు కమనీయ చేలుడు
వనమాలధారుడు భవహితుండు
తేజస్వరూపుడు ప్రేమస్వభావుడు
వారిజ నయనుండు కారణుండు

సుజన మానస చోరుడు సుందరుండు
దేవకీగర్భ రత్నంబు దేవకుండు
వాసుదేవుడు యదువంశ వర్ధనుండు
భక్త హృదయాంతరుండు మీ వెంట నుండు.

ఓయిరామా! సాయిరామా! నీవు నా అండనుండు కోదండరామా!
మంచిగానె వచ్చి ఈ సంసార వార్ధి
నన్ను ముంచివేసెనయ్య ఈ మోహవార్ధి
ఎంచిచూడ నీకేది మించదయ్య
దయయుంచి దరి చేర్చవయ్య ఓడవొాచు ॥ఓ॥
పాపాల పుట్టినిల్లు పావనాంగ
ఈ కోపమన్న రావణుండు కోమలాంగ
ఏపుమీర పదితలల పాపరాజు
వారి రూపు మాపి నా తాపము బాపవయ్య ॥ఓ॥
వానరములనెల్లనేలి వానివల్ల కాని
కార్యమలరజేసి బ్రోచినావె
వానికన్న నేను తీసిపోను రామా
గాన నన్నుకూడ వేగ దిద్ది కావరావె! ॥ఓ॥

కంచునందె మ్రోత ఘనముగానుండును
కనకమందు మ్రోత కానరాదు
అల్పులందునుండు ఆడంబరము మెండు
పరగ మెరుగులేల భక్తులకును.

కంటిగ్రుడ్డుకు కాటుక అంటనట్లు
జిడ్డునేమాత్రమంటక జిహ్వయుండు
బురద అంటని తామరపూవునట్లు
దేనినంటకయుండును దివ్యమాత్మ.

కట్టెలందున నిప్పులు కలుగునట్లు
తిలలయందున తైలంబు వెలయు పగిది
ఎందుజూచిన దైవంబె యిమిడియుండు
విశ్వసించుడు మదిని విద్యార్థులార!

కనిపించునదే నిజమందురు
కనిపించనిదెల్ల కల్లయందురు
కనిపించనిదే తినిపించును మీ
కర్మ ఫలంబుల మర్మము జీవా!

కనులకగుపడు దృశ్యంబుగాంచి మీరు
సత్యమిదియని ఎంచక సంబరమున
తెరను దాగిన సత్యంబు తెలిసికొనగ
విశ్రమింపక నాతోడ వెడలి రండు.

కనులలోన కలుగు కాంతియే దేవుండు
పిలుపులోన కలుగు ప్రియమునతడె
మేథ ఉన్నదంచు మీరకు దైవాజ్ఞ
కూలద్రోయజూచు కుటిలునెపుడు.

కన్నులందు నెప్డు కారుణ్య దృష్టియే
పలుకులెపుడు ప్రీతులొలుకుచుండు
నగుమోము నిత్యమునమృత భావమే
హృదయమెప్పుడు ముదముగూర్చు.

కప్పూరంబు తెలుపు కామధేనువు తెల్పు
చుక్క తెలుపు హంస రెక్క తెలుపు
అందమైన సాయి మందహాసము తెల్పు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

కరవాలము పట్టగనే శూరత్వము కుదురునా?
ధనుర్బాణము పట్టినంత విలుకాడగునా?
వీణ చేతబట్టినంత నాదశుద్ధి కలుగునా?
పెన్ను చేత పట్టినంత పాండిత్యము పొందునా?

కర్మమునబుట్టు జంతువు
కర్మముననె వృద్ధిపొందు కర్మమున చనున్
కర్మమె నరునకు దైవము
కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో.

కర్మమును చేయ నరునకుగలదు హక్కు
కర్మఫలమీయ ధాతకు కలదు హక్కు
అడుగ ఫలముల ఏరికి హక్కు లేదు
ఇంతకన్నను వేరెద్ది  ఎరుక పరతు.

కర్మచేతను జ్ఞానంబు కలుగుగాని
జ్ఞానియొనరించు కర్మ అజ్ఞాని కొరకె
పూజ్యులరసిన మార్గంబు పూనిరేని
ఆత్మ జ్ఞానము యలవడు అవనిలోన.

కర్మ మార్గంబు విడరాని కాలిబాట
భక్తి మార్గంబు సులువైన బండిబాట
జ్ఞానమన విమానంబుపై యానమరయ
యోగమననింక జలధిపైయోడగాదె.

కలతదీర్చునొకట కలలోన కనిపించి
ధ్యానమందుదోచి దరికి పిలుచు
మనసులోనెయుండి మంచికి నడిపించు
భావమందుంచి మెలగుటే భక్తి పథము.

కష్టసుఖములు రెండును కలసియుండు
వాని విడదీయనెవరికి వశముగాదు
సుఖము ప్రత్యేకముగనెందు చూడబోము
కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు.

కాంక్షతోడనెందు కర్మంబులొనరింప
దక్కబోదు ఫలము ధరణియందు
కాంక్ష వదలి భక్తి కర్మలు ఒనరింప
ఫలితమొసగుచుండు పర్తివిభుడు.

కాగడాలుగాని కరదీపములుగాని
దారి చూపలేవు ధరణియందు
ధర్మదీపమొకటె దారి చూపును సుమీ!
సత్యమైన మాట సాయి మాట.

కాగితంబునందు కల్గినయక్షరాల్
చదివినంత ధరణి చతురుడగున
అక్షరంబులందునర్థంబు నెరుగుచు
చదువునట్టివాడె చతురడగును.

కానిదిదియని చెప్పంగగలరుగాని
బ్రహ్మమిదియని చెప్పంగ వశము కాదు
నిత్యసత్యమనంతంబు జ్ఞానమొకటె
అదియె బ్రహ్మంబు వాక్కునకలవి కాదు.

కానిపించెడి జగతిలో కానరాక
అందు వెలుగొందు చైతన్యమాత్మరూపు
మణులయందున సూత్రంబు మాదిరిగను
విశ్వమంతయు వ్యాపించె విశ్వవిభుడు.

కామశక్తియె అధికమీ కాలమందు
వాని మిత్రుడు క్రోధము వీరిరువుర
జేర్చుకొన్నట్టి జనులకు చేటుకలుగు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

కామము క్రోధము లోభము మోహము
విడువుము నేనెవ్వడననియనుకో
తమ్ముతామెరుగని దద్దమ్మలకగు
నరకము లోపల నానా బాధలు.

కామితార్థంబులెల్లను కల్పతరువు
వలెను దయచేయు దేవుండు కలడొకండు
దుర్లభంబగు నరజన్మ దొరకు కతన
అతని గాంచుట పరమ లక్ష్యంబు మీకు.

కారణమున కల్గు ఘనమోహ బంధంబు
మోహమందు పెరుగు మూర్ఖ బుద్ధి
మూర్ఖ బుద్ధియందు మురియును కర్మంబు
కర్మ ఫలము వలన కలుగు జన్మ.

కాలగతి సర్వ సంపదలు కోలుపోయె
మిగులు సిరి నేను మీకును మీరు నాకు
కాన ఏ కలవారికైన అమ్ముకొని
ఈ ఋషి ఋణము తీర్చుకొమ్ము.

కాలు జారిన మరలింప గలరుగాని
నోరు జారిన మరలింప లేరు సుమ్మి
పొడిదప్పినయట్టి ఈ మానవులను
పూని రక్షింపనగునె ఈ పృథ్విలోన.

కించిద్భగవద్గీతా పఠనము
కొంచెము గంగా తీర్థము పానము
హరిపూజన మొకపరిగావించిన
అతనిని యముడేమని తర్కించును.

కుసుమ మల్లెమాల కోతికి తగిలించి
పట్టు పుట్టములను పదిల పరచి
రత్న సింహాసనమున రమ్యంబుగాజేర్చ
వదలునా తన జాతి వక్రబుద్ధి.

క్రూరమృగముదెచ్చి కూర్మితోబెంచిన
ఆకలయ్యేనేని అదిమి పట్టు
దుష్టగుణంబులుగల దుర్జన స్నేహంబు
క్రూరమృగము కంటె ఘోరమగును.

కాదు మానవుండు ప్రేమయే లేకున్న
కాదు క్రైస్తవుండు కాదు సిక్కు
కాదు హైదవుండు కాదు ముస్లిమ్
వాడె రాక్షసుండు వసుధ పైన.

కొన్న కూర బేడ కూలియా పావలా
ఇదియె నాగరికత యిపుడు మనకు
ఎవరి పనులు వారు ఏమరకుండగ
నిర్వహించుకొనుట నేర్వవలయు.

కొలది కొలదిగ పుట్టును తొలుత చెదలు
కొరికి తినివేయు త్వరలోన కొయ్యనంత
దుష్టగుణములు సూక్ష్మమైతోచు మొదలు
పిదప నాశంబు చేయు నేపెద్దనైన.

కోపము కలిగిన వానికి
ఏపనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్
పాపపు పనులను చేయుచు
ఛీ! పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ!

కోపమున్నవారి కోరి చేరగవచ్చు
పాము ప్రక్కనైన పండవచ్చు
మత్సరంబు కల్గు మనుజుని స్నేహంబు
క్రూర మృగము కంటె ఘోరమగును.

కోరు కోర్కెలవన్నియు తీరుచున్న
భక్తి దైవముపై హెచ్చు రక్తి పెరుగు
కోరు కోరికలన్నియు తీరకున్న
భక్తి తరుగును దైవ విరక్తి పెరుగు.

కోకిలము కూత కూయగ కాకులెల్ల
దాని పొడవగ చూచుట గాంచలేదె
మంచివారిని చూచిన మత్సరించు
జగతి దుర్బుద్ధికిది సహజంబు కాద!

కోమలత్వంబు నిస్వార్థ గుణము కల్గి
సేవ చేయుట నిజమైన సేవయగును
స్నేహ భావంబుతో కూడి సేవచేయ
శాంతిధామంబు చేరుట సత్యమయ్య.

కట్టడ యైనయట్టి నిజ కర్మము చుట్టుచు వచ్చి యే గతిం
బెట్టునో పెట్టినట్లనుభవింపక తీరదు కాళ్ళు మీదుగా
గిట్టక వ్రేలుడంచు దలక్రిందుగ గట్టిరె యెవ్వరైన నా
చెట్టున గబ్బిలంబులకు జేరిన కర్మము గాక మానవా!

కర్మము కంటెనెక్కుడగు కార్యము లేదిల మానవాళికిన్
కర్మముచేయుచుండవలె కర్మ ఫలంబును కాంచకుండ ఆ
కర్మకధీనుడై మెలగి కర్మమొనర్పుడు యింతకంటె ఏ
కర్మయు లేదు ప్రాణులకు కర్మయె సౌఖ్యమొసగు నుర్విని.

కలయో వైష్ణవ మాయయో యితర సంకల్పార్థమో సత్యమో
తలపన్నేరక యున్నదాననో యశోదాదేవిగానో పర
స్థలమో బాలకుడెంత యాతని ముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వలమై యుండుటకేమి హేతువో మహాశ్చర్యంబు చింతింపగన్.

కాలముబట్టి సర్వమును కల్గుచుండును మంచిచెడ్డలున్
కాలముబట్టి వచ్చెడివి కల్మికి లేమికి రాకపోకలున్
కాలమె అన్నిరీతులను కారణమెంచుచు చూడగాను నీ
కాలమె లొంగదీయని మనుష్యుడొకండును లేడుగా ధరన్.

కురుచ బుద్ధులా కౌరవులు మరల తిరిగి మన పొత్తుకొత్తురా
అగ్నిలో మల్లెపూలు వెదజల్లు లీల ముష్కరుల మ్రోల నీ
హితోక్తులు ఏలా! గుణజాల! ఏల సంధి మాటలిక గోపాలా!
ఉత్తరదక్షిణ ధృవములు కలియునా యుద్ధము సిద్ధమన కాలహరణమికేల!

కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరే కౌరవేంద్రున కనేకుల్ వారిచే నేగతుల్
వడసె బుత్రులు లేని యా శుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్ష పదంబపుత్రనకున్.......

కొడకులపట్టి చంపెనను కోపమునొందదు బాలఘాతకున్
విడువుమటంచు చెప్పెడిని వెఱ్ఱిది ద్రౌపది వీడు విప్రుడే
విడువగనేల చంపుడు మీరలు డటువీనిని చంపరేని నా
పిడికిటి పోటునన్ శిరము భిన్నము చేసెద చూడుడందరున్.

కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వారేరి సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపై
బేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా!

కన్నీరు తెప్పించు కన్నీరు తప్పించు
చిన్మయమూర్తి ఓ చిన్నిరామా!
పిచ్చిని పట్టించు పిచ్చిని పోగొట్టు
సచ్చిదానందుడు సాయిరామ!
జోగి భోగిగజేయు భోగి జోగిగజేయు
భాగవతాగ్నిని బాలరామ!

..........

కనులుండి గ్రుడ్డులై కళ్యాణకరమైన
నీ మూర్తి దర్శింపనేరరైరి
చెవులుండి చెవుటులై అతి మనోహరమైన
నీ వాక్కు లాలింపనేరరైరి
పాణిపంకజమందు పర్తీశుడున్నను
పాడు సంసారము కోరుచుంద్రు
మించెడి కాంతితో మేరు పర్వతముండ
వెండిబంగారుకై వెదకుచుంద్రు
విశ్వ హృదయమందు వినిపించు ప్రణవంబు
వినుడు శ్రద్ధతోడ వీనులలర
కామ్యముక్తులనిడ కల్పకంబిదె సుమ్మి
మరువబోకుడిట్టి మంచిమాట.

కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషసాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని చింతించు దినము దినము
చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభినీధవు చెప్పెడి గురువు గురువు
తండ్రి హరి చేరుమనియడి తండ్రి తండ్రి.

కరుణింప నీకంటె ఘనుడెవ్వడని కదా
ఆశ్రయించితి నీ పాదాంబుజంబు
మొరపెట్టుకొనగ వమ్ము చేయవనిగదా
ఎలుగెత్తి పిలిచితి యిపుడు నిన్ను
ఏది వచ్చిన నీవె ఏలెదవని కదా
నమ్మితి నిను నా మనంబులోన
అర్థించినపుడు లేదననేరవని కదా
చేతులొగ్గితి నీదు చిత్తమునకు
ఏమని తలచుచుంటివి యిప్పుడింక
ఉద్ధరింపకయుంట నీ యూహయేమి

ఎంత కాలము నిన్ను నేనిట్లుగొలుతు
వచ్చి రక్షింపు జాలము వలదు వలదు.

కామితార్థంబిచ్చు కామధేనువు రాగ
ధనమిచ్చి యావును కొనగనేల?
మించెడి కాంతితో మేరు పర్వతముండ
వెండిబంగారుకై వెతలికేల?
కామిత ఫలమిచ్చు కల్పవృక్షమెయుండ
పెరటి వృక్షమునకై ప్రీతి ఏల?
భక్తిముక్తులనిచ్చు భగవంతుడిందుండ
పాడు సంసారము కోరనేల?
......

కల్లు పెల్లుగ ద్రావి నల్లమందును మ్రింగి
భంగును సేవించు భవ్యమతులు
సారాయి చెడగ్రోలి చావు తిండిని తిని
మాంసంబు నమిలెడి మహిత యశులు
జీవుడు చావడు జీవహింసలు లేవ
టంచు పీకలు ద్రెంచునట్టి ఘనులు
మరుగున వైష్ణవ మతమని సారాయి
గ్రోలి మాంసము తిను గురువులకును
తలకు కైపెక్కి శుష్క వేదాంతమందు
ప్రముఖులై తర్కవాదముల్ బల్కసందు
నొప్పగా నెందరో చిత్రయోగులట్లు
తలచి చెడిపోవునని భీతి వలదు నీకు.

క్రమము తప్పక మింట ప్రతిదినంబును భాను
డుదయాస్తమయముల నొందనేల?
గగనంబునకు కాంతికైసేయు తారలు
పగలు మాత్రము దాగు భంగియేల?
క్షణమైన విశ్రాంతిగొనక తా పవనుండు
జీవకోటుల బ్రోవ వీవనేల?
అనిశంబు కలకల ధ్వనుల నవ్వుచు నది
సలిలమై ప్రవహించు చందమేల?
ప్రకృతిలొనెందు చూచిన భ్రమయె ఏల?
భువిని ధన కుల మత జాతి భేదమేల?
ఎవరియానతి యిది ఎల్లనిట్లు జరుగు
నతడెయితడని యీతడెయతడనుచు
సర్వులకధిపతి యనుచు కాంచరయ్య!

కాయంబుతోజేయు కార్యంబులెల్లను
    మాటలాడుచునుండు మాటలెల్ల
తన మనస్సునగల తలపులన్నిటికిని
    పది యింద్రియముల పనులనెల్ల
బుద్ధితో కలిగెడు పూనికలెల్లను
    చిత్తంబునందలి చింతలెల్ల
అనుదినంబును సల్పు ఆచారములనెల్ల
    నియమంబుతో జేయు నిష్ఠలెల్ల
వైదికంబులు లౌకిక వర్తనములు
ఏమి చేసిన నవియన్ని ఈశ్వరునకు
తాను చేసెడి సేవగా తలచియున్న
సార్ధకంబౌను శ్రీసాయి సంస్థలెల్ల.

కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన
    కరతలా మలకంబు కాదు భక్తి
నోటితో మంత్రంబు నుచ్చరించినయంత
    చేసిన పాపంబు చెదిరి పోదు
గీతను చేబట్టి కేకలు వేసిన
    పుణ్యము మనయింట ప్రోవు పడదు
చెప్పు మాటలకును చేయు పనులకును
    సామ్యముండెడి వాడె సాధువగును
అహము పరనిందయను పాడు కుళ్ళు తీసి
సర్వ జీవులందు సర్వేశ్వరుండు ఒక్కడే అన్న
భావమ్ము మదియందు నిల్పుకున్న
ఆనాడె సాధుసంఘంబు అభివృద్ధిగాంచునయ్య.

కుప్పించి ఎగసిన కుండలముల కాంతి
    గగన భాగంబెల్ల గప్పికొనగ
నురికిన నోర్వక యుదరంబులోనున్న
    జగముల వ్రేగున జగతి కదల
జక్రంబు చేబట్టి చనుదెంచు రయమున
    బైనున్న పచ్చని పటము జార
నమ్మితి నా లావు నగుబాటు సేయక
    మన్నింపుమని క్రీడి మరల దిగువ
గరికి లంఘించు సింహంబు కరణి మెరసి
నేడు భీష్ముని చంపుదు నిన్ను గాతు
విడువమర్జున యనుచు మద్విశిఖవృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు.

కోటి పూసల కొక్క కొల్కి పల్కేగాని
నీటి మాటల కోటి నేరడితడు
చచ్చి పుట్టుట మాన్పు చదువు వచ్చునెగాని
చచ్చు విద్యలు రావు సాయికెపుడు
మనసిచ్చుకొను ప్రేమ మాటలాడునెగాని
సాయి ఉపన్యాసమీయలేడు
తన యదార్థత తాను తప్పక చనుగాని
ఎదుటి తప్పుల బాబ ఎన్నలేడు
కల్లకపటాలు తెలియని పిల్లవాడు
ఎల్ల జీవుల తనవలె యెంచువాడు
ఇట్టి మునీసు జన్మించినాడు
పట్టుబడినాడు భక్తికి బాబగాను.

కోటీశ్వరులకైన కూడుగుడ్డయెగాని
బంగారమును తిని బ్రతుక లేరు
కాలమేగాకున్న కట్టియే పామగు
కలసి వచ్చిన మట్టి కనకమగును
పండితుడొకచోట పశువుగా మారును
మూర్ఖుండొక తరిని మునిగ మారు
ధనవంతునొక పరి దారిద్ర్య దేవత
ప్రేమించి వానితో వరుసలాడు
ప్రాకులాటయెగాని ప్రాప్తియే లేకున్న
దమ్మిడయిన నీకు దరికి రాదు
వద్దు బాబు వద్దు హద్దు మీరిన ఆశ
బుద్ధి కలిగి మెలగు పెద్ద మనిషి
బుద్ధితో మెలగుము సాయి వద్ద.

కౌసల్య వరసుక్తి గర్భమౌటను గదా
రాముడు దేవుడై రమణ గాంచె
సీతా మహాసాధ్వి చెలగి పెంచుట కదా
కవలు కుశలవులు ఘనులునైరి
జిజియా లలామయే చెలగి పెంచుట కదా
వీర శివాజీయు పేరుగాంచె
పుతలిబాయియె రంజిల్లి పెంచుట కదా
గాంధి మహాత్ముడై ఘనతగాంచె
ఈశ్వరంబాసాధ్వి యెత్తి పెంచుట కదా
సత్యనారాయణుందు విశ్వశాంతి కెదిగె
ప్రాణికోటి యీ విధి పరిమళించె
అహరంబున బ్రోచెడి అమ్మ కంటె
ఆదరంబగు వస్తువు అవని కలదె
అమ్మ ప్రథమాక్షరంబె ఆద్యక్షరంబు.

కంసుని కాలేజీయందు కృష్ణుడు చదివెనా
హిరణ్యకశిపు కాలేజీయందు ప్రహ్లాదుడు చదివెనా
సద్గుణము నేర్పుటకు బడిపంతులు కావలెనా
బ్రహ్మజ్ఞానంబు నేర్పుటకు ఆశ్రమ మవసరమా
చెరకులోని చక్కెరవలెనున్నది నీలో సుగుణము.

కదలదు నీదు సంకల్పము లేనిది గడ్డిపోచయును
అదియునిదియు ననగనేల పిపీలకాది బ్రహ్మ పర్యంతము నీవె
అది ఎరుంగరు మది గలంగరు భువిని కొందరు
వివేకమున వర్తించెదమని కడు విఱ్ఱవీగెదరుగాని
చివరికేవేళ ఏమి సంభవించునో తెలియజాలరు ఎంతవారైనా.

కనులకు కనిపించెనంట నందునియింట గోపాలుడంట
దీపాన కనిపించెనంట ఆ దీపాన కనిపించెనంట
సుగుణకు కనిపించెనంట మన సుగుణకు కనిపించెనంట
నందునియింట గోపాలుడంట దీపాన కనిపించెనంట
అదే వేలికి తగిలిన మంట మన సుగుణకు కనిపించెనంట.

కన్నూమిన్నూ కానని వారికి జీవితమంతా పన్నీరా!
అన్నెముపున్నెము ఎరుగని వారికి జీవితమంతయు కన్నీరా!
మిత్రులెవరు? శత్రులెవరు? దేవుడెవరు? దాసుడెవరు!
గురుడెవ్వరు? శిష్యుడెవరు? కవి ఎవ్వరు? నటకుడెవరు!
తెలుసుకొనే తలయున్నదా? తెలిసిన సంశయమున్నదా!
తెలియలేని తలయున్నచో వానరుడన్న తప్పున్నదా!

కన్నువిప్పి చూడరోరన్నా శ్రీసాయిదేవుని ఎన్నగా ఎందైన కలడన్నా
మున్ను షిరిడి నేడు పర్తి ఉన్నవాడని పేరెగాని
తన్ను భావనజేయు భక్తుల కన్నులందే మెలగునన్నా ॥కన్ను॥
ఉత్తమాటలచేత చిత్తము సత్తు చిత్తానందము నొందదు
విత్తనంబులు లేని భూమిలో మొత్తముగ పంటేమి పండదు ॥కన్ను॥
రోగమును అరికట్టనేరక యోగియైనను పతనమొందును
భోగమును విడనాడు వారికే యోగమది లభించునయ్యా ॥కన్ను॥
ఒట్టిమాటల వాడు కాడన్నా ఈ సాయిదేవుడు బుట్టబొమ్మల చూడబోడన్నా
పట్టుబట్టలుగట్టి భక్తుల చుట్టు తిరిగే పుట్టస్వామిని ॥కన్ను॥
ఇంద్రియములు మనసు నిల్పిన అంధుడైనను ముక్తినొందును
ఇంద్రియములు నిగ్రహించని ఇంద్రుడైన పతనమొందును ॥కన్ను॥
నీతినియమము లేక తిరిగిన ధాతకైన అజ్ఞానమొదలదు
జ్యోతి లేనిదె అంధకారము భూతలంబున లేదటంచును ॥కన్ను॥
బుద్ధి నిలకడలేని మనుజుడు పొందజాలడు శాంతి సుఖములు
విషయసుఖముల వెంట పరుగిడు వెఱ్ఱిజీవికి ఎచట శాంతి ॥కన్ను॥
అల్పగురువుల చెంతజేరకు స్వల్పగుణముల చింత చేయకు
తలపులన్నియు నిలిపివేసిన తనువుకెప్పుడు జన్మ లేదు ॥కన్ను॥
అన్ని మతములు తననెజూపును అన్ని మూర్తులు తనవె రూపులు
అన్నిచెంతల తానెయుండగ అదియెకదా బ్రహ్మపదము ॥కన్ను॥

మతము మతమునకు మధ్య ద్వేషము జాతిజాతికి మధ్య జగడము
దేశదేశమునందు రగడలు దేనికయ్యా మత ప్రబోధలు ॥కన్ను॥

కన్నుల నిచ్చిన దెందుకొ తెలుసా!
అన్నియు చూచేటందులకా? కాదు కాదు
దేవదేవుడైన కైలాసవాసుని చూచేటందులకు
చెవులను యిచ్చినదెందుకొ తెలుసా!
శబ్దము వినేటందులకా? కానేకాదు
భగవానుని కీర్తన వినేటందులకు
నోటిని యిచ్చినదెందుకొ తెలుసా!
మాటలు పలికేటందులకా
ఆర్తామనుడౌ దేవదేవుని కీర్తన పాడేటందులకు.
చేతులనిచ్చిన దెందుకొ తెలుసా!
మూతికి ముద్దందించుటకా
పతితపావనుడౌ శివుని పూజలు
చేతులార చేసేటందుకురా.
పొందుగ పాదములిచ్చినదెందుకు!
సందులు గొందులు తిరుగుటకా?
అందుకు కాదు, నందివాహనుని
మందిరమ్మున తిరుగుటకు.
తెలివిని యిచ్చినదెందుకొ తెలుసా!
కలిమిని సంపాదించుటకా? కాదుకాదు
నాలుగు రోజుల నాటకమిదియని
నగ్నసత్యమును ఎఱుగుటకు.
దేహమునిచ్చినదెందుకొ తెలుసా!
దేశములన్నీ చుట్టుటకా!
పరోపకారార్థమిదం శరీరమను
పదమును ఆచరణలోనుంచుటకు.

కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం
కలసిమెలసి కలిమిచెలిమి బలముగుణము పెంచుదాం
కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం
కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం
శాంతిశాంతి శాంతియని శాంతిపూడ చేయుదాం
ఓంఓంఓం అనుచు ఓంకారము పాడుదాం.

కర్మ దాట వశమా నరుడా కర్మ దాట వశమా
చిన్న చెలమలో ముంచిననైనా సప్తసాగరాల్ నించిననైనా
కడవెంతో నీరంతేరా కావాలన్నా ఎక్కువ రాదుర ॥కర్మ॥
ఘన పాఠంబులు చదివినగాని కులదేవతలను కొలచినగాని
కారడవులకే పోయినగాని కఠిన తపస్సులే చేసినగాని ॥కర్మ॥

కారణ సమష్ఠి స్వరూపము...ఈశ్వరుడు
కార్య వ్యష్ఠి స్వరూపము...ప్రాజ్ఞుడు
కారణ వ్యష్ఠి స్వరూపము...జీవుడు
సూక్ష్మ సమష్ఠి స్వరూపము...హిరణ్యగర్భుడు
సూక్ష్మ వ్యష్ఠి స్వరూపము...తైజసుడు
స్థూల వ్యష్ఠి స్వరూపము...విశ్వుడు.

కొక్కొరో కోయని కోడి కూయగనె
చక్కగా నిద్రమంచమునుండి లెమ్ము
పలుదోముకొని దేహ బాధ తీర్చుకొని
జలకమాడి దుస్తులు ధరించి చల్ది భుజించి
హితమైన వస్తువు ఎంతయు నమిలి
మితముగ భుజించిన మేలగు నీకు
బడికేగి శ్రద్ధగా పాఠాల్ నేర్చి
అణకువగల బాలుడని అనిపించుకొనుము
తేమలోనెప్పుడు తిరుగంగబోకు
మురికి గుంటలచెంత పోబోకుమెపుడు
పరుగుడు, చెడుగుడు, బంతులాటయును
సరైన వేళళ సలుపుచునుండు
పై రీతుల నీవు పరిగణింతువేని
ఆరోగ్య భాగ్యంబులనుభవించెదవు.

కొలనుకు కలువయే శృంగారము
ఆకాశమునకు చంద్రుడే శృంగారము
సముద్రమునకు అలలే శృంగారము
మానవులకు గుణమే శృంగారము.

కోరిక తీరిన వేళ నన్ గొప్పగ పొగడెదరోయి
కోరిక తీరకపోతే ఊరక తెగడుదురోయి
పాపంబౌ పని చేసి ఫలమాపద కలిగిన రోసి
కాపాడవు నీవనుచు నింద నాపై మోపెదరోయి.

ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీతసాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు ప్రభవమొంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె బాలులార!

గాలిలోన జ్యోతి కదలాడుచుండును
గాలిలేని చోట కదలకుండు
ఆశయనెడు గాలి అణగదొక్కినయంత
మంచిదౌను మనసు మరుగు విడచి.

గ్రామసేవయన్న రామసేవయె సుమా
రామరాజ్యమన్న ప్రేమ మయము
ప్రేమ లేక జగతి ఉద్ధరించుట కాదు
కాన సేవ చేసి బాగుపడుడు.

గుణము కొంచెముండి గొప్ప చదువులున్న
ఫలమదేమి? వాని విలువదేమి?
పంటలేని భూమి పది ఎకరములేల?
కొంచెమైన చాలు మంచి భూమి.

గుణములన్నిట సత్యమ్ము గొప్ప సుమ్మి
ఎల్లలోకములందు రంజిల్లుచుండు
సత్యసంస్కృతి యమృతంబు సరణినొంది
ఆత్మ మార్గాన వెలయు పుణ్యాత్ముకుండు.

గుణములేని సుతుడు, గురిలేని విద్యలు
నీతిలేని జాతి నిష్ఫలంబు
శాంతిలేని జీవి శశిలేని నిశి సుమా
వినుము భారతీయ వీరసుతుడ!

గోడ కట్టువాడు గోడతోబాటుగా
పైకి పోవుచుండు భాగ్యవశత
బావి త్రవ్వువాడు బావితోబాటుగా
అడుగు భాగమునకు అరగుచుండు.

గతజీవుడగు పతిన్ బ్రతికించుకున్నట్టి
సావిత్రి భారత సతియె కాదె!
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి పవిత్ర పడతి కాదె!
కులసతీత్వమునకై గుండాన దూకిన
సీత భారత ధరాజాత కాదె!
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
దమయంతి భారత రమణి కాదె!
సప్త సాగర పరివేష్టితోర్వితలము
భరత జాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావసంపదకిది మహా పంట భూమి
అఖిల దేశములకిది ఉపాధ్యాయి కాదె!

గరిక పోచలు రావె గణనాథు పూజకు
ఇంతకంటెను హీనులైరి జనులు
కావుకావుమటంచు కాకి వేడగ లేదె
ఇంతకంటె నికృష్టులైరి జనులు
అంబఅంబాయని అరవదె లేలేగ
ఇంతకంటెను పల్చనైరి జనులు
రామరామాయంచు కామించదె చిలుక
ఇంతకంటెను తక్కువైరి జనులు
మానవులకంటె మృగములె మంచివేమొ
ఎంత విజ్ఞానముండియు ఏమి ఫలము?
మానవత్వము కోల్పోయి మనిషి నిలచె
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

గ్రంథంబులన్నియు గాలించి చూచిన
సత్యసాయి పలుకు సత్యవాక్కు
వేదములన్నియు వెదకి చూచినగాని
సత్యసాయి పలుకు సత్యవాక్కు
శాస్త్రములన్నియు చదివి చూచినగాని
సత్యసాయి పలుకు సత్యవాక్కు
గాయత్రి మంత్రంబు ఘనముగా చెప్పిన
సత్యసాయి పలుకు సత్యవాక్కు
ధర్మ శాస్త్రములను తరచి తరచి చూడ
సత్యసాయి పలుకు సత్యవాక్కు
స్తోత్ర పాఠములను శోధించి చూడగ
సత్యసాయి పలుకు సత్యవాక్కు.

గోపాల నీవు దృగ్గోచరంబవకున్న
గోవులు గరికైన కొరకవంట
నీ దర్శనము లేక నీవు చెంతను లేక
గోప బాలురు కూడుగుడవరంట
నీవగుపించక నీ సేవలును లేక
గోపికల్ నీరంబు గుడువరంట
నీ కథల్ వినకుండ నీ ముచ్చటల్ లేక
గోపకుల్ కంటన్ కునకరంట
నందనందన గోపికానన్యభక్తి
విశ్వ వ్యాప్తంబు దీనికి సాటి కలదె!
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

గరిట పాయసమందున్న రుచులననుభవించునా?
కమలపు మకరందమును కప్పలనుభవించునా?
గంధపు చెక్కల సువాసన రాయి అనుభవించునా?
అంధుడు సౌందర్యము అద్దమందు అనుభవించునా?
దేహమున్నయంతలోనె దైవతత్వమెరునా?

గీతయే భగవానుని దూత గీతయే జగదేక మాత
గీత సాధకుని ఊత గీత సంసారికొక ఊత
గీతయే మంత్రాల మూట గీతయే వేదాంతపు ఊట
గీతయే ఘనరాజబాట గీతయే పుష్పాల తోట.

గుటగుట చనుబాలు గ్రోలుచు
పూతన బట్టి చంపు వింతను చూడనైతి
ఎన్ని తాళ్లను కట్టినా పట్టని
నీ బోజ్జను ముద్దాడనైతి
ప్రసవ వేదన పడుట నా వంతు
నీదు ముచ్చటల్ పడుట యశోద వంతు
బిడ్డలుండియు నేనొక గొడ్డురాలనైతి
పుత్రుని కనకుండినను పుత్రవతి యయ్యె యశోద.

ఘనముగా భువిలోన కడగండ్లు పడనేల
కూలికొరకు పాటు పడగనేల
పక్షికీటకములు బ్రతుకుచుండుటలేదె
అవనిలో ఎట్టి యత్నంబులేక.

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులెల్లన్
చదివినవి కలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!

చదువులన్ని చదివి చాల వివేకియై
మగిడి తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతినున్నను
హీనుడవగుణంబు మానలేడు.

చదువులన్ని చదివి సద్గుణంబులు లేక
పరుల మోసగించి బ్రతుకువాడు
వానికంటె మేలు వసుధలో గాడిద
బరువు మోసి తాను బ్రతుకుచుండు.

చాతకము కోరునేవేళ చంద్ర కాంతి
తుమ్మెదలు కోరు పూవుల తనివి గ్రోలి
రోగి కాక్షించు మందులు రచికరంబు
పర్తివాసుడు వాంఛించు భక్త జనుల.

చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆదిమధ్యాంత రహితుడనాదివాడు
తాను పుట్టక చావక చంపబడక
ఆత్మరూపుడై అంతట వెలసియుండు.

చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

చిత్తమనెడి వేరు శిథిలమైనప్పుడు
ప్రకృతి అనెడు చెట్టు పడును పిదప
కోరికలను పెద్ద కొమ్మలు ఎండును
ఉన్నమాట తెలుపుచున్న మాట.

చిత్తశుద్ధి తోడ చేసెడు పూజకు
మట్టిపాత్ర చాలు మహిని చూడ
విత్తమున్నదనుచు విఱ్ఱవీగెడివాడు
పతనమగుట నిజము పర్తిసూక్తి.

చిత్తశద్ధిని చేకూర్చు సేవకొరకు
జీవితము నంకితముజేసి చెలగు నరుడ
పరుల కొసగుచు నీ శక్తి బలము తుదకు
చివరి శ్వాసను వీడుమా సేవలోన.

చిత్త శుద్ధి లేని రిత్త సాధకులకు
ఆత్మతత్త్వమెట్లు అలవియగును?
ఆత్మతత్త్వమబ్బు అతి శుద్ధ బుద్ధికే
సత్యమైన బాట సాయి మాట.

చిత్త శుద్ధి లేని రిత్త మానవులందు
క్రోధమత్సరంబు కూడియుండు
చీకటింటిలోన చేరును గబ్బిళాల్
మరువబోకుడిట్టి మంచి మాట.

చిత్త శుద్ధి లేని క్షుద్ర మానవునకు
ఆత్మతత్త్వమెట్లు అబ్బునొక్కొ?
ఆత్మతత్త్వమబ్బు అతి శుద్ధ బుద్ధికే
ఉన్న మాట తెలుపుచున్న మాట.

చినుకు పడినయంత చెరువులు నిండునా?
ఉమ్మి మ్రింగ దాహముడుగునొక్కో?
ఊపిరి బిగబట్ట ఉదరంబు పెరుగునా?
బొచ్చు కాల్చినంత బొగ్గులగునా?

చీమ స్వార్థంబు కలిగిన జీవి కాదు
పెక్కు చీమలు గుమిగూడి మెక్కుచుండు
దానికున్నట్టి బుద్ధి యీ మానవులకు
గలుగదేటికి చిత్రంబుగాదె చూడ!

చెంబు బావియందు చెరువునందును కూడ
పట్టినంతె నీరు పొట్ట నింపు
ప్రాప్తి ఎంతొ అంతె ఫలము ఎందేగినా
ఉన్న మాట తెలుపుచున్న మాట.

చేతులారంగ శివుని పూజింపదేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువదేని
దయయు సత్యంబు లోనుగా దలపదేని
గలుగనేటికి దల్లుల కడుపు చేటు.

చెడ్డ చూడరాదు చెప్పరాదెప్పుడు
వినగరాదెపుడును విశ్వమందు
మూడు కోతులు గల మూర్తిని తలచుడు
ఉన్న మాట తెలుపుచున్న మాట.
చెడ్డ పని చేసి మంచిని చెందబోరు

మంచి పని చేసి కీడును గాంచబోరు
నింబమును నాట చూత ఫలంబు గనున?
చూతమును నాటి నింబంబు పొందనగునె?
ఉన్న మాట తెలుపుచున్న మాట.

చెప్పుట సులభమ్ము చేయుట కష్టము
ధాతకైన వాని తాతకైన
చెప్పవచ్చు కోటి  చేయరు ఒక్కటి
ఉన్న మాట తెలుపుచున్న మాట.

చెవులకెవ్వండు విను శక్తి చేర్చెనోయి
కనులకెవ్వండు యిచ్చెను కాంతిరేఖ
అట్టి వానిని వెతికెడు నతడు నరుడు
ఉన్న మాట  తెలుపుచున్న మాట.

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
పుట్టనేటికి తల్లుల కడుపుచేటు

చక్కెర కంటె తీపి దధిసారము కంటెను రుచ్యమౌను పెం
పెక్కిన తేనె కన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్

చదువులు నేర్చితినంచు గర్వము వహించన్‌రాదు నీకున్న యా
చదువేపాటిది, విద్యకున్ వినయమే సద్రూపమౌ, నేర్వద
గ్గది యెంతో కలదంచు గర్వదురహంకారములన్ బాయుడు
హృది దానన్ తలపోయుచుండు సుగతీ! ఓయీ అవిద్యాపతీ!

చుక్కలన్నియు బ్రహ్మ సూర్యుండు అది బ్రహ్మ
చంద్రుడన్నను బ్రహ్మ జలము బ్రహ్మ
స్వర్గమన్నను బ్రహ్మ వైకుంఠమది బ్రహ్మ
తల్లియన్నను బ్రహ్మ తండ్రి బ్రహ్మ
భాగ్యమన్నను బ్రహ్మ వాల్లభ్యమది బ్రహ్మ
జీవరాసులు బ్రహ్మ జీవి బ్రహ్మ
పుట్టించుటది బ్రహ్మ పోషించుటది బ్రహ్మ
గిట్టించుటది బ్రహ్మ గృహిణి బ్రహ్మ
కర్మలన్నియు బ్రహ్మ కాలంబు బ్రహ్మ
ప్రకృతియంతయు బ్రహ్మ ఆదిశక్తి బ్రహ్మ
సర్వమును బ్రహ్మ మరియు ఈ సభయు బ్రహ్మ
సత్యమును దెల్పు ఈ సత్యసాయి బ్రహ్మ.

చూచితే దైవాన్ని చూడవలెనే గాని
వేరుచూపులు చూడ వెఱ్ఱితనము
నడిచితే విభునితో నడవ వలెనే గాని
వేరు మార్గము పోవ వెఱ్ఱితనము
పలికితే సత్యాన్ని పలుకవలెనే గాని
వేరు పలుకులెల్ల వెఱ్ఱితనము
పాడితే తత్వాలు పాడవలెనే గాని
వేరు పాటలు పాడ వెఱ్ఱితనము
వినిన హరి భజనంబులు వినగ వలయు
చూడగోరిన దైవాన్ని చూడవలయు
చేరవలసిన దైవాన్ని చేరవలయు
ఇంతకంటెను పరతత్వమేమి కలదు

సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!
చెంత చేర్చెననుచు సంతసించెదరన్న
వెంటనే ఎడబాసి చింతగూర్చు
ఏడిపించుట సాయి వేడుకయందురా
కడుపుబ్బ నవ్వించు నడుమ నడుమ
పొగడుచున్నాడని పొంగిపోయెదరేమొ
తప్పకప్పుడె ఎగతాళి చేయు
అభయమిచ్చెనుగాన హాయినుండెదరన్న
పడు బాధలకు అంతుబట్టకుండు
వెనుకకేగనీడు చననీడు ముందుకు
మనసు మరులు గొల్పి మధన పెట్టు
ఇట్టి చిన్ని సాయి చిన్మయమూర్తిని
ఎట్టులెలుగగలరు ఇలను మీరు.

చైతన్యమనియన్న క్షేత్రజ్ఞుడనియన్న
జ్ఞానమన్నను అహంకారమన్న
ఈశ్వరుడన్నను ఇల విష్ణువన్నను
బ్రహ్మమన్న ఆదిశక్తియన్న
ఆనందమదియన్న పరమపదంబన్న
ప్రకృతియనగ ఆత్మకు పలు పేర్లు.

చక్రము  లేని రథము నీరెరువులు లేని పెంట
చంద్రకళలు లేని రాత్రి సింధూరము లేని గృహిణి
వెన్న తీసినట్టి పాలు రుచి ప్రకాశములెట్లు కలిగియుండు?
భక్తిలేని జీవితము పుణ్యమా పురుషార్థమా?

చదివి వ్రాయ నేర్చినవారందరు విద్యావంతులేనా?
కాలేజి డిగ్రీని పొంద విద్యావంతుడగునా?
సుజ్ఞానము సుకృతములు లేని విద్యలు విద్యలగునా?
బ్రతుకుటకై విద్యయన్న పశు పక్షులు బ్రతుకలేదే!

చెడ్డ చింత చేసిచేసి గ్రుడ్డియాటలాడియాడి
ఊడిపడే దేహానికి బూటకపు ఆటలాడి
ప్రారబ్దము తీరగనే కపట వేషాలు విడనాడి
పుణ్యపాపములతో కూడి మరణింతువు ఓ కిలాడి.

చెర్లోన మీ మామ శనగలెయ్యంగ
భాగమిమ్మని పొమ్ము బాలశంకరుడా
ఏసిననాడు లేవు కోసిననాడు లేవు
ఏందిస్తురా భాగంబు నీకు (అంటే)
మా అమ్మ నీతోడబుట్టినది కాదా
తగవుకే పోదాము ధర్మచావడికి (అన్నాడుట)
ధర్మచావడిలోని పెద్దాలందరు
భాగమిమ్మని బిడ్డనిమ్మనిరి.

జనన మరణాలు రెండును జంటనుండు
రెండు చక్రాలు బండికి నుండునటుల
ఒకటి పోయిన సృష్టియే ఓడిపోవు
ఇదియె సృష్టి రహస్యమీ ధరణియందు.

జపము యజ్ఞమందు జన్మలన్నియు పోయె
మనసు కుదరదాయె మానవునకు
జపము యజ్ఞములకు జన్మమీడేరునా?
మనసు నిలపకున్న మందమతికి.

జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతిలేకయున్న జాతి చెడును
నీతి కల్గు జాతి నిజమైన జాతిరా
వినుము భారతీయ వీరసుతుడ!

జీర్ణకోశాలు దేహాన జేర్చునెవరు?
జనన మరణాలు ఎవరిచే కలుగుచుండు?
వారినెరుగంగ నేర్చుటే జ్ఞానమగును
మరువబోకుడిటువంటి మంచి మాట.

జగతి జీవించువాడు మనుజుడు కావలె మొదట
దనుజుల దుష్కృతములనెల్ల పొడుచుండు వాడె చవట
బ్రహ్మవిద్య నేర్చి యిచట ఆధ్యాత్మను కనుగొనుట
రాజయోగమునకు బాట అదియె శృతులు చెప్పుమాట.

జనన మరణ మధ్యమందు జగన్నాటక రంగమందు
కామ క్రోథ గానములు లోభమోహ గీతములు
మదమాత్సర్య ద్వేషములు వ్యామోహముల నాటకములు
నవ విధముల ప్రదర్శనలు తుదకు శాంతి పాఠములు.

జానెడు పొట్ట నింపుకొన చిక్కులనొందుచు కోటి విద్యలన్
పూనికమీర నేర్చి పరిపూర్ణసుఖంబును పొందలేక యీ
మానవజాతి దుఃఖముల క్రుగ్గగనేటికి శ్రీపరాత్పరున్
ధ్యానముజేయు భక్తులకు దారినిజూపకయున్నె మానవా!

జనని గర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాలలవేమి కానరావు
మంచి ముత్యపు సరుల్మచ్చునకును లేవు
మేల్మి బంగరుదండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు కెంపులు పరగ లేవు
వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు
గోమేథికంబులు తోడులేవు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి
మంచిదైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల!

జపమహా నిత్యాగ్ని తపములు చేసిన
సరిరావు హరినామ స్మరణకన్న
తీర్థయాత్రలు కొన్ని తిరిగి సేవించిన
సరిరావు హరినామ స్మరణకన్న
ఉపవాస వ్రతములు విడువక చేసిన
సరిరావు హరినామ స్మరణకన్న
అశ్వమేధంబులు అమితంబుగా జేయ
సరిరావు హరినామ స్మరణకన్న
అడవిలోపల ఆకులలములు తినుచు
సంచరించిన ఫలమేమి సాధువర్య
ఎంచి చూడగ యివియన్ని ఏమి ఫలము?
స్మరణ లేక హరి కరుణ కలుగబోదు.

జాతి భేదము లేక జనులకాశ్రయమిచ్చి
సర్వ సమత్వంబు చాటు తరులు
తనువుకై మనకింత తమకంబు వలదంచు
చలియెండ వానల సైచు గిరులు
రేపుమాపు కొరకు వాపోవ వలదంచు
విహగముల్ సంతుష్టి విద్య గరపు
జగము నిత్యము కాదు సంసారమది భ్రాంతి
యని ప్రాణముల్ వీడి చనెడువారు
నేను, నాదను భావమనిత్యమనుచు
ప్రకృతి జనని తెల్పుచుండు భాష్పవృష్టి
ప్రాణి సుజ్ఞాన మార్జింప ప్రకృతి ఒకటె
పాఠశాల, సద్గురుడు శ్రీసాయి కాదె!

జన్మమెత్తిన వెనుక జాగ్రత్త కావలె
దుర్మార్గులను జేర దొసగు కల్గు
చెడును జీవితమెల్ల చెడును బుద్దులు భక్తి
చెడు దుష్టుడై తాను చెడును కడకు
చెడక మునుపె మంచి స్నేహంబు లొనరించి
పెడమార్గములనెల్ల వీడియున్న
ఆయురారోగ్యంబులఖిల సంపదలను
ఆధ్యాత్మిక చిత్తమబ్బునప్ప
అంతియేకాదు, మోక్షంబు చెంత నిలుచు
ఇంతకన్నఉ వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

జనుడు తనకు తాను నరుడనియే తలచినాడు
ఏదెరిగిన నరజన్మము సార్థకమౌనో తెలియదు
నరజన్మమునందు పుట్టి నరజన్మమునందు పెరిగి
నరసింగములైనవారు తొలి సంగతి మరచినారు
కులమత భేదములు పెంచి అసురత్వము స్వీకరించి
సమరాలను స్వాగతించి శాంతి సభలు జరుపుతారు
తనకొరకై బ్రతుకువాడు మనుజుడెట్లౌనురా?

జీవుడుండు దేహమందు హృదయమందు దేవుడుండు
రెండుకూడి ఆటలాడి ఒకరినొకరు వీడుచుంద్రు
బొమ్మలాటలాడించే సూత్రధారి కలడొకండు
మంచి చెడ్డ బొమ్మలందు ఒకటిలోనె రెండు ఉండు.

తగదు తగదు ధనదాహము నరుడా
మంచి బుద్ధితో మానుము కోర్కెలు
కర్మ ఫలితమే కదరా విత్తము
కలిగినంతలో కనరా తృప్తిని.

తత్త్వమడుగంటె సినిమాలు తలకుబట్టె
ఒప్పులన్నియు సంఘాన తప్పులయ్యె
యుక్తి కేంద్రాలుగా మారె భక్తియందు
సత్యమును తెల్పు మాట శ్రీసాయి మాట.

తత్త్వమెరిగిన వానికి తపమదేల?
సత్యమున్నట్టి వానికి సాధనేల?
కల్లకపటాలు లేకున్న క్రతువులేల?
సత్యమును తెల్పు మాట ఈ సాయి మాట.

తనదు తప్పు తాను తరచును సుజ్ఞాని
పరుల తప్పులెల్ల పట్టువాడు
తనను తానెరుగడు తన తప్పునెరుగడు
ఇట్టి వాడు భువిని పుట్టనేల?

తనదు బాగు కోరి తత్త్వంబు బోధించు
గురుడు తిట్టవచ్చు బాగ కొట్టవచ్చు
తల్లి బుగ్గ గిల్లి త్రాపును మందును
మరువబోకుడిట్టి మంచి మాట.

తన కలిమి భంగ పుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తన వారల కెడ సేయును
జనులకు గర్వంబు వలన సర్వంబు చెడున్.

తనకె తెలియునంచు తత్త్వంబు సర్వంబు
విఱ్ఱవీగరాదు విబుధుడెపుడు
తెలిసియున్న దాని తెలివితో చేయుట
నీతి మార్గగామి నిత్యవిధులు.

తనువనిత్యము సంపదలన్నియు మాయ
సుతులు పెండ్లాము తెరవెన్క బొమ్మలైరి
తాను చేసిన పుణ్యంబు చెడని ఫలము
అనుచు మదిలోన నెంచువాడె నరుడు.

తమరు చేయంగ గల కార్యముల గూర్చి
మంచి చెడ్డలు చక్కగా నెంచి చూచి
చేయుచుందురుగాన యేచింత లేక
వేగిరించినచౌనది విషమె యగును.

తరచి చదువు చదవ తర్కవాదమెగాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
చదువులన్ని చదివి చావంగనేటికి
చావులేని చదువు చదవ వలయు.

తరువ తరవబుట్టు తరువున ననలంబు
తరువ తరువబుట్టు దధిని ఘృతము
తరువ తరువబుట్టు తనువున త్తత్త్వంబు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

తలచినట్టి పనులు తారుమారైనచో
తొణక వలదు ఎవరు బెణక వలదు
చీకుచింత వీడి చిరునవ్వు నవ్విన
అతని గుండె పండినట్టి గుండె.

తలపులందు వేరు దైవంబు కలదని
తలచి నరుడు తన్ను తానె మరచు
తలపులన్ని వీడ తానె దైవంబగు
తలపు భ్రాంతి వీడి తరలి రండు.

తల్లి కన్న మిగుల దైవమే దగ్గర
సన్నిహితుడు తండ్రి కన్న చాల
అట్టి ఆత్మ వదల అబ్బును పాపంబు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

తల్లి సేవ మదిని తగిలిన తనయుడు
వాని పాపమెల్ల వదలుచుండు
శివుడు మెచ్చు తనకు చిరకీర్తి నందించు
దుఃఖరాసినెల్ల తొలగచేయు.

తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేల వాడు గిట్టనేల?
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా?
విశ్వదాభిరామ వినురవేమ!

తాను చేయకున్న తగవు పుట్టదుగాని
ఒరుల పెట్టుచూసి ఓర్వలేరు
దాత దరిని చేరి తనది పోయినట్లు
జిహ్వతోడ చాడిలు చెప్పుచుండ్రు.

తామరాకుపై తళతళలాడే
నీటి బోట్టు వలె నిలకడ లేనిది
బ్రతుకభిమానపు తెగులు పుట్టరా
దిగులు దుఃఖముల తెరరా లోకము.

తామసంబు విడక తత్త్వంబు కనరాదు
రాజసంబు విడక రాదు భక్తి
సాత్వికంబె భక్తి సాధనంబగునయా
ఉన్నమాట తెలుపుచున్న మాట.

త్యాగభావంబు మీలోన దనరకున్న
మలిన బుద్ధులు మీలోన మారకున్న
పార్టి వేరుచేసినగాని ఫలము సున్న
పక్షపాతము విడకున్న ఫలము సున్న.

తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధింప వచ్చు
భజన లేకుండ పరభక్తి పరగ రాదు
తత్త్వమెరుగక భవవార్ధి దాటలేరు.

తుప్పు పట్టిన దానిని తుడవవచ్చు
పొట్టు విత్తనముల విడగొట్టవచ్చు
కోరి యజ్ఞాన తిమిరంబు తరుమ వచ్చు
కాని మూర్ఖుని రంజింప కాదు సుమ్మి.

తెలివితేటలు మరి ఎన్ని కలిగియున్న
కర్మ దాటగ జాలిన ఘనుడు లేడు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

తెలియబడచున్న లోకంబె దృశ్యమండ్రు
తెలివినై సర్వమును గాంచు ద్రష్ట నేను
మిగుల నా కంటె అన్యంబు ఏది లేదు
సత్యమిది సర్వ వేదాంత సంగ్రహంబు.

తెలివిని యిచ్చినదెందుకొ తెలుసా?
కలిమిని సంపాదించుటకా? కాదు కాదు
నాలుగు రోజుల నాటకమిదియను
నగ్న సత్యమును నెరుగుటకు.

తేలు విషము కన్న  తెంపరాకుల కన్న
పదును కత్తి కన్న పాము కన్న
మత్సరంబు కల్గు మనుజుండు యిలలోన
కుత్సితుండు వాడె తుచ్ఛితుండు.

తొమ్మిది చిల్లులుండు తోలు తిత్తియెగాని
కాంతి కలుగు వజ్రఘటము కాదు
నిముష నిముషమునకు నీచులూరునెగాని
పునుగు జవ్వాదీలు పుట్టబోవు.

తన్ను నిశాచరుల్ పొడవ దైత్యకుమారుడు మాటిమాటికో
పన్నగశాయి! ఓ దనుజభంజన! ఓ జగదీశ! ఓ మహా
పన్న శరణ్య! ఓ నిఖిల పావన! యనుచు నుతించెగాని తా
కన్నుల నీరు తేడు, భయకంపసమేతుడుకాడు భూవరా!

తామర మొగ్గరంబు బలదర్పిత శాత్రవ గర్వ భంజనో
ద్దాముడు కుంభజుండు మరి దానిని పన్నిన వాడు భీష్మ సం
గ్రామము భార్య గర్భవతి కాలమెటుండునో చెప్పలేము మీ
మామయు తండ్రి లేరిచట మానుము నీ తలపింక పుత్రకా!

తగిన సేవలు చేయు దాసదాసీలున్న
గుణవంతురాలగు కోడలున్న
అమిత ప్రేమగ చూచు అక్కసెల్లెండ్రున్న
తన యాజ్ఞ పాలించు తమ్ములున్న
మైత్రి నిత్యముగోరు మిత్ర బృందమున్న
తగినట్టి అధికార యోగమున్న
విశ్వవ్యాప్తిని గాంచు విద్యలెన్నియొయున్న
చక్రవర్తులకున్న సంపదున్న
దైవ ప్రేమయె లేకున్న ధరణియందు
సర్వ సంపద వ్యర్థమే చనెడు వేళ
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

తప్పుగానక సర్వమొప్పుగా భావించి
శ్లాఘించుచుందురు సరస జనులు
తప్పును తప్పుగా ఒప్పును ఒప్పుగా
ప్రకటించుచుందురు ప్రాజ్ఞజనులు
ఒప్పును తెలియక తప్పుగా భావించి
దూషించుచుందురు దుష్టజనులు
ఒప్పులన్నియు బలిమి తప్పులుగాజేసి
కలహించుచుందురు కలుష జనులు
వెనుకజూడ మూడిట నొక విధము కలదు
నాల్గవ స్థాయి యందున్న నరునినరయ
వీని కంటెను రాక్షసుండెవరు కలరు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

తమ జీవితంబులు త్యాగంబు గావించు
ధర్మాత్ములుందురీ ధరణియందు
పరుల సౌఖ్యముగోరి బలియైన వారలుంద్రు
కొందరీకాలమునందు కూడ
కలలోన కూడను ఇలలోని సౌఖ్యముల్
కలవరింపని వారు కలరు ధరణి
కాని దేహేంద్రియములరికట్టి నిలిపి
మనసునంతర్ముఖము చేసి యనవరతము
నిశ్చల సమాధి చిత్తుడై నిలచి నేడు
సత్య సేవ గావింప నాసక్తు లెవరు?

తల్లికౌగిలికినై తారాడి తారాడి
ఎలుగెత్తి పసికూన ఏడ్చినట్లు
మంద లోపలనుండి మరలిన దూడకై
ఆవు అంబాయని అరచినట్లు
భర్త బాయగ కాంత విరహవేదన సొక్కి
మూలమూలలొదిగి మూల్గినట్లు
నిరుపేద ఆకట నీరసంబొందుచు
కూటికి అల్లాడి ఏడ్చినట్లు
సర్వము త్యజియించి స్వామి చింత చేసి
సాయి సాయి యంచు హాయి గనుడు

తల్లి కైవడి అన్ని తప్పులు సైచియు
పుణ్యమొసగునట్టి పూజ్యభూమి
వలదన్న సద్గ్రంధ పఠనంబు లేకయే
పలు శాస్త్రములు నేర్పు పాఠశాల
శ్రమలేక తనయందు సర్వంబు సమకూర్చి
ఆనందమొనగూర్చు విహార భూమి
అజహరాదులనైన పసిపాపల జేయు
మహిమను చేకూర్చు మంత్రశాల
సతుల అనురాగ సర్వార్థ  సాధనంబు
శాంతి సౌభాగ్య కళ్యాణ కల్పకంబు
ప్రణయ త్యాగోపదేశ వైరాగ్య శాల
పతి గృహంబె సతులకు పాఠశాల.

తల్లి గర్భమునుండి ధనము తేడెవ్వడు
వెళ్ళిపోయేనాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమెగాని
మెరుగు బంగారము మ్రింగబోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటెగాని
కూడబెట్టిన సొమ్ము తోడు రాదు
పొందుగా మరుగైన భూమిలోపల పెట్టి
దాన ధర్మము లేక దాచిదాచి

తుదకు దొంగలకిత్తురో దొరల కగునో
తనదియనియెదునట్టిది ధనము కాదు
ఆత్మ ఒక్కటె శాశ్వతమరసి చూడ
సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!

తారకంబనియెడి బంగారు మనకుండ
పర శాస్త్రముల యెడ భక్తి ఏల?
హైందవ ధర్మ హిమాద్రులు మనకుండ
పరధర్మమను పర్వతంబులేల?
భరతనీతియనెడి సారజలంబుండ
పరనీతియను ఉప్పునీరు ఏల?
యోగశాస్త్రంబను యోగ్యశాస్త్రంబుండ
పరయోగములందు పరత ఏల?
ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ
అట్టులైనారు భారతీయులును నేడు
ఇంతకన్నను వేరెద్దిఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

తారకాఖ్యాసురు దర్పమణచువేళ
గౌరి తనయుకిడ్డ వీర రక్ష
శంభరాసురవీరు జంపగా జనులేళ
భారవిసుతుకిడ్డ భవ్య రక్ష
మత్రు దాసిత్వంబు మాన్పనరగువేళ
వినత పుత్రునకిడ్డ విమల రక్ష
జనకుయానతి పాలింప వనికేగెడిన్ వేళ
తల్లి రాఘవుకిడ్డ ధన్య రక్ష
అట్టి శ్రీరక్ష ధీరక్ష అంగరక్ష
రక్షలందున దివ్యమౌ రామరక్ష
తోడునీడయై నిన్ను కాపాడు గాక
తనయా! తోడునీడై నిన్ను కాపాడు గాక!

తలుపు తీయునంతలోనె తత్తరమది ఏలనోయి?
తలుపు తీతు కొంతసేపు తాళుము కృష్ణా!
పతి నిద్దురపోవలేదు మది సంశయమొందునేమొ
తలుపు తీతు కొంతసేపు ఆగుము కృష్ణా!

తారకము సూటెరుగవలెనన్నా
సద్గురుని కృపచే తారతమ్యము తరచి కనుమన్నా!
మరపు తెర పడకుండ జాగ్రత నిరతము స్వప్నా సుషుప్తిలో
అరమరలు లేకుండ ఎప్పుడు
తరచుగ జీవాత్మ చదివెడి. ।తారకము।

తుమ్మెదా! ఒకసారి కన్నెత్తి చూడమని
చెప్పవే నా మాట శ్రీకృష్ణునకు
మబ్బు గ్రమ్మిన నాదు మానస వీధిలో
కృష్ణభానుని తేజము నిలుపమనుము
ఎండబారిన నాదు జీవిత వృక్షమునకు
చిగురు పెట్టగ వేగ చేయమనవె
చెదరిపోయన నాదు జీవిత సుమ మాల
చెల్వారగూర్చి ధరియించమనవె.

త్వరపడుమా త్వరపడుమా
ప్రభుసాయీశుని ప్రేమ పిలుపులవి
వినబడుచున్నవి రమ్మనుచు
పరమార్థము చేకొనుమనుచు ॥త్వరపడుమా॥
యోగసాధనల పనియేలేదట
ఉపదేశంబులు లేవు కదే
ప్రజలకు తరుణోపాయంబగు
శ్రీసాయీశుని నామమటె ॥త్వరపడుమా॥
మత భేదంబుల మాటే లేదట
మానవ సేవయె జేయునటె
మానుగ బాధలు బాపి భక్తులను
మరువక బ్రోచే సాయియటె ॥త్వరపడుమా॥

తైతై తైతై తైబొమ్మా!
దీని తమాష చూడర మాయబొమ్మ!
ఖ్యాతిగ దీనికి ముందువెన్కగల
కథ వివరింతును విను జీవా! ॥తై తై॥
మాతృగర్భమున మలమూత్రముల
రోతల నీవు రోదింప
ప్రీతిగ వీరలు పేరంటమ్ములు
చేతురిదెంతటి చిత్రమురా! ॥తై తై॥
పుట్టితి మతి కోల్పోయితి దుర్గతి
పుట్టితినని నేనేడువగా
అట్టే నవ్వుచు నానందించెద
రిట్టి వీరు నీకెవరయ్యా? ॥తై తై॥
మసిలో మట్టిన మలమూత్రములన్
మసలుచు సిగ్గను మాటయె లేక
పసిపాపడవై ఏడ్చుచు లేచుచు
దినమొక నాటకమాడవకొ. ॥తై తై॥
తోడి వారలతొ కూడియాడుచు
వేడుకతో పలు విద్యలు నేర్చుచు
చూడచూడగ చోద్యపు కళతో
ఎదేడునకు ఎదిగే బొమ్మా. ॥తై తై॥

సతియని పతియని సరస భావమున
జత జేరుచు సంసార రంగమున
అతి కౌతుకమున నంతకన్ననిక
అన్యము లేదని ఆడితిరే ॥తై తై॥

బొమ్మను బొమ్మను పొందు పరచి పలు
బొమ్మలు సేయుర బ్రహ్మయ్య
నమ్ముటవన్నియు నావేయని థిం
థిమ్మని వానితొ నాడుదుగా ॥తై తై॥

ధనము గూర్చునెడ దాచిపెట్టునెడ
దానిబెంచ నది చనినపుడున్
తనువుతోడ నీ మనసుతోడ నీ
తాండవమెన్నగ తరమౌనా ॥తై తై॥

కామము, క్రోధము గట్టి కోలగా
తామసంబు ముకుదాడులుగాగన్
కామినియున్ కనకంబు చేతిలో
గంగిరెద్దులై గంతులు వేసే ॥తై తై॥

సాగుచున్నదని లోగిన వారిని
సంకట పెట్టుట సంతసమా?
ఈగ కాలియంతె వికటించిన
నీ గతి తైతకలే కదా! ॥తై తై॥

ఉరిమి చూచుచును కరములూచుచును
ఒడలెరుగని శవమొందుచును
అరచుచునెగురుచు అందరు నవ్వగ
ఆగ్రహమను దయ్యము పట్టిన ॥తై తై॥

చదువెందులకని సంగతి మరచి
ఉదర పూర్తికై ఉరుకులెత్తుచు
ఎదుటి గొప్ప సహింపకేడ్చుచు
సతమతమయ్యే చదువుల బొమ్మా ॥తై తై॥

గుట్టుగ నీ చెడుకోర్కె చెల్లెనని
లొట్టలు కొట్టకు రోరన్నా
చిట్టా రాసే చిత్రగుప్తు కం
డ్లెటుల గంతలు కట్టుదురా! ॥తై తై॥

అందము ప్రాయము ఇంద్రియశక్తియు
ఉందని నిక్కకురోరన్నా
ముందున్నదిరా తొందరలోనే
ముసలితనమ్మను ముసుళ్ళ పండుగ ॥తై తై॥

మసలలేవు కనుమసకలు మోమున
ముడతలు పడె తల నెరిసెనుగా
ముసలి కోతియని పసివారలు నిన్
ముసిముసి నవ్వగ కసరే బొమ్మా ॥తై తై॥

చచ్చు దాక సంసార చింతలో
పుచ్చిన లాభము వచ్చేనా!
అచట నీ యమయాతన కడ్డము
వచ్చేదేదిర పిచ్చయ్యా? ॥తై తై॥

బుఙ్ఙుమనుచు జీవుండను పిట్ట
బుట్టబొమ్మను విడిపోగా
బిఙ్ఙుగ నీల్గిన కఙ్ఙ బొమ్మ యిది
బఙ్ఙున బయటకి పట్టి లాగే ॥తై తై॥

పంచభూత సంభవమౌ మేనికి
పంచత్వము ప్రాప్తించు కదా!
వంచితుడై నాదంచు దీనికై
వాంఛగొంచు దుఃఖించే జీవా! ॥తై తై॥

బంధువులందరు వాకిటి దాకను
వల్లకాటికిని వత్తురుగా
బంధమణచి నిను బాయని ఆప
ద్బంధువు భగవన్నామమెరా! ॥తై తై॥

నమ్ముకొనకు నిత్యమ్మని దేహము
పుట్టి ముంచునది నట్టేటన్
తుమ్మునంతలో తూలిపోవునీ
తొమ్మిది తొఙ్ఙల తోలుబొమ్మ ॥తై తై॥

ఆపదలన్ సౌఖ్యములందున
ఏపుమీరగా ఏడ్చుచు నవ్వుచు
ఆ పరమేశ్వరునానతి మేరకు
ఆడే భోగము తాపా బొమ్మా ॥తై తై॥

ధర్మకర్మ సూత్రంబులకొని నిన్
తానాడింపగ దైవంబు
మర్మమెరుంగక మాయేటందువు
మాధవుచేతి కీల్బొమ్మా ॥తై తై॥

తరతరమును సుస్థిరమనిపించును
పరమావస్థల పాలుచేయుచు
మరునిమిషంబిది మరుగున పడురా
పరమాత్ముడు సల్పిన మాయ బొమ్మ ॥తై తై॥

చెట్టైపుట్టై చీమైదోమై
చిలుకై కొండచిలువయునై
పుట్టుచు గిట్టుచు కొట్టుకొనుచు
గట్టే వెతకని కర్మజీవా! ॥తై తై॥

అరుదుగ దొరికెను నరజన్మంబిది
అరనిముసము వృధా పరుపకురా
తెరువు నెరుగు చని పరమాత్ముని గని
చిరసుఖమొందర చింతాజీవా! ॥తై తై॥

నీ యదృష్టమున సాయికృష్ణుడై
ఆ యఖిలేశుండగుపడురా
హాయిగ సత్యసాయినాత్మలో
అరయుచు నిను నీవే ఎరుగుమురా ॥తై తై॥

నీటుగ మాటలు కోటి పల్కినా
నీ కడుపింతయు నిండదురా
సూటిగ నాత్మజ్యోతిని కన్ననె
ఆటవిడుపు నీకగునయ్యా ॥తై తై॥

వ్యర్థంబగు నీ వెట్టి బఖ్ఖకథ
విని అజ్ఞానము వీడుము జీవా
సార్థక సత్యసాయి బుఖ్ఖకథ
కని ప్రజ్ఞానము గొనరన్నా ॥తై తై॥

దక్షిణాంగుష్ఠమిచ్చిన దానజేసి
బాణ సంధాన లాఘవ భంగమయిన
నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యె
బార్థునకు మనోరుజయును బాసెనంత.

దానధర్మము లేక దయయు సత్యము లేక
మానసమున మంచి నీతి లేక
చెడుగుణములతోడ చెలగాడుచున్నట్టి
వానికిహము చెడును పరము చెడును.

దీన శుభము లేదు దివ్యకీర్తియు లేదు
జగతి బుట్టిపుట్టి చచ్చిచచ్చి
పొరలనేల మరల బుట్టని చావని
త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి.

దోషచింతనమున దోషియౌ చిత్తంబు
సద్గుణంపు చింత శాంతి నిచ్చు
దైవచింతనమున దైవంబె యగునయా
ఉన్నమాట తెలుపుచున్న మాట.

దుర్గుణంబులు సవరించి తొడరుటకును
సాధు సంరక్షణమ్ము సల్పుటకును
గర్భ దుఃఖ మొకింతయు కాంచకుండ
పుట్టుచుండును స్వేచ్ఛగా పుడమి సాయి.

దుష్టసంకల్పములచేత దుఃఖితుడగును
సత్యసంకల్పముచేత సాధువగును
సకలసంకల్పశూన్యుడే శాంతినొందు
సత్యమును తెల్పు బాట శ్రీసాయి మాట.

దుష్టగుణములు వదలిన శిష్టుడగును
చింత వదలిన దొరకును చిత్తశుద్ధి
త్యాగ గుణమున్న స్వచ్ఛంద తత్వమబ్బు
మరువగాబోకుడిటువంటి మంచిమాట.

దూషణంబు హింస దూరంబుగానెట్టి
దైవచింత తాను దండిపరచి
ప్రేమతోడ తాను ప్రజలను చూచిన
దైవప్రేమ తనకె దండి ఉండు.

దేవదేవుని సేవకే దేహమమరె
కనుక దేవుని దాసుడై మనగ వలయు
విషయ దాసులు కాకుడు వసుధలోన
సత్యమునుజూపు మాట శ్రీసాయి మాట.

దేవ సేవకుండు దేశనాయకుడైన
స్వార్థ రహిత సేవ సలుప గలడు
పదవి కాంక్షవాడు పరశుద్ధ హృదయుడ
ఉన్నమాట తెలుపుచున్న మాట.

దేవునెరుగునట్టి తెలివి ఒక్కటె చాలు
తత్తరంపు తెలివి తట్టెదేల?
దేవునెరుగనట్టి తెలివేమి తెలివయా?
ఉదర పోషణ కొరకు వట్టి తెలివి.

దేవుడెక్కడనుచు దేవులాడగనేల!
హృదయమందు లేడె ఈశ్వరుండు
ఇచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ
అటులచేసి ఆత్మతత్త్వమనుభవించు.

దేవుడన్నమాట తెలియునందరికిని
మాట తెలిసినంత మూటయేమి!
దేవు పొందునట్టి దివ్యగుణములు లేక
దేవునెట్లు మీరు చూడగలరు!

దేహభ్రాంతి లేని మోహమింతయు లేని
త్యాగనిరతులైన యోగివరులు
గురులు నాడు నేడు గురువులట్టివారలె
సత్యమైన బాట సాయి మాట.

దేహమునిచ్చినదెందుకొ తెలుసా
దేశములన్నీ చుట్టుటకా! కాదు కాదు
పరోపకారమిదం శరీరమను పదము
ఆచరణలో నుంచుటకు.

దైవభావంబు హృదయాన తలపనీక
రెండు దోషాలు వెంటాడుచుండు నరుని
తనదు లక్షల దోషాలు దాచుకొనుచు
పరుల దోషంపు నలుసును బయట పెట్టు.

ధనము వచ్చును పోవును ధరణియందు
నీతి ధర్మాలు నిలుచును నిజమగాను
నీతి ధర్మాలు హృదయాన నిలుపుకొన్న
సార్థకంబగు మానవ జన్మ భువిని.

ధనమెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణములు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణములు మానును వేమా!

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

దేహంబు క్షీణించు దినమెవ్వరెరుగరు
    కష్టంబులొచ్చుట గాంచలేరు
జగతిపైనెవరైన జన్మించుటెరుగరు
    దివి భువి సుఖములన్ దెలియలేరు
మాయ లోపల చిక్కి మమత వీడగజాల
    రించుక తమ మర్మమెరుగలేరు
మానవ ధర్మంబు మాటయే మరతురు
    దేనినొనర్తురో తెలియలేరు
ఇన్ని తీరులు కూడ దైవేచ్ఛగాన
దీన వత్సలుడతని ప్రార్థింతురేని
సృష్టి చిత్రంబులెంత విచిత్రమైన
భక్తిశక్తియు ముక్తియు బాబ యిచ్చు.

ధనధాన్యములును ధర్మగుణంబున్న
    సంతతి లేదను చింతయుండు
విద్యాధికారియై విఙ్జవీగుచు నున్న
    ఉద్యోగములు లేక వెతలనొందు
దైవభక్తి కలిగి ధర్మగుణంబున్న
    ధనము లేదని యెంతొ తల్లడిల్లు
కుదువంగ లేకను అల్లాడుచున్నట్టి
    నిరుపేదకెందరో బిడ్డలుంద్రు
సంపదలుండియు సంతోషమున్నను
    లోపల పెద్దగ లోభముండు

ధనమున్నదని పెద్దలను జెన్కనగుగాని
    పుడమి నద్దానిచే ముక్తి రాదు
బలమున్నదని మిట్టి పడవచ్చునేగాని
    పుడమి నద్దానిచే ముక్తి రాదు
విద్వాంసుడని పెద్ద బిరుదొందనగుగాని
    పుడమి నద్దానిచే ముక్తి రాదు

భక్తి సంపాదనముచే ముక్తి కలుగు
రామ భక్తులు కాకున్న రాదు ముక్తి
శాశ్వతముగావు మిగతవి సత్యముగను
భక్తియేయున్న నీ సాయి సర్వమొసగు.

ధనము ధారగ పోయ దరికాని
ఆనందమును మీరలందుకొనుడి
తీర్థయాత్రలనెన్నొ తరిగినన్ కనరాని
ఆనందమును మీరలందుకొనుడి
విద్యలన్నియున్ వల్లెవేసినన్ కనరాని
ఆనందమును మీరలందుకొనుడి
ప్రాణముల్ బిగపట్టి పరుమార్లు కనరాని
ఆనందమును మీరలందుకొనుడి
కాసు ఖర్చు లేదు కాయకష్టము లేదు
లేదు చదువు సాధనాది బాధ
మనసొకింత యిచ్చి మరి సాయికడనుండి
అందరాని ఫలము పొందరయ్య.

ధనము దైవంబయ్యె దర్పంబె మతమయ్యె
స్వార్థమే బుద్ధికి స్థానమయ్యె
అహము ఫ్యాషను అయ్యె ఆశలందంబయ్యె
ధర్మంబు వమ్మయ్యె ధాత్రిలోన
దయయు హీనంబయ్యె నయము శూన్యంబయ్యె
కపటమే జీవుల కాంతులయ్యె
ప్రేమానురాగముల్ రోగాల పాలాయె
కామాంధులుగ జేసె కలిని చదువు
బ్రతుకు బరువయ్యె మతులకు గతులు తప్పె
జాగుచేసిన నేగతి జగతి కానో!
విద్య యందున నైతిక విలువ జేర్చి
భరత సంస్కృతిని మీరు బడయరయ్య.

దినకరుడు శాంతుడై తోచె దినములింక
కురచనయ్యె చలిగాలి చురుకు హెచ్చె
పొలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలోన
కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి
పదములన్ పాడదొడగిరి పచ్చపూలు
జనపచేలకు ముత్యాల సరులుగూర్చె
మిరప పండ్లకు కుంకుమ మెరుపుదాల్చి
బంతిపువ్వుల మొగములల్లంత విప్పి
మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి
సరసురాలైన పుష్యమాసంబునందు
పరగనొప్పుచు సంక్రాంతి పండుగొచ్చె.

దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న
పొంచి చూచుకనులున్న పంచల విను మనసున్న
వంచన గుణ చిత్తమున్న వంచించే పలుకున్న
ఈ వికృతులు చూడగనే న్యాయమింక బ్రతుకదన్నా
ఏ గుణంబును హృదయంబున నిలువదన్నా.

దేహమందు జీవుడుండు హృదయమందు దేవుడుండు
రెండుకూడియాటలాడి ఒకరినొకరు వీడుచుండ్రు
బొమ్మలాటలాడించే సూత్రధారి ఒకడు కలడు
ఒకటిలోనె రెండునుండు రెండు చేరి ఒకటియగును.

దయచేత ధన్యులు కావలెరా ఎంతటివారు ॥దయ॥
అసురుడైన భూసురుడైన అఖండ తెలివిగలవాడైన ॥దయ॥
విద్య నేర్చి వాదాడినగాని పద్యములెంతో పాడినగాని
కొండగుహలలో నుండినగాని కూర్చుని జపములు చేసినగాని ॥దయ॥
యోగాభ్యాసము చేసినగాని భాగవతాదులు చదివినగాని
బాగుగ గెడ్డము పెంచినగాని పట్టెనామములు పెట్టినగాని ॥దయ॥
ముక్కుమూసి జపమాచరించిన మొక్కుచు బాగా నిలచియుండిన
వెక్కివెక్కి ఏడ్చినగాని మొరలిడినను నీకు కరుగదు మనసు ॥దయ॥
కాషాయ వస్త్రము వేసినగాని కంఠమాల ధరియించినగాని
గడగడమని జపమాల తిప్పిన కడకు నీయొద్దకు రావలె బాబా ॥దయ॥
భక్తితో మిమ్ము గొలిచినగాని పుట్టపర్తికే వచ్చినగాని
పూజలు బాగా చేసినగాని పుడమియంతయును తిరిగినగాని ॥దయ॥

దైవనామమను మిఠాయి యిదిగో రండి భక్తులార!
వేదసారమను గోధుమ పిండితో
వేదవాక్యమను క్షీరము పోసి
ఆధారమైన పెద్ద బాండువ తీసి
ఆదిమునులు దీనిని బాగుగ కలిపిరి. ॥దైవ॥
భక్తియను ఖండచక్కెర తెచ్చి
సుబుద్ధియను ఆవునేయి పోసి
అబద్ధమనియెడి మలినము తీసి
ఆదిమునులు దీనిని బాగుగ పంచిరి. ॥దైవ॥
రకరకమైనది దైవ ప్రసాదము
సకల రోగ నివారణమోయి
ఒక కాసైనను ఖర్చు లోదోయి
తకరార్ చేయక పంచుకోండోయి. ॥దైవ॥

నగలు పెట్టిన కోతికి సోగసు రాదు
కనులు విప్పిన అంధుడు కనగలేదు
భక్తి పొందడు మూర్ఖుడు యుక్తి చేత
ఉన్నమాట తెలుపుచున్న మాట.

నమ్మకమను రెండు నయనంబులే లేని
అంధులైరి మనుజులవనియందు
తాము చూడకున్న దైవంబు లేడకొ
తనకు లేదుగాని మనకు లేడ!

నమ్మక చెడిన వారలున్నారుకాని
నమ్మి చెడిన వారేనాడు లేరటంచు
బుధుల వాక్కును మీరాలకించుడోయి
సంశమును వీడి సాయిని చెరరోయి.
నమ్మి కొల్వ రాయి నారాయణుండౌను
నమ్మకున్న వట్టి దిమ్మె సుమ్మి
నమ్మి చెడినవారు నరులయందున లేరు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

నదిని దాటు వరకు నావ యవసరంబు
దివ్యపదము చేర దేహమట్లు
అవసరంబుగాన ఆరోగ్యమందుడీ
మలినమైన తిండి మానరయ్య.

నరుని జీవితంబు నల్లుల మంచము
పుడమినొడలు రోగమొడవు కొంప
సంతసమును చూడ ఎంత దూరమొ కదా
ఉన్న మట తెలుపుచున్న మాట.

నీటియందె పుట్టి నీటనే తేలుచు
నీటియందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

నీటియందు పడవ నిలచియుండుట మేలు
నీరు పడవయందు నిలువ కీడు
జగములోన నిలచి జనులుండుటయే మేలు
జగము మదిని నిలువ జనము చెడును.

నీతినియమాలు నరునకు ఖ్యాతిగూర్చు
బాల్య దశయందె యియ్యవి పట్టుబడును
ఇట్టి రీతుల తెలిపెడినట్టి జనుల
నెంచి అధ్యాపకులనొనరించరయ్య.

నీతి బోధలెన్నొ నిజముగా తెలిపిన
పట్టుపడవు మదిని పామరులకు
మునగబెండు నీళ్ళముంచినా మునగదు
విడవగానె పైకి వెడలి వచ్చు.

నీతినియమాలు గ్రంథాన నిలచిపోయె
హృదయమంతయు దుర్గంధ సదనమయ్యె
చేతలంతయు స్వార్థంపు చేతలయ్యె
ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యలందు.

నీతినియమాలు లేక తిరిగిన
ధాతకైన అజ్ఞానముడుగునో
ఝ్యోతి లేనిదె అంధకారము
భూతలంబున బాయకుండు.

నీలో నాలో నిజమొక విష్ణువె
ఓపికలేనీ కోపము వ్యర్థము
ఎల్లెడ సమమై ఉల్లంబుంటే
అపుడె అనుభవమగు విష్ణుత్వము.

నేటి విద్యార్థులార నా మాట వినుడు
పరుష భాషయు దుష్టమౌ పనులు చేయ
వదలవయ్యవి మనపైన వచ్చు పిదప
సత్యమును జూపు బాట ఈ సాయి మాట.

నేటి విద్య తెలివితేటలనే పెంచు
కొంచెమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
అట్టి విద్య కన్న మట్టి మిన్న.

నేటి విద్యలెల్ల నిధి సేకరణకౌను
పూర్వ విద్యలన్ని పూజ్యమయ్యె
పక్షి పల్కులిడదె బహువిధ బోధలన్
సత్యమైన బాట  సాయి మాట.

నేటి విద్యార్థులందున నూటికొకరు
పాఠ్యగ్రంధాలు చదువంగ పాటు పడరు
పాసు కావలెనంచును పరితపింత్రు
బూటకంబుగ మారెను నేటి విద్య.

నేను నేనుగా ఉన్నంత నీవుగావు
నీవునీవుగా ఉన్నంత నేనుగాను
నీకునాకును యిందులో నెలవు లేదు
ఉన్నదొక్కటె హృదయంబు ఎన్నగాను.

నేను వెలుగులోనున్నాను నేనెవెలుగు
వెలుగు నాలోన ఉన్నది వెలుగు నేనె
అనుచు తలచుచు చిత్తాన హత్తుకొన్న
అట్టి జ్ఞానియె బ్రహ్మలో ఐక్యమగును.

నేను సాయిని తెలియుము నిక్కముగను
మమత బాయుము యత్నముల్ మానుకొనుము
బాసె మీకు నాతోడి సంబంధమింక
కాదు నన్పట్ట మరి యెట్టి ఘనునికైన.

నో అను వారికి నో అనురా
ఎస్సనువారికి ఎస్సనురా
నో యస్సులు మన నోటికి గాని
సాయికి సర్వము ఎస్ ఎస్ ఎస్.

నల్లనివాడు పద్మనయంబులవాడు కృపారసంబు పై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వురా
జిల్లెడు మొమువాడొకడు చెల్వల మానధనంబు దోచెనో
మల్లియలార! మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే!

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

నవనవోజ్వల శిల్పనైపుణ్య ధోరణి
తనరారు లలిత సౌందర్యరాశి
శిల్పకళా పరిచిత్రితంబగు వర్ణ
దీపికల్ చిందెడి దివ్యకీర్తి
కోటి శిల్పుల తోడ కొంగుబంగారైన
భవ్యదివ్య స్ఫూర్తి ప్రాభవంబు
ప్రాచీన మందిర వాస్తుశాస్త్రస్ఫూర్తి
భూనభో వ్యాప్తి సమర్చితంబు
శుభముహూర్తాన మంగళసూచకముగ
తరలి భారతదేశ ప్రధానమంత్రి
విశ్వకళ్యాణ భవనమావిష్కరించె
సర్వజన మాన్య నరసింహ సార్వభౌమ!

నా రాక ఎరిగినంతనె వేగ రమ్మని
ద్వారపాలకునిచే ఆజ్ఞనంపె
నను చూచినంతనె దిగ్గున గద్దె దిగి
నగుమోముతో నన్ను నండజేర్చె
నను చూచి మోము వాచినయటుల
ఎగదిగా చూచి కౌగిటం బిగుచికొనియె
దేవి! ఏమందు నాతని దీనపరత
పేదకుచేలునటుకులు పిడికెడు తిని
బహుళభాగ్యంబు నందించు వారు కలర!
ప్రేమయే ఆతడాతడే ప్రేమయగును.

నారాయణుని బోధ నమ్మియుండిన చాలు
సామవేదము మీరు చదివినట్లె
నారాయణుని వాక్కు నమ్మియుండిన చాలు
ఇల యజుర్వేదము తెలిసినట్లె
నారాయణుని వాక్కు నమ్మియుండిన చాలు
పుడమి ఋగ్వేదము నుడివినట్లె
నారాయణుని వాక్కు నమ్మియుండిన చాలు
సరి అథర్వణమును చదివినట్లె
తుచ్ఛభావాలు మదిలోన తొలగియున్న
నిశ్చలంబుగ బుద్ధి నిలుపుకొన్న
ఇంతకన్నను శివరాత్రి ఏమికలదు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

నిరత సత్యప్రౌఢి ధరణినేలిన హరి
శ్చంద్రుడీ ధరబాసి చనగలేదె
ఎల్ల లోకములేలె ఎసగ శ్రీనలరాజు
తనవెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబును నలంకృతి చేయు మాంధాత
సిరి మూటగట్టుక అరగినాడె
జలధి సేతువుగట్టె అలనాడు శ్రీరాము
దుర్విపై నిప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారొ
ఒక్కరును వెంటగొనిపోరు నుర్వితలము
నీవు మాత్రము రాజ్యంబు భోగములను
తలను కట్టుక పోదువా ధర్మహృదయ!

నీ కతంబునకాదె నిలువ నీడయు లేక
మన తల్లి పరునింట మసల వలసె
నీ మూలమునగాదె నిందైన సభలోన
మన కాంత దుఃఖించె మానమడసి
నీ కతంబున కాదె నా ముద్దు కొమరుడు
లేవయస్సున ధాత్రి లీనమయ్యె
నీ మాట విని కదా నిన్నమొన్నటిదాక
పదరాని యిక్కట్లు పడగ వలసె
అనుగు తమ్ములనెంతేని అలయజేసి
భరతకుల గౌరవమ్మును భంగ పరచి
ధనకనకవాహనములను ధారపోసి
ఎట్లు భరియించియున్నాడవిపుడు నీవు?

నిగమాలు హరియించి నిండు దూషణ చేసి
సోమకాసురుడేమి సుఖమునొందె?
పరసతినాశించి పదితలల్వాడేమి
కట్టుకు పోయెను గట్టిగాను?
ఇల సూదిమొనయంత ఈయజాలనటన్న
దుర్యోధనుండేమి దోచుకొనియె?
పసిపాపలనుకూడ కసిపట్టి చంపిన
కంసుడేపాటి ప్రాణంబు కాచుకొనియె?
నేటి దుర్మార్గులకు కూడ నిదియె గతియు
నేడు కాకున్న రేపైన నిలువరిచట
పెట్టుకొనబోకు ఏ ఆశ పెద్దగాను
మితము కలగియుండుటే మేలు నీకు

నరహరిని నమ్మక నరులను నమ్మితే
నరజన్మమీదేర తరమె మనసా?
నీళ్ళుండగా ఉమ్మినీళ్ళను మింగితే
దాహము తీరునా ధరను మనసా?
చెరకుండగా వెఱ్ఱిచెరకును నమిలితే
రుచి ఎట్లు జిహ్వకు శుచిగ మనసా?
కాళ్ళుండ మోకాళ్ళ కాశికి నడిచితే
చేరంగ సాధ్యమా చెప్పు మనసా?

నరరాక్షసులు చేరి పురవీధుల తరుమ
బాధలెన్ని పడిరో బలరామ కృష్ణులు
పసికందులగు మీపై కంసభూపాలుండు
మదగజంబు వదల మనసెట్టులొప్పెనో?
కన్ననాటి మొదలు కష్టాల్ పాల్జేసి
కంటితోజూడు మా కర్మ ఫలమదేమొ!

నవ్వుచు నవ్వుచు జీవితంబను నది దాటెడువారు
ఏడ్చిఏడ్చి తేలిమునుగుచు ఈతరాని వారినిజూచి
జాలి తలచక లోతెంతయని అడుగువారలు నరులేనా?

నిను కనుగొనగలమా కృష్ణా! నిను కనుగొనగలమా!
అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు
ఘనముకంటె అతి ఘననీయుడవు
ఎనుబదినాలుగు లక్షల జీవముల
అనయమ్మును నెడబాయకుందువట
అణురేణు తృణకాష్టము మొదలుగ
అఖండ రూపుడవై వెలయుచుందువట
ఘనమగు దొంగలలో గజదొంగవు
నిను కనుగొనగలమా కృష్ణా!

నిలువ నీడలేని బ్రతుకు నీకొరకని మోయుదాన కృష్ణా!
నిలువదురా నా మనసు నీ నగవులు దూరమైన
కలలో నా కనులకు కానగరాదా కృష్ణా!
నిన్ను విడచి నిలువ లేనురా కానగరారా కృష్ణా!
కనుపాపవు మాటకు పసిపాపవు మనసుకు
నిను విడచి అరనిముషము నిలువగలేరా కృష్ణా!

నీలాల సౌధాల్లో నీ ఆశ గాథలలో
నా మనో వేదనలొ నా హృదయ రోదనలొ
ఉండేది కృష్ణుడే ఊరకుండేది కృష్ణుడే
మదిలోని భావాల్లో కదలేటి కోరికలలో
తీయని ఊహలలో తూగుటుయ్యాలలో
ఉండేది కృష్ణుడే ఊపుచుండేది కృష్ణుడే
తలచేటి తలపులలో వలచేటి వలపులలో
పిలిచేటి పిలుపులలో కలలు కనే కనులలో
ఉండేది కృష్ణుడే ఊ కొట్టుచుండేది కృష్ణుడే!
నావాడనేననుచు నాదాన నీవనుచు

దరిచేరి దూరమగుచు ఉండేది కృష్ణుడే
దూరమగుచుండేది కృష్ణుడే!

పక్వఫలము వృక్షమునుండి పడిన భంగి
జ్ఞాని కడతేరు కర్మశేషంబు వీడి
సంచితానికి వడ్డీని పెంచుకొనుచు
పాపి వర్ధిల్లు దినదిన ప్రాభవమున.

పగటి దృశ్యంబు స్వప్నాన పారిపోవు
స్వప్న దృశ్యంబు పగటిలో వాలిపోవు
పగలు రేకలలందున పరిణమించు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

పచ్చకప్రపు మడిలోన పాదుచేసి
కమ్మ కస్తూరి ఎరువుగా కుమ్మరించి
మంచి పన్నీరు పోయుచు పెంచిరేని
ఉజ్జగించునె తన కంపు ఉల్లిపాయ.

పతుల మాటకు ఎదురు చెప్పంగబోదు
వారి సేవలు చేయగా తీరదనదు
తనకునున్నట్టి దానితో తృప్తిగనును
ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు.

పనులయందలి పాపపుణ్యముల బట్టి
అనుభవముదీర జీవులునవని బుట్టె
కనుక సత్కార్యములు చేయగల్గిరేని
దైవమే తోడుగానుండు ధరణియందు.

పర్వతశ్రేష్ఠి పుత్రిక పతి విరోధి
అన్న పెండ్లాము అత్తనుగన్న తండ్రి
ప్రేమమీరంగ నాతని పెద్ద బిడ్డ
సున్నమిప్పుడు తేగదే సన్నుతాంగి.

పరుగు జీవితములె పరిపాటి కలిలోన
పరుగులిడకయున్న పనులు చెడును
బస్సులు సినిమాలు పరుగులకే చిక్కు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

పరుల దూరుచున్న పాప ఫలంబబ్బు
విడవదెన్నటికిని విశ్వమందు
పరులు పరులు కాదు పరమాత్ముడేయగు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

పరులు దూషింప నీవునూ వారివలెనే
తిరిగి దూషింప నీదు ఆధిక్యతేమి?
ఏది తప్పని నీవు ఎరిగినావో
దాని చేయక యుండుటే ధర్మపథము.

పరులు నిందజేయ బాధలు పడవద్దు
నిన్ను పరులు పొగడ నీల్గ వద్దు
కలిమి లేకయున్న ఖేదమొందగ వద్దు
ఉన్నదొకడే నీకు కన్న తండ్రి.

పలికి బొంకని వాడె పో పండితుండు
ఆడి తప్పని మనుజుండె అర్చకుండు
ఆశ వదలిన వాడె పో ఆత్మబలుడు
సత్యమును తెల్పు మాట ఈ సాయి మాట.

పలికెడిది భాగవతమట
పలికించెడి వాడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట
పలికెద వేరొండు గాథ పలుకగ నేలా!

పలు మతముల వారిచ్చట
నలుమూలలనుండి వచ్చి నయభయములతో
కలిమియు లేమిని తలపక
పలు బాధలకోర్చియుంద్రు బాబా కొరకై.

పక్షి బలమున ఎగిరెడు పక్షులట్లు
అది విహగ మార్గంబుననుసరించి
చేరవలయును గమ్యంబు శీఘ్రగతిని
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

ప్రళయనిర్ఘాతమరచేత పట్టవచ్చు
హేమశైలంబు కొనవ్రేలనెత్త వచ్చు
దివిని భువిని రెండిటిని సంధింప వచ్చు
ధర హరిశ్చంద్రు బొకింప తరము కాదు.

పాడుము గీతానామ సహస్రము
భావింపుము భగవంతుని రూపము
సజ్జన సాంగత్యమునెప్పుడు సలుపుము
దీనజనులకై చేయుము దానము.

పాప కర్మ నరుడు ఓపికతో చేయు
పాప ఫలము కుడువ నోపకుండు
పుణ్యకర్మ వీడు బుద్ధిపూర్వకముగ
పుణ్యఫలము విడువబోవడెపుడు.

పాపభీతి లేని పామరత్వముబట్టి
దైవప్రీతి లేనిదారి పట్టి
మావత్వమణగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు.

పాపపుణ్యములన పరదేశమున లేవు
తాను చేయు పనుల దగిలియుండు
వేపవిత్తు నాట వెలగవృక్షము కాదు
కర్మ ఫలము వలన కలుగు జన్మ.

పాలు చిలికిన వెన్నునుబడయవచ్చు
నీరు చిలికిన తప్పక నిప్పు వచ్చు
పనికిమాలిన మాటల విలువ సున్న
మరువబోకుడిటువంటి మంచి మాట.

ప్రాణాయామము ప్రత్యాహారము
నిత్యానిత్య వివేక విచారము
మంత్రము తోడ సమాధి నిధానము
జాగ్రత్తగ నిశ్చలముగ చేయుము.

ప్రాణికోటికి నెవ్వాడు ప్రియతముండు?
సత్యమణకువ మధుర భాషాభియుతుడు
అంధుడగువాడెవ్వడీ అవనియందు?
చదువుకల్గియు చెడును సలుపువాడు.

ఫిల్మురికార్డింగు ప్లేటును చూచిన
ఒక్కరీతిగానె ఒనరియుండు
సౌండుబాక్సునందు సవరించి చూచిన
పాటలెన్నొ అందు పలుకుచుండు.

పుట్టినప్పుడమృత పుత్రులైయుంటిరి
వెండి చేరె లోక విషయమెల్ల
విషయవాంఛ చేత విషతుల్యులైతిరి
సకల శ్రుతుల ఊట సాయిమాట.

పుడమి, కన్నతల్లి పూజనీయులు కదా!
వారి మించువారు వసుధ లేరు
కన్న తల్లి సేవకన్న మించినదేది!
జన్మభమి కన్న స్వర్గమేది!

పుణ్యకర్మచేత పుదమి త్యాగముచేత
ప్రేమ భావములను పెంపుజేసి
దానవత్వమణచి దైవచింతన చేత
నిత్య జీవితంబు నెరపు నరుడ!

పుత్ర సంతతి యున్నను భోగమున్న
బంధుగణమున్న సహజాతసంపదున్న
వైభవంబున్న ధనమున్న భాగ్యమున్న
భక్తి లేకున్న అన్ని నిష్ఫలము కాదె!

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

పుస్తకములనిండ మస్తుగ చదువుండె
మస్తకములనిండ మట్టియుండె
నేటి చదువు పొట్టకూటికోసమె కదా
వినుము భారతీయ వీరసుతుడ!

పుస్తకములనెన్ని పఠియించియున్నను
భ్రాంతి వీడిపోదు భావమందు
బయలు తానెరిగిన భావమెరుగ
భ్రాంతి వీడిపోవు భావమందు.

పువ్వు లేక కాయ పుట్టదు చెట్టున
కాయలేక ఫలము కలుగబోదు
కర్మనిష్ట లేక కలుగదు భక్తియు
భక్తి లేక జ్ఞాన భరితుడగున!

పూర్ణ ప్రేమయందె పుట్టును సౌఖ్యంబు
సత్య త్యాగ శాంతి క్షమలునబ్బు
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సత్యమైన బాట ఈ సాయి మాట.

పూలగుత్తులు తెచ్చి పూజెంత చేసిన
మెచ్చుకొనడు తాను పుచ్చుకొనడు
హృదయకమలమివ్వ సదయుడై గ్రహియించు
సత్యసాయి శాంతి ప్రేమదాయి.

పూలయందున పరిమళమెట్లు కలదొ
అటులె దేవుండు నీలోన అలరుజూడ
మేథ చెడిపోయి కస్తూరి మృగమువోలె
ఏల వెతికెదు దేవుని వెఱ్ఱివాడ!

పెక్కు విద్యలు నేర్చిన ఒక్కడైన
సరస సద్గుణవంతుడై సాధుబుద్ధి
సత్యవర్తనంబు సాధుసత్వగుణము
గడపనేర్చిన విద్యార్థి కలడె యిలను?

పొగకు మూలము నిప్పులపుంజముండ
రైలుబండిని నడిపించు డ్రైవరుండ
ఆటొమేటికు లైటుకు అధిపుడుండ
ఒకడు ప్రకృతిని సృష్టింపనుండవలదె.

పొట్టకూటిని చేకూర్చునట్టి విద్య
నీతి ధార్మిక దృష్టిని నేర్పగలదె?
సహజ ధార్మిక దృష్టినే జంపివేయు
సత్యమునుదెల్పు మాట శ్రీసాయి మాట.

పొట్ట మలమూత్రంబుల తొట్టి సుమ్మి
దేహమంతయు దుర్గంధ దిబ్బ సుమ్మి
ఆత్మ దేహమున కిదియె వింత కొంప
మరువబోకుడిట్టి మంచి మాట.

పెద్దలన్న మాట పెరుగన్నమునుబోలు
స్వీకరించ వలయు చిత్తమందు
అట్లు చేయకున్న హానియు కలుగును
ఉన్నమాట తెలుపుచున్న మాట.

పేలములపైన పేరాశ విడువలేక
బోనునందెలుకలు పడిపోయినట్లు
తుచ్ఛవిషయసుఖాసక్తి దూలి నరుడు
వద్దనేయున్న ఆనంద పదవి వదలు.

ప్రేమ లేనట్టి మనసది ప్రేతభూమి
అనగనొప్పారు నిజముగ అవనియందు
శ్వాసనిశ్వాసలను రెండు సలుపుచుండు
కొలిమి తిత్తిని ప్రాణిగా తలపగలమె!

ప్రేమరూపంబు బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతొ సంధింప నీమమగును
కాన ప్రేమను గట్టిగా కల్గియున్న
అద్వితీయమునొందగ అర్హుడగును.

ప్రేమయనెడి పంట పండింప నలవికాదు
ప్రేమ అమ్ముట అదియంత వీలుకాదు
అహము వదలివేయనావిర్భవించు ప్రేమ
మరువబోకుడిట్టి మంచి మాట.

ప్రేమతత్వం ప్రబోధించి
సమత మమతలు పొందుపరచి
మానవత్వపు విలువలు తెలిపిన
అతడె దైవము, అతడె సాయి.

ప్రేమ దైవంబు జగమెల్ల ప్రేమమయము
ప్రేమరూపముగొని వచ్చి పేర్మిబ్రోవ
ప్రేమసుధలను బంధించి ప్రేమగూర్చు
ప్రేమ అవతారి శ్రీమాత సాయిమాత!

పచ్చని రాజవంశవని పాడొనరింప జనించినాడు కా
ర్చిచ్చయి  రేడు సూతసుతు స్నేహము దానికి తోడు గాడుపై
కచ్చలు రేపెనాశకునిగాడు రగుల్కొనె మంట మింట వి
వ్వచ్చునివింటనింక శరవర్షము తప్పదు విశ్వశాంతికై.

ప్రబలి కఫంబు కంఠమున బాధలు పెట్టెడు వేళ బంధువుల్
గబగబ బైటపెట్టుడిక లాభము లేదనువేళ కింకరుల్
దబదబ ప్రాణపాశములు లాగెడువేళల ఆలుబిడ్డలున్
లబలబ ఏడ్చువేళ తరమా హరినామము నోట పల్కగన్!

పరగన్ మా మగవారలందరును మున్ బాణప్రయోగోపసం
హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి పుత్రాకృతినున్న ద్రోణుడవు నీ చిత్తంబులో లేశమున్
గరుణాసంగము లేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే!

పాప భయంబు పోయె పరిపాటయిపోయెను దుష్కృతంబిలన్
శ్రీపతి భక్తిపోయె వివరింపగ లేని దురంత కృత్యముల్
దాపురమయ్యె లోకమున తాపసలోక శరణ్యుడైన ఆ
శ్రీపతి నామచింతనయె చేకురచేయు సుఖంబు మానవా!

పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?
తనువును తా దండించిన విషయభోగములుడుగునా?
ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞానియగునా?
తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెటులబ్బు?

పుట్టితి పూజ్యుడౌ ద్రుపద భూపతికిన్ జగజెట్టి పాండు సా
మ్రాట్టుకు కోడలైతి నభిమానధనుల్ ఘనులైనవారి జే
పట్టితి శౌర్యధైర్య గుణపాత్రుల పుత్రులగంటి నూడిగం
బెట్టుల జేయజాలుదు నిసీ మగవారలు సిగ్గుమాలినన్!

పుస్తకముల్ పఠించితిని పూర్తిగజూచితి సర్వ శాస్త్రముల్
నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియును పాడగు విద్యలె చూడ మానవా!

ప్రేమ మయుడు శ్రీధరుడు ప్రేమయె అతని దివ్యరూపమౌ
ప్రేమయె సర్వమానవుల ప్రీతికి తారకమంత్రమట్టి స
త్ప్రేమ రవంతయైన వివరింపగలేక జగంబునందు త
త్కామిత సత్పధార్ధమెటు గాంచగనేర్తురటయ్య మానవా!

పంకజాక్షుని చింత పలుమారు సేయక
పరుల నిందించుట పాడికాదు
విష్ణుసంకీర్తనల్ వీనుల వినకుండ
పరుల స్తుతులజేయ భ్రాంతికాదె
శేషశయనుజాల చెలగి కీర్తింపక
పరుల కీర్తించుట భావ్యమగునె
దామోదరుని రూపు ధ్యానము చేయక
పరుల దూషించుట పాడియగునె
శ్రీరమానాథునెప్పుడు చిత్తమందు
తలచువారికి మోక్షంబు తథ్యమప్ప
ఇంతకన్నను వేఱెద్ది ఎరుక పఱతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

పట్టినదేదియో పట్టనే పట్టితి
పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితి
కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితి
వడిగినదిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితి
తలపు తీరెడుదాక తరలకుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన ఉడుగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.

పది దినంబులనుండి పస్తుండు వానికి
మంచి భోజనము లభించినట్లు
చెఱువు బావులనీళ్లు కరవయినప్పుడు
వరుసగా వర్షంబు కురిసినట్లు
సంతతి లేకను చింతిల్లు వానికి
పుణ్యసుపుత్రుండు పుట్టినట్లు
అన్నవస్త్రంబుల కల్లాడుచుండిన
నిరుపేదకర్థంబు బెరయునట్లు
ధర్మనాశనమగుచున్న ధరణియందు
ప్రభవమందెను శ్రీసాయి పర్తియందు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటను వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భరత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ
అట్టులైనారు భారతీయులు నేడు.

పరమాత్మ ప్రేమను ధరణిలో జనులకు
ప్రవహింపజేయుటే పరమ భక్తి
ప్రతి మానవుండును బ్రతికి తానుండుట
స్వార్థంబునకు కాదు సంఘసేవ
చేయుటకే అన్న శ్రేష్ఠభావంబుతో
మెలగుచునుండిన మేలు కలుగు
మరచియు తనుతాను మానవ సేవకు
అంకితమగుటయే ఆత్మతృప్తి
నిష్కళంకపు ప్రేమను నిల్పి హృదిని
సకల జీవుల కుపకృతి సలుపకున్న
పుట్టి ఫలమేమి నరుడుగా పుడమియందు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

పరసతి నాశించి పదితలలవాడేమి
    పట్టుకపోయెను గట్టిగాను!
నిగమముల్ హరియించి నిందు దూషణచేసి
    సోమకాసురుదేమి సుఖము నొందె!
ఇల సూదిమొన మోప యియ్యజాలనటన్న
    దుర్యోధనుండేమి దోచుకొనియె!
పసిపాపలను కూడ కసిపట్టి చంపిన
    కంసుడేపాటిగా కాచుకొనియె!
నేటి దుర్మార్గులకు కూడ నిదియె గతియు
సత్యమును దెల్పు మాట ఈ సాయిమాట.

పరుగు జీవితములె పరిపాటి కలిలోన
    పరుగులిడకయున్న పనులు చెడును
బస్సుకై పరుగులు బైస్కోపు పరుగులు
    పరుగులిడకయున్న పనులు చెడును
ఆర్జనల పరుగు ఆఫీసుల పరుగు
    పరుగులిడకయున్న పనులు చెడును
పదవులకు పరుగు పగదీర్పగ పరుగు
    పరుగులిడకయున్న పనులు చెడును

ప్రకృతి మాయలచేత బంధింపబడుటచే
    నేనె బ్రహ్మంబను నెఱుక పోయె
పంచేంద్రియంబుల వంచింపబడుటచే
    జీవుడే దేవుడన్ తెలివి పోయె
మమతాద్యహంకార మాయలో బడుటచే
    ఏకత్వ భావంబు లేకపోయె
దేహాభిమానంబు మోహానబడుటచే
    ఆత్మదర్శనముపై నాశపోయె
బ్రహ్మలో నీవు నీలోన బ్రహ్మయుండ
నీకు బ్రహ్మకు భేదము లేకపోయె
నేనె బ్రహ్మమనుటను యిప్పుడెరుగు
సాయి ప్రేమబోధల గ్రోలి హాయిమీర.

ప్రజలకునింపైన పనులుసేయకయున్న
    మాట యింపుగ పల్కి మసలరయ్య
సత్సంగమునుజేరి సంఘవృద్ధినిగాంచి
    కర్మయందనురక్తి కలుగరయ్య
పశులక్షణము వీడి పశుపతి కావలె
    జీవోద్ధరణమును చేయుదయ్య
దయగల హృదయమే దైవమందిరమౌను
    దయలేని హృదయమే దయ్యమయ్య
అహము, పరనిందలను పాడుకుళ్ళు తీసి
ఈశ్వరుండును జీవులనెల్లయెడల
ననెడి భావంబు వదలక ననవరతము

మనుదు మరువబోకుడిట్టి మంచిమాట!

ప్రవహించు నేపురి పరిధిగా పాయలై
చిత్రావతీనది చిత్రగతుల
క్రాలునీ పట్టణ కళ్యాణకరముగా
చుట్టును మేలైన చూతతరువు
కాన్పించు నేపురి కదలివంశమునందు
పార్వతీశ్వరుడెప్డు బాయకుండు
కొలువుండు నేపురి విలసితంబగు మధ్య
మహిమాన్వితుండైన సాయివిభుడు
మండలావని గణుతించు మెండుమహిమ
చిక్కవడియలు కట్టిన చెఱువు తోడ
బుక్కరాయల చిరకీర్తి భువనమెంచ
పొసగ చాటునేపురము పుట్టపురము.

ప్రాచీన ఋషులకు పాఠముల్ నేర్పింప
జాలిన వేదాంత సారమతులు
నిర్జీవ శిలలచే నృత్యమాడించెడి
నేర్పు కల్గిన కళానిపుణమతులు
పరవీరశిరములు బంతులాడించుచు
క్రీడింపగలిగిన వాడిమగలు
సర్వసర్వంసహా చక్రపాలనజేసి
నడిపించగలిగిన నాయకులును
కలరు భారతభువిని పెక్కండ్రు చూడ
ఉండి ఫలమేమి వారిలో ఒక్కరైన
అనుదినంబును వినిపించు ఆర్తరవము
ఆలకింప దలంపరో ఆర్యులార!

పాంచభౌతికము దుర్బలమైన కాయంబు
ఎప్పుడో విడిచేది ఎరుకలేదు
శత వర్షములదాక మితము చెప్పిరిగాని
నమ్మరాదామాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎక్కడో విడిచేది ఎఱుక లేదు
మరణమే నిశ్చయమ్మది మానవునకు
బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె
తన్ను తా తెలియుట ధర్మతత్వ మరయ
సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!

పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
సంస్కృతమడుగంటి సన్నగిల్లె
పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
పరిణయ ధర్మముల్ వమ్ములయ్యె
పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
ఆర్యధర్మములెల్ల ఆరిపోయె
పాశ్చాత్య విద్యల ప్రాభవమదియేమొ
వేషభాషలయందు మోజు హెచ్చె
తల్లి భాషను మాట్లాడ తప్పుదోచె
సంఘమర్యాద పాటింప జంకు పుట్టె
ధర్మమన్నది బోధింప తప్పిపోయె
ఇట్టులైనది భారతజాతి నేడు.

పుట్టుటయే చింత భూమినుండుట చింత
సంసారమొక చింత చావు చింత
బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత
జీవించుటొక చింత చెడుపు చింత
కర్మలన్నియు చింత కష్టంబులొక చింత
సంతసమొక చింత వింత చింత
సర్వ చింతలు బాపెడు సాయి భక్తి
గొనుడు యికనైన జనులార కోర్కె మీర
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

పుడమికి సరిమధ్య పుట్టపర్తియనగను
ఆత్మ విద్యలునందె అవతరించె
విశ్వమానవకోటి విజ్ఞానమందంగ
విశ్వవిద్యాలయంబిచట వెలసె
శాంతిసౌఖ్యములను సర్వదేశములందు
వెదజల్లు విజ్ఞులు వెలసిరిచట
నియతి తప్పని మహానిష్ఠులు భక్తులు
వేల లక్షలు కోట్లు వెలసిరిచట
సత్యధర్మశాంతిప్రేమలు జగతికి
చాటి చెప్పబూని సాయివిభుడు
సత్యసాయిజూడ సంపూర్ణప్రేమయే
యగుచు పుట్టెనిచట మోదమలర!

పనిపాటలందె మీ బ్రతుకంత తెల్లారె
ఇదియె జీవితమని ఎంచినార
మూడు పూటలు మీరు భుజియించి తృప్తిగా
ఇదియె జీవితమని ఎంచినార
అలసటదీరగా హాయిగా నిదురించి
ఇదియె జీవితమని ఎంచినార
కాదు జీవిత రహస్యమెరుగు కొరకు
ఇందుకే దేవుడు నిచ్చె జన్మ
తెలివితేటలు కల్గియు తెలిసికొనక
కాలమంతయు నూరక గడుపనేల?
మనిషిగా మీరలికనైన మసలరయ్యా
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

పేకాటనాడుచు ప్రీతితో నారాత్రి
గడిపినందులకె జాగరణమగునె
చేపలకొరకునై చెరువులో జాలర్లు
పొంచి చూచెడు దృష్టి ముక్తికగునె
తప్పసారాత్రాగి తన మేను మరచిన
మాత్రాన పరమ తన్మయతనగునె
భార్యపై నల్గియు పస్తు పరుండిన
వాడెల్ల నొకనుపవాసి యగునె
తలపు నీయందె యుంచిన కలదుగాని
భక్తి సుంతైన లేనిదే ముక్తి కలదె!
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ప్రమిద, నూనె, వత్తి గలదు దీపము తా వెలుగునా?
సువర్ణము, రత్నాలు గలవు, సొమ్ములు నిర్మాణమగునా?
పూలు, సూది, దారము కలవు, పుష్పమాల తానగునా?

పాటువైనది చెట్టురా పట్టువైనది కొమ్మరా
పాటు తప్పి పట్టు విడిచితె పరబ్రహ్మమె చేరురా
సారమైనది చమురురా సత్యమైనది వత్తిరా
వెలుగు తీరిపోయేటప్పుడు వెంట ఎవ్వరు రారురా!
కోట ఏడు చుట్టురా కోటలోపల తోటరా
తోటలోనికి పోదమంటె దారి తెలియదు ఎట్లరా?
మదిలొ పొంగే ప్రీతి ఊట అనురాగమనే ఆ నీట
తడుపబడిన హృదయతోట ప్రేమ మొలక అందులో నాట
మనసులోని మన మాట అదియె మధుర బాట.

పలుకులె మహా రుచి పలుకులు
పలుకులె పరిమళపు పూతలు
పలుకులె అతి మధుర మకరందములు
పలుకులె నాలుగు వేదాలు
పలుకులె శ్రుతిస్మృతి పలుకులు
పలుకులె బంధమోక్ష సుఖదుఃఖ కారణాలు.

పాట పడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకునటుల
మాటలాడుమా ముకుంద మనసు తీరగా
వేదసారమంత తీసి నాదరూపముగను మార్చి
వేణువందు తిరుగబోసి గానరూపముగను మార్చి ।పాట।

పుట్టినపుడు ఏడ్చినారు చచ్చినపుడు ఏడ్చినారు
మధ్యమధ్య విషయాలకు ఎందుకెందుకొ ఏడుస్తారు
ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప ఏడ్చినార?
సత్యస్వరూపునికై ఏడ్చినార ఎపుడైన?
ఎందుకోసమేడ్చినారు? ఏడ్చుకోసమేడ్చినారు.

పొట్టకోసం విద్యకాదని ప్రజ్ఞకోసం చదువుకొమ్మని
చదువు మర్మం తెలిసినట్టి సత్యరూపుడె నిత్యగురువు
ప్రేమ తత్వం ప్రబోధించి మమత సమతను పొందు పరచి
మానవత్వం తెలిపినట్టి ప్రేమరూపుడె సత్యగురువు.

పొట్టకోసము క్రిమి పక్షి మృగాదులు బ్రతుకలేదె
కాన వాంఛించకయె తృప్తి కలుగునంచు
గట్టిగా తెలిసి గమ్యంబు చేరకున్న
ఇతర జీవులకన్న అరయ నరుడు
అథముడేగాని పరికింప అధికుడగునా!

పోయిరావమ్మ తల్లి అత్తవారింటికి పోయిరా
నడివీధులవెంట తిరుగకమ్మ
పక్క యింటి వారినిజూచి ఈర్ష్యపడకమ్మ
ఓర్పును శాంతిని ఫణముగా ఒడ్డియుండుమమ్మా
పతి మాటలకు పలుమారు బదులాడకమ్మ
పతి సేవయే పరమ కర్తవ్యమని తలపుమమ్మా
ఎవరెన్ని చెప్పినను మౌనము వహించుమమ్మా
పెద్దలయెడ గౌరవముంచుమమ్మా
అత్తమామల సేవ అతి భక్తితో చేయుమమ్మా
సర్వవేళల భగవంతుని ధ్యానించుచుండుమమ్మా.

పెట్టినది తినవు గొల్లల
పట్టులకుంబోయి వెన్న పట్టెడులుగ లో
గుట్టున తినెదవు నీతో
పుట్టెను రట్టళ్ళు కృష్ణ! పొమ్ము కుమారా!

ఫేసుపౌడరు అవతరించె మోసగించి పసుపు పోయె
ఏమికాలమొచ్చెనో జనులార ఏమికాలమొచ్చెనో
కాసుల దండలన్ని పోయె మోసగించి చైనులొచ్చె
ఏమికాలమొచ్చెనో జనులార ఏమికాలమొచ్చెనో
ప్రేమ కలిగె ఆ లేడియందు ప్రాణనాథ వేడుకొందు
నా మనంబు కోరిక తీర్చుమందు రామచంద్ర దాని తెమ్ము
మరిది నిర్మించిన పర్ణశాలయందు
దానితొ పొద్దు గడుపుకొందు.

బహుళ విద్యలన్ని పాకశాస్త్రముబోలు
వంటకములబోలు భక్తియొకటె
వంటకములు వీడి పాకశాస్త్రమదేల?
వినుము భారతీయ వీరసుతుడ!

బహుళ విద్యలయ్యె వాంఛలు మితిమీరె
పలుకులందు హీరో పనికి జీరో
తెలివితేటలవల్ల కలుగు లాభంబేమి?
కొంచెమైన ఆచరించరయ్య!

బ్రతికినన్నినాళ్ళు ఫలమిచ్చుటే కాదు
చచ్చికూడ చీల్చి యిచ్చు తనువు
త్యాగ భావమునకు తరువులే గురువులు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

బ్రహ్మ దర్శన భాగ్యంబు బడయగోరి
వెదుకబోదువువెచటికే వెఱ్ఱి మనస
అదియు నీలోననున్నది అరుగుమచట
సత్యమునుదెల్పు మాట ఈ సాయి మాట.

బ్రతుకులన్నియు మాయ
భవబంధములు మాయ
సంసారమది మాయ చావు మాయ
మాయ బ్రతుకు కింత మాయలో పడనేల!

బ్రహ్మజ్ఞానంబునెరుగక బ్రాహ్మణుండ?
సమతభావంబు లేకున్న సజ్జనుండ?
మంచితనమును లేకున్న మానవుండ?
చెప్పరయ్య మీరలె ఒప్పుకొందు.

బ్రహ్మవిద్య గూర్చి బహుళ ప్రచారము
సలుపువారు కలరు చాలమంది
కాని ఆచరించు ఘనుడు ఒక్కడు లేడు
సత్యమైన బాట సాయి మాట.

బ్రహ్మ సృష్టి చేయు బ్రహ్మాండములనెల్ల
విష్ణువన్ని పెంచి వృద్ధి చేయు
పరమ శివుడు ద్రుంచు పాపిష్టి జీవుల
గురువు మూడు క్రియల సలుపునొకడె.

బ్రహ్మలోని మాయ బ్రహ్మను చెందదు
జగతినాశ్రయించి మోహపరచు
పాము కోరవిషము పామును చంపునా?
వినుము భారతీయ వీరసుతుడ!

బాలబాలికలెల్లరు భవ్యమైన
దివ్య విద్యల నేర్వగ దీక్షబూని
భరత సంస్కృతి నెలకొల్పవలయు నేడు
భక్తి క్రమశిక్ష మనసున పాదుకొల్పి.

బాల్యమందున తత్త్వంబు పట్టుబడని
కారణంబున సంఘంబు కాలగతిని
ప్రగతి లేకను దిగజారి పతనమయ్యె
ఇంతకన్నను దుర్గతి ఏమి కలదు?

బుద్ధి బలము మరియు భుజబలమున్నను
దైవ బలము లేక దీనుడగును
కర్ణుడంతవాడు కడపటికేమయ్యె
మరువబోకుడిట్టి మంచి మాట.

భక్తి లేకుండ భజనలు సలిపెనేని
శ్రద్ధ లేకుండ సాధనల్ సలిపెనేని
శుద్ధి లేకుండ సమితిలో చేరెనేని
అయ్యదెల్ల సత్య వ్యవహారమగునె!

భరతదేశము వేదాల పట్టుగొమ్మ
యజ్ఞయాగాది క్రతువులకాటపట్టు
పెక్కు అవతారములగన్న పెద్ద తల్లి
నీతినియమాలజూపెడి త్యాగభూమి

భారతావని గురుశిష్య భావముడిగె
సత్యసంపద క్రమచర్య సన్నగిల్లె
భక్తివిశ్వాసములయందు రక్తిదొలగె
బాధ్యతలు లేని స్వాతంత్ర్యపరత హెచ్చె.

భరతదేశము ఆరంజిపండు పోల్చ
కనగ జాతులును మతములు తొనలు కాదె
భిన్న తెగలు వృత్తులు ఎన్నియున్న
భరతదేశాన పుట్టుటె భాగ్యమగును
ఐకమత్యంబు జ్ఞానంబునందజేయు
దివ్యజ్యోతిని వెలిగించు దేశమిదియె.

భవ్యభావాలు కల్గిన భారతీయ
దివ్య సంస్కృతి తత్త్వంబు తెలిసికొనగ
భారతీయులె యత్నింపనేరరైరి
ఇంతకన్నను దౌర్భాగ్యమేమి కలదు?

భావసంశుద్ధి కలుగుటే భక్తియగును
పుణ్యకార్యాలు చేయుటే పూజయగును
పరులకుపకార మిడుటె తపంబులగును
మరువబోవకుడిటువంటి మంచిమాట.

భావమందు తుచ్ఛభావాలు వీడుటే
త్యాగమగును అదియె యోగమగును
ఆస్తి ఆలిని వీడి అడవికేగుట కాదు
సత్యమైన బాట సాయి మాట.

భుక్తి విద్యలెల్ల బోధించి తెల్పేటి
గురువులెల్ల పరము గూర్పగలర?
ముక్తి విద్య తెలిపి మోహంబు తెగటార్చు
గురువు కలడు సత్యగురువరుండు.

భుక్తి విద్యలన్ని భక్తితో చదివేరు
ముక్తి చదువుకెవరు ముందు రారు
ఇట్టివారు నన్ను ఎరుగంగనేర్తురా
ఎట్టి విద్యలుండి ఏమి ఫలము!

భువిని త్యాగము చేత పుణ్య కర్మల చేత
ప్రేమ భావములను పెంపుజేసి
దానవత్వమడంచి దైవచింతన చేసి
నిత్య జీవితంబు నెరపుమయ్య.

భోగభాగ్యంబులివి ఎన్ని పొందియున్న
తృప్తి మనిషికి లేదని తెలియరయ్య
ఆత్మతత్త్వము చేరినయపుడు కాని
తృప్తి శాంతియు మనిషికి ప్రాప్తి రాదు.

బాలుండీతడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపగా
జాలండోయని దాని క్రింద నిలువన్ శంకింపగా బోలదీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరాచక్రంబుపైబడ్డ నా
కేలల్లాడదు, బంధులార! నిలుడీ క్రిందంబ్రమోదంబునన్!

బావను హస్తినాపురము పంపెడిచో నిదమిత్థమంచు నా
భావములోని భావమును స్పష్టము చేయదలంచియున్ శుభం
భావుకు సంధియాత్ర కశుభంబని భ్రమింగితి మిన్నకుంటి మా
బావ సుఖంబుగాదిరిగి వచ్చెనిదే పదివేలు నేటికిన్

బ్రహ్మాండమంతయు బొజ్జలోనుండంగ
భక్ష్యభోజ్యము నాకు పెట్టనగునె
సర్వజీవులయందు సంచరించెడి నాకు
సరియైన పేరిడ సాధ్యమగున
సర్వజలంబుల సంచరించెడి నాకు
స్నానంబు చేయింపనలవియగున
కోటిసూర్యుల కాంతి మేటి కల్గిన నాకు
ప్రమిద దీపమునెట్లు పెట్టగలరు
అజహరాదులకైనను అందనట్టి
ఇట్టి నా రూపు కనుగొన నెవరి తరము
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

బాల్యమందున పలువురతోగూడి
ఆటపాటలందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి
కామినీ లోలుడై క్రాలుచుండు
అర్థవయస్సున ఐహికంబున మున్గి
ద్రవ్యమార్జించుటన్ దవిలియుండు
ముదిమి వచ్చినయంత మురహరి తలవక
అదియిది లేదని అలమటించు
వివిధ దుర్వ్యసనంబులు వీడలేక
భక్తి మార్గంబు వెతుకునాసక్తి లేక
కర్మపంకిలమునబడి క్రాలుచుండు
మట్టి కలుపును జన్మంబు మానవుండు.

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులు
ఏక గర్భజులంచు ఎన్నరయ్య
అన్నలు ద్విజులు శూద్రులును మిన్నగ
తమ్ములందు ప్రేమ తలపరయ్య
గుణముల క్రియలచేగూడు వర్ణములెల్ల
గుణమును గ్రహియింపగూడునయ్య
ద్విజుడు దుర్గుణుడైన శూద్రుడె
సుగుణి శూద్రుండు భూసురుడు కాడె
వీడువాడను భేదంబు వీడి మీరు
ఐకమత్యంబు అన్నింట అధిక పరచి
కలత విడనాడి ఐక్యంబు కాంచరయ్య
అపుడ దేశంబు అభివృద్ధినందునయ్య.

భక్తిరసానంద పారవశ్యముచేత
భవబంధ భూతముల్ పారిపోవు
భవబంధ భూతముల్ వదలిన తోడనే
మోక్షాభిమానంబు మొలకలెత్తు
మోక్షాభిమానంబు మొలకెత్తినంతనే
జ్ఞానోదయప్రాప్తి కలుగు వెంట
జ్ఞానోదయప్రాప్తి కలిగిన వెంటనే
తన్ను తానెరిగెడి తత్వమబ్బు
జగము మాయమై పోవుచో నిగమవినుతు
నిత్య సౌభాగ్య రూపంబు నిలుచుగాదె
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

భక్తులందరుజేరి భగవంతుడాయంచు
చెవులకింపుగ నుతిచేయు దినము
బీదల వెతలన్ని ప్రీతితో తొలగించి
అన్నదమ్ముల మాడ్కినున్న దినము
దైవచింతనజేయు దాసబృందములకు
ప్రీతి మృష్టాన్నము పెట్టు దినము
మహనీయులెవరైన మనకడకేతెంచి
చెలిమి బాబా కథల్ చెప్పు దినము
భావమున భక్తిగూర్చు సౌభాగ్య దినము
దినముగాని తక్కినవన్ని దినములగునె
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

భరతశాస్త్రంబనను బంగారు మనకుండ
పరశాస్త్రములయెడ భక్తి ఏల?
హైందవంబనియెడి హైమాద్రి మనకుండ
పరధర్మములను పర్వతము ఏల?
భారతనీతులన్ భవ్యజలమ్ముండ
పరనీతియను ఉప్పునీరు ఏల?
మించెడి కాంతితో మేరు పర్వతముండ
వెండిబంగారుకై వెతలికేల?
అడిగిన పాలిచ్చు కామధేనువుండ
ధనమిచ్చి ఆవును కొనగనేల?
పంకజాక్షు పూజ పలుమరు సేయక
పరుల నింద సేయ పాడియగునె?
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

భానుతేజముకంటె భాసిల్లుచుండును
మంచుతెలుపుకంటె మించియుండు
ఆకసంబునకంటె అతి సూక్ష్మమైయుండు
సర్వ జీవులలోన పర్వియుండు
పరమాత్మ లేనిది పరమాణువును లేదు
అంతటనిండి తానంటకుండు
సరమాత్మ సందర్శ భవ్యవికాసము
నిఖిల లోకాలలో నిండియుండు
బ్రహ్మమందు మీరు మీలోన బ్రహ్మంబు
మీరె బ్రహ్మ బ్రహ్మ మీరెయయ్యు
బ్రహ్మమయులు మీరు బ్రహ్మమేయగుదురు
కాని మోహవశత కానరైరి.

భుజబలంబున పెద్దపులుల చంపగవచ్చు
పాము కంఠము చక్కబట్టవచ్చు
బ్రహ్మరాక్షసకోట్లు పారద్రోలగవచ్చు
మనుజుల రోగముల్ మాన్పవచ్చు
జిహ్వకిష్టములేని చేదు మ్రింగగవచ్చు
పదును ఖడ్గముచేత అదమవచ్చు
కష్టమందుచు మహాకంపలో చొరవచ్చు
తిట్టుబోతుల నోళ్లు కట్టవచ్చు
కాని పుడమిలో మూర్ఖుల బోధచేసి
సజ్జనుగ మార్చలేడెంత చతురుడైన
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

బుద్ధి చెప్పెద రావణా! ఈ లంక నీకింక లేదుర దుర్గుణా
బుద్ధి చెప్పెద వినుము నీవిక సద్దుసేయక నాదు పలుకులు
బుద్ధికిని యోచించక చావుకు బద్ధుడైతివి పాపమతివై ।బుద్ధి।
లోకములకు తల్లిరా! ఈ సీతమ్మ నీకు చూడగ తల్లేరా
లోకమాతను తెచ్చి యిప్పుడు పాతకమునకొడిగట్టుకుంటివి
ఏక శరమున నీదు శిరములు ఏకమారుగ త్రుంచు రాముడు ।బుద్ధి।
సీతతొ భాషించితి రాముల చేతి ముద్దుటుంగరమందించితి
పాతకుడ! నీ వనముగాచిన పలు రాక్షసవీరులజంపితి
కోతినంచు నాతో పోరి యమపురి పాలాయె దైత్యులు ।బుద్ధి।
భయమను దయ్యమును పారద్రోలినిర్భయముగ నుండరయ్య
పాపంబన భయముండవలెనయ్యా లోకముతోటి భయము నీకేలనయ్యా?
అందరికి భయపడి దేవదేవుని భజన చేయగలేక
భ్రమచెంది మరణించు సమయమందున
బలిమి మీరగ యముడు రమ్మిక రమ్మనుచు లాగంగ అప్పుడు
అయ్యయ్యో అని ఏడ్వంగ నెవరడ్డగింప వత్తురయ్యా?

మంచి కాలము పదవులు మంచి బ్రతుకు
కోరుచుందురు మనుజులు కోరబోరు
మంచి బుద్ధులు జ్ఞానంబు మంచి నడత
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

మంచి చెడ్డ నడత మనుజులయందుండు
పైకి కానరాదు బయటపడదు
వారివారి నడత వారికేనిచ్చు
మరల జన్మమందు మార్గమిచ్చు.

మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన
చెడ్డమాట ముందు చెవిని పడును
ఇట్టివారు నన్ను ఎరుగంగనేర్తురే
ఎట్టి తెలివియున్న ఏమి ఫలము?

మంచివారు మేలు మరువకయుందురు
కష్టకాలమందు కాచియుంద్రు
కామధేనువొసగు కడగి క్షీరముగాని
విషమునెట్లొసగు విమల చరిత!

మంచివారి పొందు మహిలోన దొరకదు
దుష్టులెందరైన దొరుకుచుంద్రు
కలికి రాళ్లు భువిని కలవెన్నియైనను
వెలనుబోలు వజ్రమెతుకవలయు.

మంచి తలపులు మాటలు మంచి చేత
మంచి వినికిడి చూపులు మంచితనము
మంచి ఆరోగ్యమునిచ్చు మానవునకు
సత్యమును తెల్పు మాట ఈ సాయిమాట.

మంచి తత్త్వంబు మరచిరి మనుషులంత
ధర్మమడుగంటె సంఘాన ఖర్మకాలి
నిలువ నీడయె లేకుండె నీతికెచట
ఇంతకన్నను దౌర్భాగ్యమేమి కలదు?

మంచితనమునందు మానవత్వమునందు
నీతియందు నిండునిజమునందు
ఆచరించి చెప్పు ఆచరించి చూపు ఆదర్శములనెల్ల
అతడె యువకుడు ఆమె యువతికాదె
అట్టివారె బెష్టు ఫ్రెండ్సు మీకు
అట్టివారె బెష్టు ఫ్రెండ్సు నాకు.

మట్టితో చేరి యినుముకు పట్టుతుప్పు
అగ్నిలో చేర యినుమును అదియె వీడు
సాహచర్యముచే నిట్లు జరుగుచుండు
సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట.

మట్టినుండి పుట్టిన చెట్టు మట్టియగును
బ్రహ్మనుండి పుట్టిన సృష్టి బ్రహ్మయగును
కాని దృష్టికి భిన్నమై కానిపించు
సత్యమునుదెల్పు మాట ఈ సాయిమాట.

మట్టిలో చేరి యినుమున పట్టు తుప్పు
అగ్నిలో చేరి యినుమును అదియు వీడు
సాహచర్యముచే నిట్లు జరుగుచుండు
సత్యమైనట్టి బాట శ్రీసాయిమాట.

మతములన్ని చేరి మంచినే బోధించె
తెలిసి మెలగ వలయు తెలివితోడ
మతులు మంచివైన మతమేది చెడ్డది
వినుము భారతీయ వీరసుతుడ!

మతము క్రమశిక్ష నేర్పును హితముగూర్చు
ఆత్మశక్తియు తేజమునధిక పరచు
దాని మర్మంబునెరుగక కొట్టుకొన్న
జాతి సంస్కృతి క్షీణించి జబ్బు పడును.

మదగజంబు పట్ట మరి అంకుశము మందు
మహిషములను తోల మందు బడిత
వ్యాధి తోల మందు వర రసాయనమది
ఖలుని మార్చు మందు కలదె భువిని!

మదిని గెలిచిన శాంతికి మార్గమరయ
శాంతిగల్గిన అన్నింట సమతదోచు
మంచిచెడ్డలు మానాభిమానములను
హితులునహితులునొక్క బ్రహ్మంబు కాదె!

మధురమైన భాష మంజల గళముతో
భక్తకోటి హృదిని భర్తి చేయు
సూటి మాట పల్కి సూక్ష్మధర్మంబులే
చెప్పుచుండు సాయి ఒప్పుమీర.

మనసు బుద్ధి చిత్తమది అహంకారంబు
ఎందు పుట్టి పరిగె ఎందునణగు
అదియె శివుడు ఆత్మ అరయంగజూడను
మరువబోకుడిట్టి మంచి మాట.

మనసునాధారముగగొను మానవుండు
పశువు కంటెను హీనమై పతనమగును
బుద్ధినాధారముగగొను బుధజనుండు
పశుపతిగ మారునని పల్కె పర్తివిభుడు.

మనసునందు మంచి మాటలందున మంచి
నడతలందు మంచి పొదమకున్న
సాయి మిమ్ము మెచ్చి సంతోషమెటులిచ్చు?
శాంతి ప్రేమదాయి సత్యసాయి.

మనసే హేతువు మనుజుని
మనుగడకును బంధమునకు మాన్యతకెల్లన్
మనసే ముఖ్యము ముక్తికి
మనసే దుఃఖమును తెచ్చు మైమరపించున్.

మనసు మాలిన్యములనెల్ల మట్టుబెట్టి
పరమ పరిశుద్ధ భావముల్ పాదుగొల్పి
జ్ఞానదృష్టియునేర్పడ కాననగును
విశ్వమంతయు బ్రహ్మమై వెలుగు నిండు.

మనసులోనున్న భావంబు మంచిదైన
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు
మనసులోపలి భావము మలినమైన
ఫలము కూడనునారీతి మలినమౌను.

మనసు నిర్మలంబు మంచికి మార్గంబు
మనసు నిర్మలంబు మహితశక్తి
మనసు నిర్మలంబు మనిషికి ముఖ్యము
మరువబోకుడిట్టి మంచి మాట.

మనసు, మాట, నడత మనిషికి ఒకటైన
సత్యవంతుడగును సరళితోడ
సత్యవంతు దైవ సాన్నిధ్యమందున
ఉండుచుండు పరమునొందుచుండు.

మనసె కారణంబు మరియందునుండిన
ఇల్లు అడవి ముక్తినీయలేవు
మనసు లేనివాడు మందిరముననున్న
కాననముననున్న కార్యమేమి?

మనసుచేత జీవి మరల జననమొందు
మనసుచేత జీవి మాయమగును
పుడమి మనసుచేత పురుషార్థములనొందు
మనసుచేత యోగ సిద్ధి మహిని పొందు.

మనసొకచో నిలువదాయె, ఏమి పాపమో
మర్కటమై తిరుగసాగె ఏమి శాపమో
ఇది నాది అది నాదను తాపత్రయమెక్కువాయె
నిలకడ అన్నదే లేక నిధిపైనే మనసాయె.

మనిషి పుట్టినప్పుడు అమృతపుత్రుడై జన్మించు
పిదప వాసనలతోడ విషయుడగును
విషయవాంఛలతోడ విషతుల్యుడగునయా
సర్వశ్రుతుల ఊట సాయి మాట.

మనుజుడైనవాడు తన దుర్గుణమ్ముల
వరుసనొకటినొకటి వదల వలయు
పశుగుణంబు వీడి పశుపతి కావలె
సత్యమైన బాట సాయి మాట.

మబ్బులేనట్టి జీవిత మార్గమందు
వెలుగునకు ఎన్నడైనను విలువ కలదె?
బాధనొందక లభియించు భాగ్యమందు
ఎంత వెతికిన దొరకదు సంతసమ్ము.

మర్మమెరిగినట్టి మహనీయులెందరో
మాయ నెరుగలేక మాయమైరి
మర్మమెరిగినట్టి మహనీయులెవరయా?
ఇందులోన ఒక్కరైన గలర!

మల్లెకుసుమ మాల మర్కటంబునకిచ్చి
పట్టువస్త్రములను పదిల పరచి
రమ్యమైన రత్నసింహాసనమిడిన
వదలునే తనదగు వక్రబుద్ధి.

మళ్ళీ పుట్టుట మళ్ళీ గిట్టుట
అమ్మ కడుపులో అణగియుండుట
అంతులేని సంసారము దయతో
దాటింపుము నను దబ్బున దేవా!

మాటలందు తీపి మనసున చేదుంచ
మంచికాదు మీకు మచ్చగాని
మచ్చలేని బ్రతుకె మహిలోన చెల్లురా
ఉన్నమాట తెలుపుచున్న మాట.

మాట చెప్పినట్లు మనజుండు నడచిన
మనిషికాదు వాడు మహితుడగును
మాట చెప్పినట్లు మనిషి నడువదేని
మనిషికాదు వాడు మృగమెగాని.

మాటలందు తీపి మనసున చేదుంచ
మంచికాదు మీకు మచ్చగాని
మత్సరంబు లేని మనుజుడే మనుజుండు
వినుము భారతీయ వీరసుతుడ!

మానవత్వమనగ మనసు మాట క్రియయు
అన్ని ఒక్కటిగనె అతికియుండు
మనసునందు ఒకటి మాటయు క్రియయును
వేరువేరులైన విలువదేమి?

మానము, మౌనము రెండును
మానవునకునెల్లవేళల మాన్యతదెచ్చున్
మానవిహీనునకెందున్
మానుగ సౌఖ్యంబుగలదె మహిలో పుత్రా!

మానవత్వమొచ్చె మాధవులోనుండి
మాధవత్వమేల మరుగుపడియె?
మాయ మాయ యిదియె మహిలోన నరుడయ్యె
మాయనరుడె కాదె మానవుండు.

మాను దిద్ద వచ్చు మరి వంపు లేకుండ
దిద్దవచ్చు రాయి తిన్నగాను
మనసు దిద్దగలర మరి వంపు లేకుండ
ఉన్న మాట తెలుపుచున్న మాట.

ముక్తి కోరి నరుడు ముక్కోటి దేవతల్
వేడుచుండుగాని వెతలుబోవు
తనదులోని అహము తాజంపగలిగిన
ముక్తి ఏల? తానె ముక్తి కాదె.

ముక్తియనగ వేరాకసమునను లేదు
చిత్తవృత్తులడంచి నిశ్చింతనుండు
స్థితియె మోక్షము దాన నశించు మాయ
ఆత్మయేయగు సర్వమన్యంబుగాదు.

ముడుపులందుచు ధనమును మూటగట్టి
బిచ్చగానికి మెతుకైన పెట్టకుండ
వెంకటేశుని హుండిలో వేయు లోభి
సత్యమును దెల్పుమాట ఈసాయిమాట.

మోహమందున మునుగును మూర్ఖబుద్ధి
ముక్తియననేమొ తెలియదు ముగ్ధబుద్ధి
చెడ్డయననేమొయెరుగదు దొడ్డబుద్ధి
చెడ్డ చేయుచునుండును గొడ్డుబుద్ధి.

మేఘములు మింటిపైనను మెదలుచుండ
వాటి దాపున విద్యుత్తు వరలునట్లు
విద్య వెనుకను జ్ఞానంబు వెలయవలయు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

మేలుచేసిన వానికే కీడుచేయు
కూడు పెట్టిన దాతనే కూలదోయు
విద్య చెప్పిన గురువునే వెక్కిరించు
ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యయందు.

మనసనునాయుధంబు మన మానవ జాతికినిచ్చె తొల్లి యీ
మనసును శిక్షలో నిలుపు మానవుడె విజయుండు భూమిపై
మనసుకు దాసుడైన మహి మానవుడెన్నడు శాంతిసౌఖ్యముల్
కనుగొన జాలినట్లు వినగల్గుట కల్లదు స్వప్నమందునన్.

మలినపు కొంప రోగముల క్రుగ్గెడు సేవకగంప జాతసం
చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం
బుంబులపొది లెమ్ము చూడ మన ముప్పుదలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.

మాయామేయ జగంబె నిత్యమని సంభావించి మోహంబునన్
నా యిల్లాలని నా కుమారుడని ప్రాణంబుండినందాక ఎం
తోయల్లాడిన ఈ శరీరమిపుడిందుం కట్టెలన్‌గాలుచో
ఆ యిల్లాలును ఆకుమారుడును తోడై రారు తప్పింపగన్.

మకర సంపీడిత మత్తేభమును నాడు
వీక్షించి బ్రోచు నా ప్రేమఫలము
వలువలూడ్చెడునాడు వైదర్భి వదినను
వడిగాచినట్టి యవ్యాజ కరుణ
ఆహ్లాదమొప్ప నా ప్రహ్లాదు సరగునన్
పాలించినట్టి యపార కృపయు
దుష్టులన్ దెగటార్చి శిష్టులన్ దరిచేర్చ
పలుమార్లు పుట్టు నా చలువ యెల్ల
తెలిసికొమ్ము కస్తూరి నా తేనె మనసు
జన్మదినమున దీవెనలందుకొమ్ము!

మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే
వస్త్రభేదము వేరు దారమొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె
జీవజంతులు వేరు జీవుండు ఒక్కడే
కులములన్నియు వేరు పుట్టుకొకటె
దర్శనంబులు వేరు దైవంబు ఒక్కడే
పూల వన్నెలు వేరు పూజ ఒకటె
తలియలేకను మానవుల్ తెలివిదప్పి
బ్రతుకు కోసము బహుబంధ బద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

మనసందు అత్యంత అనురాగ భోగాది
భాగ్యంబు కాపాడు భవ్యజనులు
స్వపర భేదము లేక సర్వజీవులయందు
సమభావమును చూపు సరస జనులు
అనిశంబు అత్యంత అనురాగ భోగాది
భాగ్యముల్ కల్గెడి భవ్యజనులు
కష్టజీవులయందు కరుణ చూపించుచూ
దాతృత్వమును జూపు ధన్యజనులు
సంసారధర్మ సత్యత్వ సుజ్ఞానులై
పరులకాదర్శంబు చూపు జనులు
భువిని సత్కీర్తిగాంచి సన్మార్గమరసి
తోటివారలలో సదా మేటియగుచు
నిత్యమును ధర్మజిజ్ఞాస నిరతులగుచు
ఉత్తమోత్తమ వ్యక్తులై ఉంద్రు గాక.

మరిమరి నన్నట్లు మాయలో త్రోతువా
రాధమ్మతో చెప్పి రచ్చ చేతు
ఇట్టులేనిక్కట్లు పట్టుగాజేతువా
భక్తాళి కెరిగించి పరువు తీతు
ఇపుడైన నా కోర్కె నెరవేర్పకుంటివా
గోపికాళికి చెప్పి గోలచేతు
చూడక నన్నిట్లు శోధించుచుంటివా
మా యశోదమ్మతో మనవిజేతు
నన్ను నీవేమి చేసిన నిన్ను విడుతు
ననుట ముమ్మాటికిని కల్ల నందతనయ!
స్వప్నమందైన విడువ నీ పాదములను
అరసి నన్నేలుమా నీవు సారసాక్ష.

మేథమేటిక్సును మరువక జపియించు
గణితశాస్త్రము వంకజూడబోడు
అమెరికా మార్గంబునరయజూచునుగాని
కాశికా మార్గంబు కానరాదు
ఆల్జిబ్రాయంతను అరసిజూచునుగాని
ఇంటి వైశాల్యమునెరుగబోడు
అనుదినంబును డ్రిల్లుననుసరించునుగాని
పద్మాసనము వేయ బాధ పడును
వృక్షశాస్త్రమెరుగు సమృద్ధిగను తులసి
ఉపయోగమెరుగడు మానవుండు.

మైత్రియు కరుణయు మాన్యముపేక్షయు
వాసనల్ నాలుగై వసుధనుండె
సుఖకరంబుగనుండి సుఖమందు జనులతో
సఖ్యంబై మైత్రితో జనులకెల్ల
దుఃఖితులనుజూచి దూరంబు పోవక
కనికరించుటదియె కరుణయగును
పాపాత్ములంజూచి పరిహసించుట కన్న
వీక్షింపకున్ననుపేక్షయగును
పుణ్యవంతులజూచి పూని కొల్చుచునుండి
సంతసించుట మాన్యసరణియగును
ఇట్టి వాసనల్ ధరగలయట్టి జనుల
నాదరించును శ్రీహరి అధికముగను
దర్శనంబును తానిచ్చు తనియజూచు
సంతసంబున వారిని చెంతజేర్చు.

మేనమామంచని మేలుగానెంచక
కంసభూపాలుని హింసజేసె
స్త్రీయని యింతయు చింతయే లేకను
తాటకి గాత్రంబు తరిగివేసె
బిక్షమడిగిన లేదనకిచ్చె బలియును
అతని పాతాళంబునకణగ ద్రొక్కె
ఏమందు దయలేని హరిని భువిని.

మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుల్కెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
డంబైన ఫాలనేత్రంబుతోడ
నల్లనేరెడువంటి నల్లని మెడతోడ
కరమున నాగకంకణముతోడ
నడుమును చుట్టిన నాగచర్మముతోడ
మైనిండ నలరు భస్మంబుతోడ
నుదుట తీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబుతోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామనచాయ మేనితోడ
పర్తివాసుడు నేడు సాక్షాత్కరించె.

మాయయందు పుట్టి మాయయందు పెరిగి
మాయనెరుగలేరు మందమతులు
బ్రతుకుట మాయ పుట్టుట మాయ
సంసారమ్ము మాయ చావు మాయ
భవబంధములు మాయ బాగుగానెరుగరే!
మాయ బ్రతుకటంచు మాయలో పడనేల?

మాయకు లోనాయె మాయకు మీదాయె
మాయా యిరవైఐదు మర్మములాయె
మాయా యిరవైఐదు మర్మముదెలిపితే
మాయలోన గుట్టు దా మరినిల్వదాయె.

మురళిగాన విలోల గోపాలబాలా
మోము చూపవదేల గోపికాలోలా?
మాతృదేవి ప్రేమ మరచితివో తండ్రీ!
మధురకే పోయితివా? మమత వీడితివా?
ఇదిగిదిగొ వత్తువని యిందాక చూచితిని
నిలువజాలను రార! నిను వీడి మనలేనురా!

మేము జలకమాడుచుండ చీరలన్ని మూటకట్టి
పొన్నచెట్టుపైననుండి ఎంత వేడిననీయడమ్మా
అడగవె తల్లి! అడగవె
అర్ధరాత్రివేళ మా మిద్దెలెక్కి వచ్చి
నిద్రపోవు స్త్రీల జడలెత్తి కట్టి వచ్చె
అడగవె తల్లి! అడగవె
అమ్మా! నేను నీదు పక్కలో కదలక మెదలక పడుకొనియుంటినే
అర్ధరాత్రివేళ నేనెప్పుడు వెళ్లివస్తినో చెప్పవే తల్లి చెప్పవే.

మోహనమురళీనూదుచునొకపరి
గానము చేయగదె బాబా గానము చేయగదె ।మోహ।
కఠిన హృదయములు పాషాణంబులు
కరగికరగి నీరై ప్రవహింపగ
మోహనమురళినూదుచునొకపరి
గానము చేయగదే కృష్ణా! గానము చేయగదె ।మోహ।
ప్రేమరహితమగు భూములలో
ప్రేమాంకురములు పెంపొందా
ప్రేమావేశముతో
ప్రేమసుధావర్షము వర్షింపగ
ప్రేమనదులు ప్రవహింపగ మురళీ
సకల మహీధర వనసంయుతమై
జలనిధి జంతువితానయుతమై
సంతోషంబలరా ప్రకృతి సతీమణి పరవశతను
నీ చెంతనె నృత్యము చేయుచు
మురళీ గానము చేయగదే కృష్ణా!
గానముచేయగదే!

యుగయుగంబులనుండి యీయుర్విపైన
ఖ్యాతిగన్నట్టి భరతమాత కీర్తి
సాయి సిద్ధాంతములచేత సానబెట్టి
వన్నెబెట్టుడు మీరింక సున్నితంబుగ.

యోగియైనను మరి భోగియునైనను
సంసారైనను సన్యాసైనను
స్వాంతము సత్యమునుభవించితే
యానందమె ఆనందమునందము.

యుగధర్మ పద్ధతుల్ విగళితమైయుండ
నయమార్గమునదిప్పి నడపుకొరకు
లోకంబులెల్ల కల్లోలమై చెడియుంట
నిష్కల్మషముచేసి నిలుపు కొరకు
దుర్మార్గ వర్తనుల్ త్రుళ్ళుచునుండుట
సాధు సంరక్షణ సలుపు కొరకు
కాల సందిగ్ధ విగ్రహసూక్తులైయుంట
భాష్యార్థ గోప్యముల్ పలుకు కొరకు
క్ష్మా భరము బాపి భూదేవి మనుపు కొరకు
త్రేతనొసగిన కోర్కెలదీర్చు కొరకు
అవతరించెను అచ్యుతుడవనియందు
వాసుదేవాఖ్య శ్రీసాయి వసుధశౌరి.

రిత్త కోరికలను మోపునెత్తుకొనుచు
తిరుగుచున్నారు నిజరూపు తెలియలేక
తిలలయందున తైలంబు వెలయునటుల
దేవుడున్నాడు మీలోన తెలియరయ్య.

రేయింబవళ్ళు సాయంపొద్దులు
చలివేసవులు సారెకు మారును
కాలక్రీడల గతిచేనాయువు
అయినా వదలదు ఆశావాయువు.

రక్తము మాంసశల్యముల రాశియు దేహము మీరు కాదు సు
వ్యక్తము కాని కోరికలు వ్యర్థమనస్సును మీరు కాదుగా
ముక్తికి బంధకారమగు మోహపు భ్రాంతియు మీరు కాదు మీ
శక్తిని మీరెరుంగగల శాశ్వితుడౌ పరమాత్మ మీరెగా!

రఘుపతి కార్యంబీడేర్చిన కపిరాజ శిఖామణి యితడయ్యా!
అధములు పురిగొని జగముల వెలసిన హనుమత్కరుడు యితడయ్యా!
పరిపరి లంకాపురమునుజొచ్చి పురమరసిన వాడితడయ్యా!
పరిపరి విధముల జానకి వెదకిన అమిత పరాక్రముడితడయ్యా!

రామరామ రామసీత .... రామరామ రామసీత
శ్రీమద్రవికులమందు జనించి సీతాదేవిని ప్రీతి వరించి
ప్రేమనహల్యా శాపముదీర్చి ప్రియభక్తుల రక్షించిన శ్రీరఘు ॥రామ॥
గురువాజ్ఞను వనమందొనరించి గుహుని భక్తికానందము చెంది
పరమాదరమున భరతునిగాంచి పాదుకలొసగిన పావనచరితుడు ॥రామ॥
ఖరదూషణాది దనుజుల ద్రుంచి కరుణ జటాయువు గతి సవరించి
శరభంగాది మునీంద్రుల బ్రోచి శబరి ఫలములు ప్రేమ భుజించిన ॥రామ॥
ముందుగ హనుమంతుని దీవించి ముదమలరగ రవిసుతు పాలించి
చెంగిన కినుకతొ వాలిని ద్రుంచి చేరిన వానరవీరుల బ్రోచిన ॥రామ॥
పావని సాహస మొరలాలించి ఆ వనరాశని నీట బంధించి
మోదము మీరగ లంకనుజేరి ఆదరముగ విభీషను బ్రోచిన ॥రామ॥
రావణాది సురవైరుల ద్రుంచి రమణితోడ సాధుల పాలించి
దేవతలెల్ల నుతింపగజేసి దేవిగూడి పురిజేరిన శ్రీరఘు ॥రామ॥

నిజ సహోదరులు నిను సేవింపగ నిన్నుగూడి ప్రజలెల్ల సుఖింపగ
అజహరాది సురులెల్ల నుతింపగ ఆనందముతోనయోధ్యనేలిన ॥రామ॥

రారా గోపాలబాల నీ చరణ రాధను కానా
ఘల్లుఘల్లుమని మ్రోగ కాళింగ పడగపై నిలచి
థిమిథిమ్మని ఆడినవాడు మా దేవర నల్లని వాడు
మా దీనత బాపిన వాడు మా దిగులే తీర్చిన వాడు.

రారే చూడగ పోదాము రాముని పెండ్లి
శ్రీలు మించిన దిక్కుటాలు
వింతల బంగళాలు ముత్యపు తోరణాలు
మూలల కిటికిటీలు వజ్రాల తలుపులు
తాపిన నీలాలు నీలాలు వేయార్లునూరార్లు బజార్లు
స్త్రీలకెక్కువ భూషణాలు ఉత్తర ద్వారాలు
సీతకు రాముడు సూత్రము కట్టుతాడు
ఇద్దరినొక్క ఈడుజోడుగ కూర్చినాడు
సీతకు తగువాడు శ్రీరాముడు ॥రారె॥
మంచిమగల కడనుంచి సిగ్గున తలవంచి
వశిష్ఠ రప్పించి ఖడ్గములు తెప్పించి
దూలాలపై గుప్పించి యిప్పించి
రప్పించి మెప్పించి ॥రారె॥

లావుగలవాని కంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాడెక్కినట్లు మహిలోగనరే!

లోకమందు పెక్కు భీకర కృత్యముల్
జరుగు కారణంబు అరయవలయు
స్వార్థరహిత సేవ సన్నగిల్లుటచేత
అర్థరహిత వాంఛలధికమయ్యె.

లోభివానిజంప లోకంబులోపల
కొట్టవద్దు వాని తిట్టవద్దు
ధనమునడిగినంత దబ్బున తాచచ్చు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

లోని శత్రువులకు లొంగిపోయినవాడు
బయటి రిపులనెట్లు పట్టగలడు?
తత్త్వమెరిగినంత ధన్యుడౌ నరుడిల
ఉన్నమాట తెలుపుచున్న మాట.

లోకములన్నియున్ ఘడియలోన జయించినవాడవింద్రియా
నీకముజిత్తమున్ గెలువనేరవు నిను నిబద్ధుజేయు నీ
భీకర శత్రులార్వుర ప్రభిన్నులజేయుము ప్రాణికోటిలో
నీకు విరోధి లేడొకడు లేదు, నేర్పునజూడుము దానవేశ్వరా!

లెమ్ము ధనుంజయా! విధి బలీయము ధర్మము గెల్చు నిల్చు స
త్యమ్ము, నశించు స్వార్థము సదా యుగధర్మమిదే కదోయి క
న్గొమ్మిక నంత్యకాలమున నూర్గురు బిడ్డల తండ్రికైన పిం
డమ్మిడు దిక్కుకల్ల రకటా! గ్రహచారము తప్పివచ్చినన్.

వద్లుజల్లునెడను వరిచేను పండును
పేలములనుజల్ల పెరుగునొక్కొ
జన్మరహితుడగును జ్ఞానార్థుడగుటచే
వినుము భారతీయ వీరసుతుడ!

వదలవలయుననీ జగద్భావములను
తెలియవలయును నీ జీవదివ్యతత్త్వ
మరుగవలయు బ్రహ్మపదము
కలుగు ఆనందమిదియని తెలుపతరమ!

వదలవలసిన దానిని వదలినంత
తెలియవలసిన దానిని తెలిసినంత
చేరవలసిన దానిని చేరినంత
కలుగు ఆనందమిదియని తెలుప వశమె!

వ్యక్తిగా జీవుడే సమష్టిగనుజూడ
ఈశ్వరుండగు, రెండునునశ్వరములె
కారణముగూర్చి వెతకిన కానరాదు
నిర్గుణానందబ్రహ్మమె నిలచియుండు.

వ్యక్తి మోక్షము కోరుట స్వార్థమగును
తాను గమ్యము చేరుట ధర్మమగున!
పరుల గమ్యము చేర్చుటే పాడియగును
ఇట్టి మనుజుడే నిజమైన మానవుండు.

వాన వచ్చినంత వసుధపై పండునె
పృధ్వి నాటకున్న విత్తనములు
విత్తనంబు నాట వెలయెంత పెట్టినా
వాన లేకయున్న ఫలము సున్న.

విద్య డిగ్రీల కొరకని వెఱ్ఱివీడి
సేవకా వృత్తికై మీరు చేరబోక
స్వీయదేశీయ సౌభాగ్యమరసి
జగతి శ్రామిక విద్యలన్ చదువ వలయు.

విమలభావంబు కలుగుటే విద్యయగును
సరసగుణములు కలుగుటే చదువులగును
సహజభావము కలుగుటే సరసమగును
మంచి నడతలు కలవాడె మానవుండు.

విలువలేని యినుప పెట్టె ఈ దేహము
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మదేవుడుండెను సుమా
సత్యమైన బాట సాయి మాట.

వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు యివల జీవి దేవుడవ్వల నుండు
కార్యమివలనవల కారణంబు

విశ్వమందు విభుడు వెల్గుచునుండును
విభునియందు వెలుగు విశ్వమెపుడు
విభుడు వెలగకున్న విశ్వంబు వెలుగదు
విశ్వవిభుల మైత్రి శాశ్వతంబు.

విశ్వచింతజేయు విజ్ఞాన రహితుడు
విష్ణుచింతజేయు విబుధవరుడు
ఒకడు విశ్వమొందునొకడు విష్ణుని పొందు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పు
సంకుచిత భావములనెల్ల సమయజేసి
ఐహిక సహజీవనాదికమెల్లగూర్చి
సమత నేర్పుటయె కాదె సరసవిద్య.

విశ్వహృదయమందు వినపించు ప్రణవము
వినుడు శ్రద్ధతోడ వీనులలర
కామ్యముక్తులనిడ కల్పకంబిదెసుమ్మి
మరువబోకుడిట్టి మంచిమాట.

విరుల వాసనకాదను వెఱ్ఱులుండ
వెన్నెల దుఃఖమిచ్చునను వికటులుండ
మధుర ద్రవ్యము వలదను మనుజులుండ
సాయిసంస్థల దెగడు దౌర్భాగ్యులుండ్రు.

వేదములు చెప్పునట్టిదె విహితకర్మ
చెప్పబడనట్టివెల్ల నిషిద్ధకర్మ
విధి నిషిద్ధమెవ్వారు విస్మరింత్రు
వాని పాపాత్ముడని వేరు ఎన్ననగునె.

వేదవిద్యలన్ని వెలయంగ చదివియు
నేర్పు మాటలందు నిపుణులయ్యు
సద్గుణుండు కాక సంస్కారి కాకున్న
పదునులేని భూమి పండనట్లె.

వానలు వచ్చెనంచు భువి పండునే విత్తులు నాటకున్న ఆ
వానలు రానిచో ఫలము వచ్చునె బీజము నాటియున్ననెం
దైనను రెండు కూడిన మహత్తర సిద్ధి లభించు సుమ్మి దై
వాను గతిన్ లభించు పురుషార్థ విధానము మేలునిచ్చటన్.

విశ్వస్తుత్యుడు శక్రసూనుడు మహావీరుండు ఘోరాసిచే
నశ్వద్ధామ శిరోజముల్దరగి చూడాంతర్మహారత్నమున్
శశ్వత్కీర్తి వెలుంగబుచ్చుకొని పాశవ్రాత బంధమ్ములన్
విశ్వాసంబుననూడ్చి త్రోచె శిబిరోర్వీభాగము బాసిపోన్.

వెఱువక కుంభజాతి కురువీరులపై మృగరాజువోలె నే
నుఱుకుచునుండ ఖండనికరోన్నత దివ్యమహాస్త్రపంక్తి నిం
బఱుపుచు గెల్చి రమ్ము సుత భద్రము నీకగునంచు పల్కకీ
తెఱగున పోకుపోకుమని తీవ్రతనాపుట నీకు పాడియా!

వెఱచినవాని దైన్యమున వేదననొందినవాని నిద్ర మై
మఱచినవాని సౌఖ్యమున మద్యము ద్రావినవాని భగ్నుడై
పఱచినవాని సాధుజడభావమువానిని కావుమంచు వా
చఱచినవాని కామినిన్ చంపుట ధర్మముకాదు అర్జునా!

వాల్మీకి ఎవ్వని వంశమందలివాడు?
నందుండు ఏ పల్లెయందు పుట్టె?
ధర కుచేలుండెంత ధనవంతుడైయుండె?
గజరాజు ఏ విద్యగలిగియుండె?
వసుధ ధ్రువుండెంత వయసు కలిగియుండె?
శబరికినెంతటి శక్తియుండె?
విదురునకెంతటి వితరణమతియుండె?
తిన్ననికెంతటి తెలివియుండె?
భక్తి కలిగిన వారికి వశుడనయ్య
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

విషయవాంఛలు నిన్ను వెంటాడు తరినీవు
నోరెత్తి సాయీశ శరణమనుము
కష్టపరంపరల్ కాల్దువ్వినపుడు
కరమెత్తి సాయీశ కావుమనుము
సంసార తాపముల్ సంఘటిల్లినప్పుడు
మనసార సాయీశ మరువననుము
మది దురహంకారమొదవినయప్పుడు
తలవంచి సాయీశ దాసుడనుము
సత్యభాషివై సాయీశు సాక్షిగనుము
మోక్షమాశించి సాయీశు మ్రోలమనుము
విశ్వమోహన గానము వీనులలర
ఆలపించిన శ్యాముడే ఆతడు నమ్ము.

విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ
శంభుండు గొప్పని శైవులనగ
గణపతి గొప్పని గాణపతులు పల్క
శారద గొప్పని చదువరులన
అల్లాఘనుడటంచునల్ల తురకలు చెప్ప
శాక్తేయులందరు శక్తియనగ
నేను గొప్పయటంచు నాదు భక్తులు చెప్ప
అందరొక్కటేయని కొందరనగ
సర్వమత సమ్మతముగను సత్యమైన
బ్రహ్మమొక్కటేయని మీరు పలుకవలయు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

వేదశాస్త్రమ్ములు వివరించి బుధులచే
చదివించ వచ్చు తా చదువ వచ్చు
యజ్ఞయాగ తపములధికార జనులచే
చేయించ వచ్చు తా చేయవచ్చు
ఇలలోనగల తీర్థములనేగనన్యుల
బోధించ వచ్చు తా పోవ వచ్చు
అష్టాంగయోగంబునర్థులకును బోధ
సలుపంగ వచ్చు తా సలుప వచ్చు
కాని తన మనోబుద్ధ్యహంకారములను
నిల్పి అంతర్ముఖము చేసి నియతితోడ
నిశ్చలసమాధి నిష్ఠులై నిలువ లేరు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

వేదాలు ఈనాడు వాదాల పాలాయె
శాస్త్రంబులన్నచో చప్పబడియె
బహు పురాణంబులు పాతవైపోయెను
శతకంబులన్ని యుజడ్డువడియె
గ్రంధరాజంబులు గంగపాలైపోయె
చక్కనౌ నీతులు చెదలుబట్టె
గురురాజులందరు బరువు భారంబైరి
పెద్దలందరు వట్టి మొద్దులైరి
కల్లలాడు వాడీనాడు పురుషవరుడు
విత్తమున్నట్టివాడె పో ఉత్తముండు
ఔర! కలియుగ ప్రభామేమియందు!

వృక్షంబువై నీవు వర్థిల్లుచుండిన
వల్లికనై నేను అల్లుకొందు
పుష్పంబువై నీవు పొలుపొందుచుండిన
తుమ్మెదనై నేను తిరుగుచుందు
అనంతమైనట్టి ఆకాశమీవైన
చిన్ని చుక్కగ నీలోన చెలగుచుందు
వర సముద్రుడే నీవైయుండిన
వాహినియై నేను ఐక్యమగుదు
మేరుపర్వత భవ్యమేదిని నీవైన
సెలయేటినై నేను చెలగుచుందు.

వాచామగోచరుండవు
నీ చరితములు పొగడ బ్రహ్మాదులకైన తరమా!
హే కృష్ణా! కాచుకున్నాను నా మొర ఆలకించి బ్రోవుమయ్య
కాలుడుగొనిపోయిన గురుపుత్రుని తెచ్చి యిచ్చినావు
కాముని మదమణచినావు వసుదేవదేవకీ చెర విడిపించినావు
వెలదియొంటియైన ఆ ద్రౌపది 'హాకృష్ణా!కృష్ణా!' యని మొరలిడ
బ్రోచినావు మేలు పాండవులను గాచినావు.
కుచేలుని ఆర్తిదీర్చినావు
కురూపియైన కుబ్జ వక్రములను పోగొట్టినావు.

వినండయా బోధ వినండయా విని సత్యమార్గమున నడవండయా
నిదురలేచినదాది నిదురపోయెడుదాక ఆస్తికై కుస్తీలు వేస్తారయా
రూపాయి కోసమై లోపాయికారిగా అడ్డమైన గడ్డి తింటారయా
ధనం కోసం దైవధ్యానాలు బోనాలు పెక్కు పన్నాగాలు పన్నేరయా
భమి సూర్యుని చుట్టు జనులు ధనము చుట్టు గిరగిరా తిరుగుతుంటారయా
లింగలింగాయంచు లింగపూజలు చేసి దొంగసాధనలు మీరు చేస్తారయా
స్వార్థంబుకై కీర్తిమర్యాదలాశించి ధూర్తకార్యాలు మీరు చేస్తారయా
కలిమి కల్గిననాడు కప్పగంతులు వేసి కలిమి పోయిననాడు క్రుంగిపోయేరయా
గొప్పకు పోతారు గోవింద కొడతారు డాబులు దంబాలు మానండయా
సర్వభూతములందు సర్వేశ్వరుని మీరు సమముగానెప్పుడు చూడండయా.

వెతుకుచున్నాను నేను వెతుకుచునే ఉన్నాను
వెతుకుచుంటి నాడు నేడు నిజమానవ ధర్మపరుని
కొదువలేదు నరులకు నన్నూరుకోట్లున్నారు
నరుని రూపములెజూచితి నిజరూపము కాంచనైతి

బురగ కాయలుజూచి మామిడియని భ్రమసినట్లు
వెట్టిచెరకు చూచి చెఱకని తా నమిలినట్లు
కలికిరాళ్ళ రూపముజూచి కలకండని భ్రమసినట్లు
రూపుజూచి మోసపోకు గుణమే నిజ నరుని రూపు.

వేయబోవని తలుపు తీయమంటూ పిలుపు
బాబకెందుకొ నవ్వుగొలుపు
నీలోన నాలోన నిదురచెందే వలపు
మేలుకొంటే లేదు పిలుపు
విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన
వీధివాకిలి ఏదటో!
విశ్వవిభుడే నా వెనువెంటనేయుండ
పిలుపేది తలుపేది వీధివాకిలి ఏది?
వీణతంత్రులు మీటి ప్రాణతంత్రులు నాటి
ఆనందభాష్పములు
ఆత్మార్పణము చేసి కైలాసమే చూడరా
ఓ జీవ! వీధివాకిలి కానరా!

శతపత్రంబుల మిత్రుని
సుతుజంపినవాని బావసూనుని మామన్
సతతము దాల్చెడి యాతని
సుత వాహనవైరి వైరి సున్నంబిదిగో.

శాంతి అంతరించె సత్యంబు కరువయ్యె
ఆయుధంపు ప్రీతి అధికమయ్యె
ఈ దురంతములకు హేతువు స్వార్థమె
ఉన్నమాట తెలుపుచున్న మాట.

శాస్త్రజాలమునంతయు చదువగానె
దట్టమైనట్టి అజ్ఞాన తమము తెగునె?
ఆచరణలేని విద్యలు అవనియందు
నిండియుండియు ఫలమేమి గుండుసున్న,

శిలల పూజలందు శ్రేష్ఠుడు నీవౌచు
ప్రజల మెప్పు కొరకు పాటుపడియు
ఇట్టి పూజలెల్ల ప్రజలు మెచ్చిరిగాని
శివుడు మెచ్చు సేవ చేయరయ్య.

శ్రీకరంబగు దేవుడు నీకు నరుడ!
పగటివేళ చుక్కలు కానబడని పగిది
కానరాకున్న అజ్ఞాన కారణమున
అంతమాత్రాన అతడు లేడనకు సుమ్మి.

శ్రీపుట్టపర్తి నిలయుడు
కాపాడును నిన్నునెపుడు కరుణాకరుడై
చేపట్టి నిన్ను బ్రోచును
ఏపట్టున విడువకుండ ఏలును నిన్నున్.

శాస్త్రంబునెప్పుడు సత్యంబుగానెంచు
    వేదసమ్మతమగు విప్రులార
దేశంబు కొరకునై దేహమర్పణ చేయు
    రహిమించు రాజాధిరాజులార!
ధనధాన్యములు కల్గి ధర్మగుణాలతో
    అలరుచుండెడి ఆర్యవైశ్యులార!
వ్యవసాయవృత్తిలో వర్ధిల్లుచుండియు
    సుఖజీవనము చేయు శూద్రులార!
కాలమంతయునూరక గడపనేల?
సర్వజన సమ్మతంబగు సత్యమైన
భక్తిమార్గముగొనుడిహపరములిచ్చి
సత్యముగ మిమ్ము సాకును సాయిబాబ.

శ్రీమంతులకుగాని చిక్కబోడందురా
    భక్తకుచేలు ఐశ్వర్యమెంత?
పండితులకుగాని వశము కాదందురా
    నిజముగ గుహుని పాండిత్యమెంత?
సౌధంబులంగాని చరియింపడందురా
    సరిసరి విదురుని సౌధమెంత?
తాపసులకుగాని చిక్కబోడందురా
    ఉడుత తపంబెంత కడిమ ఎంత?
నాటినాటికి విషయచింతనలు వీడి
నేను నాదను గర్వంబు నేడె వీడి
శరణు వేడుము శ్రీసత్యసాయిదేవు
పాదపద్మంబు మన్మనో భ్రమరరాజ!

శ్రీవారి సన్నిధి శిరసుంచి మ్రొక్కితి
    మన్నింప వేడితిననుము హనుమ
పరిపూర్ణ కాముడు శరణార్థులను బ్రోచు
    బిరుదులను నిలుపుకోమనుము హనుమ
దశకంఠుడాడిన నిశితోక్తులన్నియు
    గడువిచ్చెనను మాట కడకు చెపుమ
కాకాసురునినాటి కమనీయ ప్రేమంబు
    స్రుక్కిపోలేదని చెప్పు హనుమ
రెండుదినములు కలవోలె నిండి చనియె
ఇంక నేనెట్లు భరియింతు నిట్టితీరు
ఇనకులస్వామి నెలలోనెనేగుదెంచి
కొనక యుండిన సీత లేదనుమ హనుమ!

శీర్ష పీఠికమునందేమున్నదోగాని
ౣమ్రోగుచున్నది నిన్ను మ్రొక్కినపుడు
హృదయ పీఠికమునందేమున్నదోగాని
తొలుకుచున్నది నిన్ను తలచినప్పుడు
ఈ మనఃపీఠమందేమున్నదోగాని
జారుచున్నది నిన్ను కోరినప్పుడు.

శంకరుడైనను శ్రీధరుడైనను
లంకేశ్వరుడగు రావణుడైనను
నారదుడైనను శారదయైనను
వారథి దాటిన వానరుడైనను
రాగప్రియులే నాదప్రియులే
సంగీతామృత పానప్రియులే!

శ్రీరామా నా మనవిని వినుమా
సీతా శిరోరత్నమె గొనుమా
చెలగి విల్లుల లోపలనున్న చిలుక
రీతిని వణుకుచు నీలుచున్న
పలువురు రాక్షస మగువలెల్లరు
బలిమిని ఖడ్గములూపుచు
తలను ద్రుంచే మంటవైచగ
తల్లడిల్లిన సీతజూచితి.

శృంగారములు వేరు, బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే
జీవ జాతులు వేరు, జీవుండు ఒక్కడే
పూలజాతులు వేరు, పూజ ఒక్కటే
దర్శనంబులు వేరు, దైవమొక్కడే.

సకల యత్నములను సతతంబు చేయుట
అధిక విద్య నేర్చి అధికుడగుట
భూమి సాగుచేసి భూచక్రమేలుట
కొలువు కూడ పొట్టకూటి కొరకె.

సంఘ సభ్యుల రుచులను సమయమెరిగి
స్వార్థమైనను విడనాడి సంఘమునకు
మేలు చేకూర్చు విధమున మెలగవలయు
నొవ్వ సేయకు ఇతరుల నొచ్చుకొనకు.

సంఘ మర్యాదలన్నియు గంగ కలసె
మనుజ జాతికి తృప్తియే మాయమయ్యె
శీలనీతులు జగతిలో క్షీణమయ్యె
ఇదియె ప్రోగ్గెస్సు యీనాటి విద్యయందు.

సత్యధర్మమహింసయు శాంతిప్రేమ
మానవుని పంచ ప్రాణాలు మహిని వెలయు
పంచప్రాణాలలో ప్రేమ ఎంతొ హెచ్చు
కాన హృదయాన ప్రేమను గట్టి పరచు.

సత్ప్రవర్తన సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమశిక్ష కర్తవ్యపాలనంబు
నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు
సత్యమును తెల్పు మాట శ్రీసాయి మాట.

సత్సంగముచే సహజ విరక్తి
ఆ విరక్తిచే విగత భ్రాంతి
భ్రాంతి వీడితే శాంతి స్థిమితము
స్థిమిత శాంతిచే జీవన్ముక్తి!

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యమందణగెను సర్వ సృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరండి.

సత్య వాక్కు చేత సన్మానములు కల్గు
సత్యవంతుడగును సర్వ సఖుడు
సత్యగుణముకంటె సాటిగనేమిటి?
వినుము భారతీయ వీరసుతుడ!

సత్యధర్మశాంతి నిత్యమైయుండిన
ప్రకృతిమాత ఎంతొ పులకరించు
విశ్వశాంతి హెచ్చు విపుల కీర్తులు హెచ్చు
వినుడు భారతీయ వీరసుతుడ!

సద్గురు చరణాబ్జములపై భక్తే
త్వరగా ముక్తిని చేర్చే మార్గము
ఇంద్రియ మానస సాంద్ర నియమమే
హృదయస్థుని చూపించును దేవుని.

సద్గుణంబు లేక సచ్చింతనలు లేక
ధ్యానమందు మనసు పూనగలదె
ఇల్లు కట్టుటకును యిటుకలు సున్నంబు
కలుగకున్న ఇల్లు కట్టుటెట్లు?

సద్గుణంబులు త్యాగంబు సత్యనిష్ఠ
లేని జీవుడు ప్రాణంబు లేనివాడె
సేవ చేయని జీవుండు చీకటింట
అంధ జీవుడంచుననగ వచ్చు.

సన్నజాజి కన్న సంపంగిలత కన్న
జున్నుగడ్డ కన్న వెన్న కన్న
నెమలికన్ను కన్న నిండువెన్నెల కన్న
కన్నతల్లి ప్రేమ సున్నితంబు.

సర్వవేళల సర్వత్ర పర్వియుండు
ఆత్మ కనిపించదేలకోఅంద్రు జనులు
పాలయందున్న వెన్నను కోరినంత
పొందగలుగుట సాధ్యమా ఎందునైన!

సర్పమింటియందు సంచరించుచునుండ
ఏరికి సుఖనిద్ర కోరివచ్చు
విషయ సర్పముండు విషమయ దేహాన
జీవయాత్ర దేహి చేయుచుండు.

సర్వ మృగములందు సామాన్య తెలివుండు
భుక్తిభోగమెల్ల పొందుచుండు
అట్టి నరుడు భువిని వట్టి మృగంబెగా
మనిషి కాడు వాడు మహిని పుత్ర!

సర్వ సద్గుణములు చక్కగా లేకున్న
వారు గురులు కారు వాస్తవముగ
సవినయుండు కాక సచ్ఛాత్రుడెట్లగు?
ఉన్నమాట తెలుపుచున్న మాట.

సర్వభూతదయకు సాటి పుణ్యము లేదు
హింసబోలు పాపమెందులేదు
నారు పెట్టువాడు నీరుపోయకయున్నె
ఉన్నమాట తెలుపుచున్న మాట.

స్వర్గమనగ వేరు పరలోకమున లేదు
నరుల మనమునందెనమరియుండు
తనదులోని అహము తా చంపుకున్నచో
అదియె స్వర్గమగును అవనియందు.

సాటి మానవులను సాధింప నీకేల
ధర్మమెపుడు నీవు తప్పకున్న
భారతమ్ములోని పరమార్థమిదియెగా
ఉన్నమాట తెలుపుచున్న మాట.

సాధనము చేసి ఫలమేమి శమము లేక
యోగమును పూని ఫలమేమి ఓర్పు లేక
జపము చేసియు ఫలమేమి శాంతి లేక
చవిటి భూమిని దున్నిన చాయకాదె!

సాధుజనులను చూచి చౌకను చేతురు
వారికేమి కొరత వసుధయందు
కుంజరమునుజూచి కుక్క లుమొరుగును
దాని ఘనతకేమి తక్కువగును?

సాయి అర్థించు మీ నుండి సద్గుణములు
సర్వమానవ సోదర సఖ్యబుద్ధి
స్వార్థ త్యాగంబు పరిశుద్ధ సంఘసేవ
సాయికిచ్చెడి ధనమిదె సత్యముగను.

సాయికున్నట్టి ఐశ్వర్యసంపదలకు
సాటి ఐశ్వర్యమున్నదెచ్చోటనైన
సాయి ఐశ్వర్యమేమన్న స్వార్థరహిత
నిత్యనిర్మల ప్రేమయె నిజము నిజము

స్వీట్ల పేర్లు వేరువేరుగానుండిన
అందులోని చక్కెరంతనొకటె
వ్యక్తులందరు వేరువేరుగానుండిన
అందులోని తత్త్వమొకటె తెలియ.

సుఖములందు నన్ను చూడరు మానవుల్
కష్టసమయమందు కావుడంద్రు
ఆపదలను నేను అగపడకున్నచో
తిట్టుచుంద్రు ఏమొ పెట్టినట్లు.

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు
మేటి వస్తువునందున మేటియగుచు
అంతటను సర్వసాక్షియైయలరునట్టి
ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మయగును

సేవ చేయునట్టి సేద్యంపు పశువును
చేరి చితక కొట్టు చిత్రముగను
రాతిఎద్దును చూచి రక్తితో పూజించు
ఉన్నమాట తెలుపుచున్న మాట.

సౌఖ్యమనుభవింప జాలని లోభికి
ఎంత కలిగియున్న ఏమి ఫలము?
నీరు గతుకు కుక్కకేరెంత పారినా
ప్రీతి కలుగబోదు పిసినిగొట్టు.

సత్యనిత్య సుకృతులెల్ల వికృతిరూపు పొందుచుండె
పవిత్ర ప్రకృతి ప్రతిదినము ప్రజల వీడిపోవుచుండె
ధర్మదయాచరణ సతతం వికృతిరూపు దాల్చుచుండె
వేదమాత ఘోషలన్ని విచారమును పొందుచుండె.

సత్యధర్మ ప్రబోధలు చచ్చెననుచు తలచవద్దు
ఆత్మధర్మ ప్రబోధకులు మహాత్ములనుట మరువవద్దు
వారు వేసిన విత్తనాలె విజ్ఞానవృక్షమనుట నిజము సుమ్మి
సత్యానికి స్థిరము కలదు ధర్మానికి జయము కలదు.

సారము లేనియట్టి భవసాగరమందు మునింగి తేలుచున్
దారియుతెన్నుగానకయె తత్తరమందెడి మానవుండ నీ
కోరిమి యించుకంత మదినూనుచు భక్తిని కల్గి చూడు శ్రీ
కారుడు సత్యసాయి నిను కావగ వచ్చిన నావగాంచవే!

సిరులను కోరను సర్వభాగ్యతతుల చెల్లారనిమ్మంచు నే
వరముల్ వేడను, నెల్లవేళలా భవత్పాదారవిందంబు నా
యురమందుంచు శక్తినిమ్మని సదా యుల్లంబునగోరితి
తరమా నిన్ను నుతింప! నీకు దయలేదా సత్యసాయి ప్రభూ!

సంస్కారమే లేని చదువెంత ఉండినా
గలిగించునే మీకు గౌరవంబు?
నీతియే లేకున్న నియమంబు లేకున్న
కలుగునే మీకిల గౌరవంబు?
హద్దులు మీరిన అధికారబలమున్న
కలుగునే యిలలోన ఘనత మీకు?
ధర్మమార్గము వీడి ధర్మంబు బోధింప
మర్యాదనిత్తురే మహిని మీకు?
పాపభీతియు లేనట్టి భావమందు
పాప పనులను చేయక ప్రకృతియందు
ఇంకనైనను ఈ సత్యమెరిగి మీరు
భరతపుత్రులమని పేరుబడయరయ్య.

సకల విద్యలు నేర్చి సభ జయించగవచ్చు
శూరుడై రణమున పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
హేమభూదానముల్ యీయవచ్చు
గగనంపు చుక్కలు గణియింపగావచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగవిద్యలనన్ని నేర్వగవచ్చు
చంద్రమండలయాత్ర సలుపవచ్చు
కాని దేహేంద్రియాదుల కట్టిపెట్టి
మనసు నిల్పియు నంతర్ముఖము చేసి
అనవరత నిశ్చలంబైన ఆత్మలగుచు
నిలువగాలేరు మానవుల్ నియతితోడ.

సకలశాస్త్రపురాణ సంగ్రహవేత్తయై
వేదాంతవేద్యుడౌ విభుదుడైన
రక్తి యేపారగ రమ్యహర్మ్యంబుల
రహిమించు రాజచంద్రముడునైన
రణరంగమందు పరాభూతరిపుడౌచు
వెల్గొందు జగదేకవీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్య విభుడగు దాసుడైన
భక్తి లేనిచో ఎందుకు పనికిరాడు
భక్తిలేనట్టి ఆ జగద్భర్త కన్న
భక్తిపరుడగు దాసుడే వంద్యుడగును
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
దానధర్మాల సార్థకత సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
పదవులనేలిన ఫలము సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ
గుణములియ్యవి నాలుగు గోడలప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

సత్యామృతంబును చవిచూడకున్నచో
చెల్లునే నరుడన్న చెక్కబొమ్మ?
ధర్మంబునెరుగక దనుజుండెయగుగాని
మానవుండగునెట్లు మహినిబుట్టి?
శాంతిచెందని జీవి శార్దూలమేగాని
మానవుడెట్లగు మనసులేక?
ప్రేమలేకను జీవి బీటలు వారిన
మరుభూమియేగాని మనుజుడగునె?
సత్యధర్మప్రేమ జగతి చక్క వెలయ
కాన నాలుగు గుణములు క్రమముతోడ
పట్టుదలతోడ సాధించి పరమ భక్తి
పూర్ణమానవత్వంబును పొందరయ్య
ఇదియె ఇహమున పరమునిచ్చు సుఖము.

సద్విద్య చదివించి శాంతిని బోధించి
ధర్మము నేర్పెడి తండ్రి తండ్రి
సన్మార్గమును చూపి సభ్యజీవనమిచ్చి
దైవభక్తిని తెల్పు తండ్రి తండ్రి
స్వార్జితంబులనంత చక్కగా పంచిచ్చి
తత్త్వంబు గరపెడి తండ్రి తండ్రి
సత్కుమారునిజూచి తనలోన సంతృప్తి
పొందు మహాత్ముడౌ తండ్రి తండ్రి
అట్టి తండ్రిని గన్నట్టి అమరసుతుడు
అంకితంబగు ఆత్మకు శంకలేక
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

సద్విద్య ఉన్నచో సంస్కారమదియబ్బు
సంస్కారమున్నచో జన్మమదియె
సద్విద్య ఉన్నచో సౌఖ్యంబు చేకూరు
సౌఖ్యంబు వల్లనే కల్గు శాంతి
సద్విద్య ఉన్నచో సత్సంగములు కల్గు
సత్సంగమున్నచో శాంతి అదియె
సద్విద్య ఉన్నచో జన్మ సార్థకమగు
జన్మ సార్థకముచే కలుగు ముక్తి
సత్యనిత్యమైన చదువు చదివినపుడె
సార రహితమౌ సంసార సాగరమున
మునిగి తేలక త్వరలోనె మోక్షమందు
కాన యిట్టి చదువుకై కదలిరండు.

సర్వ సౌఖ్యంబులు సమకూర్చు ధనమన్న
ఎంతవరకది నీ చెంతనుండు?
ఆనందమది ఎంతొ అందించు ధనమన్న
ఎంతవరకది నీ సొంతమగును?
కష్టముల్ పోగొట్టి శాంతి నిచ్చునదన్న
ఎన్ని కష్టములను ధనము యిచ్చె?
శాశ్వతంబైనట్టి సౌఖ్యంబు కోరక
ధనముకై జన్మను ధారపోసి
ఏమి సాధించితివి నీవు జగతియందు?
ఎంత వరకుండెదవు నీవు జగమునందు?
నేనెవరు నాదు కర్తవ్యమేమిటో
ప్రశ్న వేసుకో నరుడ! సత్యంబు గోచరించు.

సాయినామమె నీకు ప్రతిపన్న భాగ్యంబు
జీవనాధారంబు జీవితంబు
సాయిరాముడే ప్రాకట దైవంబు
భజియింప సేవింప శ్రీకరంబు
సాయికృష్ణుడే నీదు రక్షకరాజంబు
సంసార క్షితినార్ప సత్పథంబు
సాయిశివుడే నీదు సర్వబంధు బలగంబు
సకల భోగఫలంబు సమ్మతంబు
సాయి నామమే నీకింక సుధీమతంబు
సాయి భజనయే నీకింక సుజన విభ్రాజితంబు.

సాయి నామమె హాయి స్మరియించు చుండంచు
వృక్షముల్ తలలూపి బల్కుచుండు
సాయి నామమె హాయి స్మరియించు చుండంచు
పక్షి సంతానముల్ పల్కుచుండ
సాయి నామమె హాయి స్మరియించు చుండంచు
కుసుమాలు వాసనల్ కురియుచుండ
సాయి నామమె హాయి స్మరియించు చుండంచు
తుమ్మెదల్ ఝుమ్మని క్రమ్ముచుండ
ఆకసమునుండి యివియె శబ్దములు వచ్చు
భూమినుండియు యిదియె శబ్దములు వచ్చు
సాయిబాబా యనుచు సర్వదిక్కులందు
పిక్కటిల్లుచుండును పర్తియందు

స్నానంబు చేయు ఆ జవరాంద్ర చీరలు
కాజేసినందుకా పూజ నీకు?
గొల్లపూబోండ్లతో జల్లులాడిన నాడు
హర్షించినందుకా అర్ఘ్యమిడుట?
చాలునిక కట్టిపెట్టు పంచాంగమింక
పొగడుకొనబోకు చాలించు మూయినోరు
చాలదీ నాల్క శ్రీకృష్ణు సన్నుతింప
నూరు చీల్కలు చీల్తు నోరోరి భీష్మ.

సిరులకేమి ప్రసన్న చిత్తుండవైనచో
చాలదే పదివేలు చాలు తండ్రి
సుఖసంపదలకేమి సుముఖుండవైనచో
చాలదే పదివేలు చాలు తండ్రి
కోర్కెలకేమి నీ కటాక్షమున్నచో
చాలదే పదివేలు చాలు తండ్రి
విభవానికేమి నీ యభిమానమున్నచో
చాలదే పదివేలు చాలు తండ్రి
ఇచ్చినవి ఏవొ ఉన్నవి యింతె చాలు
అధికములకేమి అవి ఎప్పుడైన గలుగు
వీడు నా భక్తుడని ఎల్లవేళ నీకు
ఒక్కరీతి అనుగ్రహమున్న చాలు.

సత్యధర్మము శాంతిప్రేమలతోనీ నిత్యజీవనయాత్ర సాగించు
యత్నప్రయత్నముల్ మానవ ధర్మముజయాపజయములు దైవాధీనము. ॥సత్య॥
భక్తితోడ భగవంతుని తలచుచు నిత్యకర్మములు నిర్వర్తించిన
అట్టి జనకునకు రాజయోగమున అందరాని మోక్షము అందెనే. ॥సత్య॥
అష్టసిద్ధుల సాధనెందులకు అది వట్టి భ్రమలతొ కట్టివేయునుగా
దట్టమైన ఈ జీవితాటవిలో వట్టి నామమె పట్టపగలౌ. ॥సత్య॥
హృదయభూమిని సాగుచేయండి మీ మనసు వడకగ గుణములే ఎద్దుల్
వివేకమను చెలకొలను తీసి విశాలమగు మీ హృదయము దున్నుడు. ॥సత్య॥
మానవ ధైర్యము మంచి ఎరువుగా ప్రేమధారలె పంట విత్తులుగ
భక్తే వర్షము భావమె కలుపులు బ్రహ్మానందమె పండెడు పంట. ॥సత్య॥
ప్రకృతి ధర్మము పట్టు విడకండి కర్మయోగమె జన్మ ధర్మంబు
స్మరణే మానవ జన్మ రహస్యము సాధనే భక్తుల సారలక్షణము ॥సత్య॥
కష్టసుఖములు ఖర్మలనకండి మన ఇష్ట లోపమె కష్టమౌనండి
పట్టు విడక ఆ పాదము కొలిచిన గట్టు చేర్చుట తన పట్టేను. ॥సత్య॥
మొదటి పట్టును విడువబోకండి ఆది పట్టులోనే భక్తి పట్టండి
ఎన్ని బాధలను పొందిన భగవ చ్చింతన మాత్రము విడకండి. ॥సత్య॥
ఎదను విడదు ఎడబాయలేదు మిమ్మేలుచుండు ఏవేళలా
కరుణే అతడు అతడే కరుణని కరుణకె కాచి పొందండి. ॥సత్య॥

సత్యసారము తెలుసుకోరన్నా
ఈ తత్త్వమెరిగి జన్మమొందన్నా
ఈ ధర్మమెరిగి మన్ననొందన్నా
పామరత్వము పాడుచేసి
నియమనిష్ఠలు ఎత్తి నిల్పి
ఈ సత్యసాయిని తెలుసుకోరన్నా
దేహభావము వీడరోరన్నా
అందమెందు యిందు లేదన్నా
అందమైన ఆత్మ విడిచి
నింద్యమైన తనువు నేనని
తలపు వీడి శాశ్వాతముగ
తత్త్వభావము ఎరుగరోరన్నా

సాయిసాయి సాయిరామా యని మీరు రయమున పాడగ రారండి!
ప్రేమ మీర ఓ సాయిరామా యని పిలచి తరింతురు లేవండి. ॥సాయి॥
కుక్క తోకయగు మానవ మనసును చక్కబరచును రారండి
ఒక్క మనస్సుతో నమ్మి సాయిని చక్కగ స్మరణము చేయండి. ॥సాయి॥
పుట్టుట గిట్టుట రెండే జన్మకు గట్టివనుచు మది తలచండి
వట్టి భ్రమలతో మునిగి కర్మలు ఎట్టివి చేయక మెలగండి. ॥సాయి॥
కలియుట బాయుట కాలవాహిని కాంక్షలు విడిచి చూడండి
కర్మయోగమే జన్మకు ముఖ్యము ధర్మము నడచి మెలగండి. ॥సాయి॥
నామస్మరణయె ముఖ్యవిద్యయని నియమముతో సేవించండి
తక్కినవన్నీ హుళక్కి విద్యలని పక్కకు నెట్టుట చూడండి ॥సాయి॥
తన తలపెల్లఫలింపకున్న యిక దైవము వలదని అనకండి
దయకు ప్రాప్తుడై మెలగిన తలపుల ఫలములు కొరతేముందండి ॥సాయి॥
కూటికి పేదయు కోటీశ్వరుడును కాటికి ఏగుట సమమండి
కోతిగుణంబులు మాని ఈ పరంజ్యోతి రూపమును జూడండి ॥సాయి॥
పామరత్వమే ప్రకృతి అందమను పాటను మీరిక మానండి
పరుల బాధలు తమయట్టివియని నియమముగ మదిలో తలచండి ॥సాయి॥
మానవ ధర్మము మాధవునాజ్ఞని మర్మమెరిగి భజియించండి
సర్వజన ప్రియ సాయీశుండనిసారెకు మదిలో వేడండి ॥సాయి॥
లోకముకై దిగులొందక మీరు లోకేశుని సేవించండి
వర్ణాశ్రమ ధర్మంబులు వదలక ఓపికతో సాధించండి ॥సాయి॥
మనసుకు లోనై మరిమాటాడక మాధవ స్మరణము చేయండి
మర్మమెరింగిన మరునిముసములో మనసే వారికి గురువండి ॥సాయి॥
భక్తిజ్ఞానవైరాగ్యములన మాకు శక్తి చాలదని యనకండి
నామస్మరణతొ కూడినవి నయభయవిశ్వాసములేనండి ॥సాయి॥
చీకటివెలుగులు కష్టసుఖములు చేసిన కర్మకు ఫలమండి
బాగుగ నమ్మక ఓగున ఏడ్చే పామరత్వమును వదలండి ॥సాయి॥
జాతినీతి మతశాస్త్రములాదిగ దైవలీలలని తలచండి
ఎట్టి బాధలను పెట్టిన మరువక సాయిరామయని తలచండి ॥సాయి॥
నరుడైనందుకు పరమాత్మయని తలచిన నరుడని ఎంచండి
భగవన్నామము వలదను నరుని నరపశువని భావించండి ॥సాయి॥
రామకృష్ణ హరిగోవిందా నారాయణ శివయని తలచండి
అన్ని నామములు పరమాత్మవెయని భేదమడచి భజియించండి ॥సాయి॥
సృష్టియంతయు భగవత్సంతతి భక్తులమని భావించండి
భక్తులందరు సోదరీసోదర ప్రేమభావములు పెంచండి ॥సాయి॥
ప్రేమే దైవము దైవమె ప్రేమయని ప్రేమ తత్త్వమును పెంచండి
ప్రేమలలో నిష్కామప్రేమనుపట్టు విడక సాధించండి ॥సాయి॥
సాయిరామ యని నామము తలచిన సర్వ బాధలు సమయునండి
నియమముతో సేవించువారికి నిశ్చలతత్త్వము కుదురునండి । ।సాయి॥
పుణ్యకార్యములు చేయకున్నను పాపములను తలపెట్టకండి
పాపములన్నింటికంటె మించినది పరులను నిందించేదండి ॥సాయి॥

ఇట్టి గుణంబులు నేర్చినవారికి ఇహపర సుఖములు కలుగునండి
సాయిరామయని భజనలు చేసిన అన్ని సౌఖ్యములు కలుగునండి ॥సాయి॥
సత్యముధర్మము శాంతముప్రేమ ఉత్తమ స్థితికి త్రోవండి
కామక్రోధ ద్వేషంబులను చుట్టి చూరను పెట్టుట మేలండి ॥సాయి॥
బీదసాదలను భేదభావములు సాయికి మదిలో లేవండి
పర్తివాసుని పాదము వీడక పదములతో మీరు పాడండి ॥సాయి॥

శివశివ శివశివ యనరాదా జీవా చింతలెల్ల బాపుకొని మనరాదా
శివసాయీశుని కనరాదా జీవా సువివేకంబును కనరాదా జీవా ॥శివ॥
శివమెత్తి జగమెల్ల తిరిగేవు ఓ చిత్తమా! నీకెంత సిగ్గులేదె
అవని సుఖంబుల కల్లాడెడి నీకావలికి మిగిలేది ఏది? ॥శివ॥
పొద్దుపోక యూరివారి సుద్దులన్న మీరు సిద్దమౌదురే కడు శ్రద్ధతోడ
ముద్దుముద్దుగాను సాయి ముచ్చటలు చెప్ప నప్పుడొద్దికనుండరె చెవులార ॥శివ॥
పనిమాలి సినిమాలు పలుమారు మీరు చనిచని కనినను తనివి లేదె
క్షణమును దైవసన్నిధిని నిల్పగ కనులార కడు కష్టమౌగా ॥శివ॥
అవినీతి రోతమాటలందరితో నీవనుటకు గౌరవమయ్యెనుగా
నవనీతచోరుని నామము పల్కుట నాల్కా అవమానంబగునా ॥శివ॥
పనిలేని శునకంబువలె నీవు పరుగిడి వగరించి తిరిగేవు
క్షణమును సత్సంగములో నిల్పగ సాధ్యముకాదా చరణములారా ॥శివ॥
ఇచ్చవచ్చు చెడ్డపనులెల్ల సేయ ఆ ఈశ్వరుండు మిమ్ము సృజియించినాడ
తెచ్చుకొని చేతులా తెల్వి యింకనైన మీరు చెచ్చరను హరిపూజ సేయరారె ॥శివ॥
పాటలు పాడిన ఫలమేమి? మంచి మాటలు నేర్చిన మహిమేమి?
సూటిగ పెద్దల బాటనె పోయిన సుఖముల మూటలు దొరుకునుగా ॥శివ॥
సులువుగ దొరికిన సుందర సాయిని చులకన చేయగ చూతువుగా
పలు బొమ్మలకే పడిపడి మ్రొక్కినభయభక్తులతో బ్రతుకుదువా ॥శివ॥

హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే!

హస్తమున అణుబాంబు ఉంచుక
అరచుచుందురు శాంతిశాంతని
చంద్రు చేరగల్గికూడను
చెందజాలరు శాంతిసుఖములు.

హృదయమనే క్షేత్రమందు కలదు దల్పతరువు
దాని చుట్టు కలుపుముండ్లకంప పెరిగియుండు
కలుపు తీసివేస్తె కల్పతరువు కానబడును
అదియె మీ అభీష్టముల నెరవేర్చు కల్పతరువు.

హెచ్చు చదువు చదివి యింద్రియలోలురై
  చచ్చువారల కన్న స్వల్పమైరి
ఇంద్రియముల శక్తి యిముడుకొంచునుగాని
  అట్టి చదువులు చదివి ఆర్యులౌట
చదువు చదువు చదివి సంతసమును లేక
  ఆత్మచింతనొందువాడె చదువరుండు.

క్షణములోపలె పుట్టుచు క్షణములోనె
పెరుగునట్టిది ఎప్పుడు ప్రేమ కాదు
చావుపుట్టుక లేనట్టి జీవి హృదిని
నిత్యనిర్మల జ్యోతియై నెగడు ప్రేమ.

క్షమ సత్యము క్షమ ధర్మము
క్షమ యోగము క్షమయహింస క్షమ యజ్ఞమగున్
క్షమయాచారము క్షమ దయ
క్షమయే ఆధారమగును సర్వంబునకున్.